# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

గురువారం, ఫిబ్రవరి 13, 2025 | సంపుటి - 20 | సంచిక 138 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## ప్రారంభమైన మినీ మేడారం

### తరలివస్తున్న వేలాదిమంది భక్తులు

### తగిన ఏర్పాటు చేసిన అధికారులు



హైదరాబాద్ : ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా మేడారం సమ్మక్క-సారలమ్మల జాతర పేరు కాంచింది. ఈ క్రమంలోనే నేటి నుంచి మినీ మేడారం జాతర ప్రారంభం అయ్యింది. బుధవారం నుంచి 15వ తేదీ వరకు జాతర జరగనుంది. సాధారణంగా ప్రతి రెండేళ్లకు ఒకసారి మేడారం మహా జాతర జరుగుతుంది. మధ్యలో వచ్చే ఏడాది మాత్రం మినీ జాతరను నిర్వహిస్తారు. బుధవారం మండమెలిగే పండుగతో మినీ జాతరను ప్రారంభించారు. ఇక గురువారం నాడు మండమెలిగే పూజలు.. శుక్రవారం నాడు భక్తుల మొక్కుల చెల్లింపు.. శనివారం నాడు చిన్నజాతర నిర్వహిస్తారు. 2లో

## స్థానికసంస్థలఎన్నికలకు

# రేవంత్ కసరత్తు

### సీనియర్లకు ప్రాధాన్యం...

### వీహెచ్‌కు కీలక పదవి..?



**సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉన్న సీనియర్లకు గౌరవం ఇస్తూనే తగిన పదవులు కట్టబెట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. అందున స్థానిక సంస్థల ఎన్నికలు కూడా సమీపిస్తున్నందున సీనియర్లతో కలిసి ప్రయాణం చేసేందుకు సిద్ధమవుతున్నారు. అందుకే మంత్రివర్గ విస్తరణ.. నామినేటెడ్ పోస్టుల పైన కాంగ్రెస్ అధి నాయకత్వం ఆచి తూచి వ్యవహరిస్తోంది. ఈ నెలాఖరులో తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి.**

హైదరాబాద్ :

పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యత పైన రాహుల్ గాంధీ ఇప్పటికే సీఎం రేవంత్‌కు స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా వీహెచ్ కు కీలక పదవి ప్రకట నకు ముఖ్యమంత్రి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు పూర్త యింది. పార్టీ సీనియర్లు ఇంకా కొందరికి ప్రాధాన్యత దక్కటం లేదు. ఈ అంశం పైన ఢిల్లీకి లేఖలు వెళ్లాయి. దీంతో, రాహుల్‌గాంధీ పార్టీ సీనియర్లకు తగిన గుర్తింపు ఇవ్వాలని రేవంత్‌కు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా వారికి పదవుల పైన రేవంత్ కసరత్తు చేస్తున్నారు. పార్టీ సీనియర్ నేత వీహెచ్ కు కీలక పదవి దక్కే అవకాశం కని పిస్తోంది. వీహెచ్ పార్టీ అధికారంలోకి వచ్చిన రాజ్యసభ సీటు ఆశించారు. 2లో

## సోమరులను తయారు చేస్తున్న ఉచిత పథకాలు

### కష్టపడకుండానే డబ్బులు వస్తే పనిచేస్తారా

### రాజకీయ పార్టీల ఉచిత హామీలపై సుప్రీం వ్యాఖ్యలు




న్యూఢిల్లీ :

ఉచిత పథకాలతో ప్రజల్లో కష్టపడే తత్వం పోతోందని, వారు పనులకు దూరంగా ఉంటున్నారని, రాజకీయ పార్టీల ఉచిత పథకాలను ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు ఉచితాలను ప్రకటించే పద్ధతి మంచి కాదని వ్యాఖ్యానించింది. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఉచితాలపై ఈ వ్యాఖ్యలు చేసింది. 'ఉచిత పథకాలు మంచివి కావు. దురదృష్ట వశాత్తూ.. వీటి కారణంగా ప్రజలు కష్టపడి పని చేసేందుకు ఇష్టపడడం లేదు. ఉచితంగా రేషన్, డబ్బులు అందుతున్నాయి. ఎలాంటి పని చేయకుండానే డబ్బులు వస్తుండటంతోనే ఇలా జరుగుతోంది. ప్రజలకు సౌకర్యాలు అందించాలన్న మిగతా 2లో

## కోళ్ల బర్డ్‌ఫ్లూపై అధికారుల అలర్ట్

### చికెన్ తక్కువగా తినాలని సూచనలు

### ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే వాహనాల తనిఖీలు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోళ్ళకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకి మరణిస్తుందటంతో తెలంగాణ అధికారులు అలెర్ట్ అయ్యారు. తెలంగాణా ప్రజలు చికెన్ తక్కువగా తినాలని, అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అయితే తెలంగాణాలో బర్డ్ ఫ్లూ లేదని, ఒక్క కేసు కూడా నమోదు కాలేదని అధికారులు సైతం చెప్తున్నారు.

### మాఘపౌర్ణమితో

## కుంభమేళాలో పుణ్యస్నానాలు

### లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు



మాఘ పూర్ణిమ సందర్భంగా మహా కుంభమేళాకు లక్షలాది మంది భక్తులు పోటెత్తారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి దాదాపు కోటిమంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఇంకా లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు.

## ఫ్రాన్స్‌లో యుద్ధవీరులకు మోడీ నివాళి

### మార్సెయిల్‌లో భారత కాన్సులేట్ కార్యాలయానికి ప్రారంభం



న్యూఢిల్లీ : ఫ్రాన్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల అధికారిక పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారంనాడు పలు కార్యక్రమాల్లో మోదీ పాల్గొన్నారు. దక్షిణ మార్సెయిల్‌లోని మజార్గ్యూస్ యుద్ధ శ్మశానవాటికను సందర్శించి మొదటి, రెండవ ప్రపంచ యుద్ధంలో అమరులైన భారత జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రధాని వెంట ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ కూడా హాజరయ్యారు. 2లో

## బిసిలను అణచాలని చూస్తే

# ఊరుకోం

### బిసి లెక్కలన్నీ తప్పుల తడకలే

### మేధోమధన సదస్సులో తీన్మార్ మల్లన్న ఘాటు వ్యాఖ్యలు



హైదరాబాద్ :

ఎవరైనా బీసీ జాతుల గొంతు మీద కాలు పెడతామని అంటే ఊరుకోం బిడ్డా.. మీ అంతు చూస్తామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఘాటు వ్యాఖ్యలు చేశారు. బంజారాహిల్స్ కళింగభవన్‌లో తెలంగాణ ప్రభుత్వ కులగణన సర్వే రిజర్వేషన్ల పూర్వాపరాలు, సమస్యలు, ఆందోళనకర అంశాలు, పరిష్కార మార్గాలు అంశంపై బుధవారం మేధోమధన సదస్సు నిర్వహించారు. -పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ అల్ ఇండియా బ్యాక్ వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్, తెలంగాణ బ్యాక్ వర్డ్ క్లాస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు తీన్మార్ మల్లన్న హాజరై ప్రసంగించారు. మనం ఇప్పటి వరకు కులగణనలోని లోపాలను సమాజం ముందు పెట్టినం.. మిగతా 2లో

## వచ్చేఅసెంబ్లీఎన్నికల్లో

# తమది ఒంటరి పోరాటమే

### బెంగాల్లో వరుసగా నాలుగోసారి విజయం సాధిస్తాం

### సిఎం మమతా బెనర్జీ ఆసక్తికర వ్యాఖ్యలు



కోల్‌కతా : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ ఒంటరి పోరాటంచేస్తుందని ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో 2026 ఏప్రిల్-మే నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ ఒంటరిగానే పోటీ చేస్తుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో ప్రకటించారు. పార్టీ అధికార పత్రిక జాగో బంగ్లా ఈ విషయం వెల్లడించింది. తమకు ఎవరి మద్దతు అవసరం 2లో

## 2008 డీఎస్సీ అభ్యర్థులకు కొలువులు

### సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ)లుగా రెండు, మూడు రోజుల్లో నియామకం

### నెలకు రూ.నెలకు రూ.31,030 చొప్పున చెల్లించనున్న సర్కారు


2

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఉన్న డీఎస్సీ 2008లో నష్టపోయిన బాధితులకు మరోవారంలో కొలువులు దక్కనున్నాయి. గతంలోనే ఈ మేరకు ప్రకటన ఇచ్చినప్పటికీ దానిని రేవంత్ సర్కార్ నిలబెట్టుకోలేదు. దీంతో మరోమారు డీఎస్సీ బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. అయితే ఈసారైనా ప్రభుత్వం మాటమీద నిలబడుతుందో.. లేదో.. అన్నది వేచిచూడాల్సిందే.

## రోజురోజుకూ సాంకేతికరంగం అభివృద్ధి

### టెక్నాలజీని వినియోగించుకొని ప్రగతిని సాధించాలి

### సీఎం నారాచంద్రబాబునాయుడు



అమరావతి : రోజురోజుకూ సాంకేతికరంగం అభివృద్ధి చెందుతుందని, దానికను గుణంగా ఆలోచనాలు చేసినప్పుడే ప్రగతి పథంలో నడవగలుగుతామని ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు అన్నారు. ప్రస్తుతం ప్రపంచాన్ని ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) శాసిస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో డేటానే సంపద అవుతుందని ఆయన పేర్కొన్నారు. మిగతా 2లో

## నోటాను కల్పిత అభ్యర్థిగా

# ప్రతిపాదించిన ఈసీ

### తీవ్రంగా వ్యతిరేకించిన రాజకీయ పార్టీలు

### ఏకగ్రీవాల పేరుతో దందాలను అరికట్టాలన్న ఈసీ

### రాజకీయ పార్టీలతో భేటీలో కుదరని ఏకాభిప్రాయం

**స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటాను కల్పిత అభ్యర్థిగా పెట్టాలా వద్ద అనే అంశం రాజకీయ పార్టీల్లో మిశ్రమ స్పందన వ్యక్తం అయింది. కాంగ్రెస్ పార్టీ ఈ పద్ధతిని వ్యతిరేకించగా బిఆర్ఎస్ పార్టీ స్వాగతించింది. బీజేపీ మాత్రం రాష్ట్ర ఎన్నికల సంఘంకి ఆ అధికారం లేదని.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పింది. సిపిఎం నోటా ఉండాలని.. కానీ అభ్యర్థిగా గుర్తించొద్దని స్పష్టం చేసింది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ లతో రాష్ట్ర ఎన్నికల సంఘం భేటీ అయింది. ట్రయల్ ప్రాతిపదికన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నోటా ను కూడా ఒక కల్పిత అభ్యర్థిగా పెట్టాల వద్దా అనే అంశం రాజకీయ పార్టీ ల అభిప్రాయం తీసుకుంది. రాజకీయ పార్టీల ముందు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రతిపాదనలు పెట్టింది.**



హైదరాబాద్ : ఎన్నికల ఫలితాలను ప్రకటించేటప్పుడు నోటాను 'కల్పిత ఎన్నికల అభ్యర్థి'గా పరిగణించడం, పోటీ చేస్తున్న అభ్యర్థి , 'కల్పిత ఎన్నికల అభ్యర్థి' అంటే నోటా అత్యధిక సంఖ్యలో సమాన ఓట్లను పొందినట్లయితే, పోటీ చేస్తున్న అభ్యర్థి ఎన్నికైనట్లు ప్రకటించడం. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ వ్యక్తిగతంగా 'కల్పిత ఎన్నికల అభ్యర్థి' అంటే నోటా కంటే తక్కువ ఓట్లు పొందినట్లయితే, పోటీ చేస్తున్న అభ్యర్థులలో ఎవరూ ఎన్నికైనట్లు ప్రకటించబడరు. ఎవరు ఎన్నిక కానట్లు అయితే, ఆ స్థానానికి తిరిగి ఎన్నిక నిర్వహించబడుతుంది. నోటా కంటే తక్కువ ఓట్లు పొందిన పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ తిరిగి ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులు కారు? 2లో

# స్థానిక సంస్థల ఎన్నికలకు రేవంత్ కసరత్తు

అవకాశం వస్తే ఖమ్మం నుంచి పార్లమెంట్ కు పోటీ చేయాలని భావించారు. కానీ, సామాజిక – క్షేత్ర స్థాయి పరిస్థితుల్లో ఆయనకు అవకాశం దక్కలేదు. ఇప్పుడు వీహెచ్ కు కొత్త పదవి పైన కసరత్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. శాసనమండలి ఛైర్మన్ పదవి వీహెచ్ కు ఇవ్వటం పైన ప్రతిపాదన తెర మీదకు వచ్చింది. రెండు నెలల్లో ఖాళీ కానున్న ఎమ్మెల్యే కోటా నుంచి వీహెచ్ ను ఎమ్మెల్సీగా ఎంపిక చేయనున్నారు. గతంలోనే వీహెచ్ కు బీసీ కమిషన్ ఛైర్మన్ గా నియమించాలని రేవంత్ భావించారు. అందుకు వీహెచ్ అంగీకరించలేదు. దీంతో, నిరంజన్ కు ఆ పదవి ఖాయమైంది. ఇప్పుడు అసెంబ్లీ స్పీకర్ గా ఎస్సీ వర్గానికి చెందిన ప్రసాద్ కుమార్ ఉన్నారు. మండలి ఛైర్మన్ గా వీహెచ్ కు ఇవ్వాలనేది తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఈ అంశం పైన ఢిల్లీ స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. శాసనమండలి ఛైర్మన్ పదవితో పాటుగా వీహెచ్‌కు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం జాతీయ ఛైర్మన్ గా నియమించే అంశం పైన చర్చ జరుగుతోంది. తెలంగాణలో కుల గణన తరువాత కాంగ్రెస్ పార్టీ నేతలు బీసీలకు ప్రాధాన్యత ఇచ్చేలా నిర్ణయాల పైన కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా పార్టీకి తొలి నుంచి అంకిత భావంతో పని చేస్తున్న బీసీ నేతలకు పదవులు ఇవ్వాలని తాజాగా ఢిల్లీ లో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. వీహెచ్ తో పాటుగా పార్టీలో పలు కీలక పదవుల ను బీసీ నేతలకు ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది. పీసీసీ చీఫ్ పదవి సైతం బీసీ వర్గానికి కేటాయించిన అధినాయకత్వం.. త్వరలోనే కీలక నిర్ణయాలు ప్రకటించేందుకు సిద్ధం అవుతోంది.

## ప్రారంభమైన మినీ మేడారం

జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. మినీ జాతరకు 20 లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు జాతర నేపథ్యంలో వనదేవతలు సమ్మక్క–సారలమ్మల దర్శనం కోసం భక్తులు ఇప్పటికే భారీగా తరలివచ్చారు. దీంతో మేడారం పరిసర ప్రాంతాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. మినీ జాతర కోసం ప్రభుత్వం రూ.5.30 కోట్లు కేటాయించింది. నాలుగు రోజుల పాటు జరగనున్న జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసులతో పాటు పలు శాఖల అధికారులు, వెయ్యి మందికి పైగా సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు.

## కోళ్ల బర్డ్‌ఫ్లూపై అధికారుల అలర్ట్

హైదరాబాద్ : అయినప్పటికీ పలు జాగ్రత్తలు తీసుకుంటున్న తెలంగాణా ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ఆంధ్ర నుండి తెలంగాణకు వచ్చే సరిహద్దుల్లో తనిఖీలు పెంచింది. కోదాడ మండలం రామాపురం చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ కొనసాగుతుంది. ఈ నెల 7తారీకు నుండి రాష్ట్ర బార్డర్ చెక్ పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి బర్డ్ ఫ్లూ లేకపోయినప్పటికీ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వ్యాధి వ్యాప్తించకుండ చర్యలు తీసుకుంటున్నారు. పశు సంవర్ధక శాఖ అధికారులు కోళ్ళ ఫారాలను సందర్శించి రైతులకు సూచనలు చేస్తున్నారు. దాణా తెచ్చే వాహనాలు సైతం శానిటైజ్ చేసి కోళ్ళ ఫారాలకు అనుమతించాలని, శానిటైజ్ చెయ్యకుంటే ఇబ్బంది వస్తుందని అంటున్నారు.ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కాలేదని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి వెల్లడించారు. ఇప్పటివరకు అందిన వివరాల ప్రకారం ఇతర కారణాలతో కోళ్లు మరణించినట్టు ఆయన పేర్కొన్నారు. చికెన్ తినొచ్చా? అధికారులు చెప్తుందిదే తెలంగాణ రాష్ట్రంలో చికెన్ తినడం వల్ల ఎటువంటి ఇబ్బంది లేదని ఆయన తెలిపారు. సోషల్ మీడియాలో చికెన్ తినకూడదని తప్పుడు ప్రచారం జరుగుతుందని, ఆ ప్రచారాన్ని నమ్మవద్దని వెల్లడించారు.వరంగల్, ఖమ్మం జిల్లాలో కోళ్ల మృతి పైన రక్త నమూనాలను ల్యాబ్ కు పంపించామని, అవి ఇతర కారణాలతో మృతి చెందినట్లు తేలిందని ఆయన అన్నారు బర్డ్ ఫ్లూ పై పౌల్ట్రీ రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు.

## మాఘ పౌర్ణమితో కుంభమేళాలో పుణ్యస్నానాలు

ప్రయాగరాజ్ : పౌర్ణమి ప్రత్యేక మైన రోజు కావడంతో లక్షలాదిగా తరలివచ్చారు. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యూపీ ప్రభుత్వం అప్రమత్తం అయింది. కట్టుదిట్టమైన భద్రత కల్పించింది. ఇంకోవైపు యూపీ సీఎం యోగి ఆదిత్య నాథ్ స్వయంగా పరిస్థితుల్ని సమీక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇటీవల జరిగిన దుర్ఘటనలు తిరిగి జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎక్కడికక్కడే పోలీసులు మోహరింపజేశారు. ఇదిలా ఉంటే ప్రయాగ్‌రాజ్‌లో ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాగున్నాయంటూ కితాబు ఇస్తున్నారు. మహా కుంభమేళా ఫిబ్రవరి 26 మహాశివరాత్రి వరకు కొనసాగనుంది.

## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమది ఒంటరి పోరాటమే

లేదని కూడా స్పష్టంచేసింది. ఇండియా బ్లాక్‌లోని కాంగ్రెస్, తదితర పార్టీలతో పొత్తు లేకుండా టీఎంసీ ఒక్కటే మూడింట రెండు వంతుల మెజారిటీతో గెలిచి బెంగాల్‌లో వరుసగా నాలుగోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని మమత ధీమా ప్రకటించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు వేర్వేరుగా పోటీచేయడం వల్ల ఓట్లు చీలి భాజపా గెలవడంతో అందరికీ భయం పట్టుకున్నందునే తృణమూల్ ఇలాంటి అనవసర వ్యాఖ్యలు చేస్తోందని పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యానించింది. మరోవైపు ఢిల్లీలో ఉచితాలు పంచినా ఆప్ ఓడిపోయినట్లే బెంగాల్‌లో కూడా టీఎంసీ పరాజయం పాలవుతుందని రాష్ట్ర భాజపా నాయకులు హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ వెన్నుపోటు వల్లే ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఓడిపోయిందని, ప్రతిపక్ష ఇండియా కూటమిలో కొనసాగే హక్కు కాంగ్రెస్‌కు లేదని టీఎంసీ లోక్ సభ సభ్యుడు కీర్తి ఆజాద్ ఢిల్లీలో విమర్శించారు. కాంగ్రెస్ మునిగిపోతున్న పడవ అయినా అది మిత్రపక్షాలను వెన్నుపోటు పొడుస్తూనే ఉందని వ్యాఖ్యానించారు. భాజపా ఇతర పార్టీలతో కలసి రాష్టాల్లో అధికారంలోకి వచ్చిందనే వాస్తవాన్ని కాంగ్రెస్ గ్రహించడం లేదన్నారు. కాంగ్రెస్‌కు దురహంకారం ఎక్కువని, ఇండియా కూటమికి మమతా బెనర్జీయే నాయకత్వం వహించాలని ఆజాద్ పేర్కొన్నారు. మరోవైపు ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను ఓడించడానికి ఏర్పడిందని, రాష్టాల్లో కూటమి కట్టే విషయమై విడిగా చర్చిస్తామని కాంగ్రెస్ నాయకుడు ఉజ్వల్ రమణ్ సింగ్ వివరించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుకు ఆప్ నిరాకరించడం వల్లనే విడిగా పోటీచేశామని కాంగ్రెస్ తెలిపింది.

## మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాస తీర్మానాలకు రంగం సిద్ధం

### నాలుగేళ్లు గడుస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీ పావులు

### పరిస్థితులకనుగుణంగా నిర్ణయం : మాజీ మంత్రి తలసానిశ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్ : జీహెచ్ఎంసీ ప్రస్తుత పాలక మండలికి నాలుగేళ్లు పూర్తి కావడంతో ఏ క్షణంలోనైనా మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు ప్లాన్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జీహెచ్ఎంసీ రాజకీయాలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాసంపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాసంపై నిర్ణయం ఉంటుందని చెప్పారు. నెంబర్ గేమ్‌ను బట్టి మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం ఉంటుందని తెలిపారు. బీసీ మూవ్‌మెంట్ తెలంగాణ రాష్ట్రంలో బలంగా ఉందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన కులగణన సర్వేలో చాలా తప్పులు ఉన్నాయని తెలిపారు. కేసీఆర్ చేసిన సర్వేలో బీసీలు 51శాతం మంది ఉన్నారన్నారు. తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు 90 శాతం మంది ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో కోటి మందికి పైగా పిల్లలున్నారని చెప్పారు. రాష్ట్రంలో 60 లక్షల మందికి లెక్కలు లేవన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు అసెంబ్లీలో చట్టం చేసి 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే బీసీలు ఒప్పుకోరని చెప్పుకొచ్చారు. పునర్విభజన జరిగితే అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు తెలంగాణకు తగ్గుతాయన్నారు. ప్రభుత్వం రీసర్వే చేస్తే కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు సర్వేలో పాల్గొంటారని స్పష్టం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేశాక రేవంత్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై బీసీ సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

## నోటాను కల్పిత అభ్యర్థిగా ప్రతిపాదించిన ఈసీ

తిరిగి ఎన్నికలో, నోటాకు మళ్లీ అత్యధిక ఓట్లు వస్తే, తదుపరి ఎన్నికలు నిర్వహించబడవు, అత్యధిక ఓట్లు ఉన్న పోటీ చేస్తున్న అభ్యర్థి ఎన్నికైనట్లు ప్రకటించబడుతుంది. ఈ ప్రతిపాదనలు పై రాజకీయ పార్టీ లు భిన్న అభిప్రాయాలను వెలిబుచ్చాయి. కాంగ్రెస్ పార్టీ కల్పిత అభ్యర్థిగా పరిగణించడాన్ని వ్యతిరేకించింది? నోటా ఎక్కువ ఓట్లు వచ్చి ఎన్నికలు మళ్ళీ నిర్వహించాలని అంటే అటు ప్రభుత్వానికి, ఇటు అభ్యర్థులకు ఖర్చు పెరుగుతుందని ఆ పార్టీ నేతలు అన్నారు. ఏకగ్రీవానికి బెదిరింపులు, బలప్రదర్శన చేసే అవకాశం ఉందనీ ఆ పార్టీ పేర్కొంది. సుప్రీంకోర్టు లో కేసు ఉందని మా అభిప్రాయం ఇప్పుడే చెప్పలేమని బీజేపీ అంది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ కు ఈ విషయంపై నిర్ణయం తీసుకునే అవకాశం లేదనీ పంచాయతీ ఎన్నికలు ఎలా నిర్వహించాలనే నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వం అని స్పష్టం చేసింది. నోటా తో ఎన్నిక ఉండాలని సుప్రీంకోర్టు ఇప్పటికే చెప్పింది. నోట ఉండాలని అయితే అభ్యర్థి కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తె రీ ఎలక్షన్ కరెక్ట్ కాదనీ సిపిఎం చెప్పింది?.తమ అభిప్రాయాన్ని రెండు రోజుల్లో చెప్తామని టిటీడీపీ చెప్పగా సింగల్ కాండిడేట్ ఉన్నా నోటా ఉండాలన్న జనసేన పార్టీ.. చెప్పింది. రాష్ట్రంలో సర్పంచ్ పదవుల వేలంను అరికట్టడానికి కల్పిత అభ్యర్థి నిర్ణయం అని రాష్ట్ర ఎన్నికల సంఘం అంటుంది. ఇప్పటికే మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలు కల్పిత అభ్యర్థి విధానం ను అవలంభిస్తున్నాయని ఎన్నికల సంఘం రాజకీయ పార్టీల ముందు పెట్టింది.

## బిసిలను అణచాలని చూస్తే ఊరుకోం

ప్రభుత్వం చేసిన బీసీ లెక్కలు తప్పు అనడానికి అనేక విధాలుగా ప్రజల ముందు ఉంచామన్నారు. ప్రభుత్వం బీసీ లెక్కల తప్పిదాలను ఎప్పుడు సరిచేస్తదో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల ఆర్థిక పరమైన లెక్కలు కూడా బయటికి రావాలని.. 2 లక్షల 91 వేల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు సగం రావాల్సిందేనన్నారు. ఉమ్మడి ఏపీ నుంచి కూడా బీసీలపై జరిగిన ఆర్థిక దోపిడి అంశాన్ని చర్చకు తీసుకోవాలని.. బీసీలకు జరిగిన అన్యాయన్ని అన్ని రంగాల్లో లెక్కలు తీస్కొని ప్రజలకు వివరించాలని కోరారు. బీసీలకు సీట్లు పార్టీలు వేసే బిచ్చమ్ అని.. అదే రిజర్వేషన్స్ మాత్రం రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు అని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలనే గెలిపించాలి.. ఆ దిశగా మనం ప్రణాళిక రచించాలి.. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మైండ్ బ్లాక్ అయ్యే రిజల్ట్స్ ఉండాలని బీసీలకు మల్లన్న పిలుపునిచ్చారు. బీసీల కోసం గొంతెత్తి నాకు పార్టీ నోటీసులు ఇస్తే.. ఈ సభ నాకు మద్దతుగా నిలిచిందని ధన్యవాదాలు తెలిపారు. బీసీ రిజర్వేషన్స్ సాధించడమే మా అందరి అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పుడున్నది గత తెలంగాణ కాదు.. ఎడ్డి తెలంగాణ కాదు.. చైతన్యం ఉన్న తెలంగాణ.. బీసీలు చైత్యంతో ఉన్నారని అన్నారు. జిల్లా, గ్రామీణ ప్రాంతంలో బీసీలు చర్చ పెట్టాలని.. తీన్మార్ మల్లన్న టీంలో ఆధ్వర్యంలో కొన్ని గ్రామాల్లో జనాభా లెక్కలు తీస్తామని.. ఆ లెక్కలను గ్రామ పంచాయతీ దగ్గర అతికిస్తామని పేర్కొన్నారు.

## 2008 డీఎస్సీ అభ్యర్థులకు కొలువులు


అసలు సంగతేమంటే.. డీఎస్సీ–2008లో నష్టపోయిన మొత్తం 1399 మంది అభ్యర్థులకు విద్యాశాఖ వారం రోజుల్లో కాంట్రాక్టు విధానంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. వారందరినీ సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ)లుగా నియమిస్తూ ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. ఉమ్మడి ఏపీలో అప్పట్లో చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయంతో ఉత్తమ మార్కులు సాధించినా.. మెరిట్ జాబితాలో ఉన్నప్పటికీ బీఈడీ అభ్యర్థులు ఉద్యోగాలకు దూరమయ్యారు. దీంతో అప్పటి నుంచి తమకు న్యాయం చేయాలని వారంతా సర్కార్‌తో పోరాడుతూనే ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వారందరికీ కాంట్రాక్టు విధానంలో ఎస్జీటీ ఉద్యోగాలను మినిమం టైమ్ స్కేల్ కింద ఇవ్వాలని 2024 సెప్టెంబరు 24న నిర్ణయం తీసుకుంది. 2008 డీఎస్సీలో నష్టపోయిన వారిలో 2,367 మంది అభ్యర్థులు ఉన్నట్లు పాఠశాల విద్యాశాఖ లెక్కలు తీసింది. ఆ మేరకు వారందరికీ ధ్రువపత్రాల పరిశీలన కూడా చేశారు. రేవంత్ సర్కార్ ఆదేశాల మేరకు వీరందరికి కాంట్రాక్టు విధానంలో ఉపాధ్యాయ ఉద్యోగాలిచ్చేందుకు అధికారులు కూడా ఏర్పాట్లు చేశారు. మరో వారం రోజుల్లో వారికి నియామకపత్రాలు అందజేస్తామని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు గత ఏడాది నవంబర్‌లో ఈవీ నరసింహారెడ్డి ప్రకటించారు కూడా. వీరికి వేతనం కింద నెలకు రూ.31,030 చొప్పున చెల్లించనున్నట్లు తెలిపారు. కానీ ఆ తర్వాత అతీగతీ లేకుండా పోయింది. మళ్లీ దాదాపు రెండు నెలల తర్వాత ఆ ప్రస్తావన మళ్లీ తెరపైకి వచ్చింది. తాజాగా డీఎస్సీ బాధితులందరి ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలని, కాంట్రాక్టు విధానంలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ)గా పని చేస్తామంటూ ధ్రువీకరించాలని విద్యాశాఖ కోరింది. ఇందుకు 1382 మంది అంగీకరించారు. నియామక పత్రాల అందజేతకు సీఎం రేవంత్‌రెడ్డి నెల రోజుల క్రితమే ఆమోదం తెలిపారు. అయితే కొందరు హైకోర్టును ఆశ్రయించగా.. ఉద్యోగాలు ఇవ్వడంపై జాప్యం నెలకొంది. తాజాగా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చేందుకు ఎట్టకేలకు సిద్ధమైంది.

## రోజురోజుకూ సాంకేతికరంగం అభివృద్ధి

హెల్త్‌లో డేటా కింగ్‌గా కిమ్స్ ఛైర్మన్ బి. భాస్కర్ రావు తయారవుతారని ఆయన స్పష్టం చేశారు. బుధవారం గుంటూరులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 2000 ఏడాదిలో కిమ్స్ తొలి ఆసుపత్రిని తాను ప్రారంభించానని ఆయన గుర్తు చేసుకున్నారు. 25 ఏళ్లలో 5 వేల బెడ్స్‌తో ఐదు రాష్ట్రాలకు కిమ్స్ విస్తరించిందని చెప్పారు. క్రమశిక్షణతోనే ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. సంస్థ బాగుండాలంటే.. అందులో పని చేసే వాళ్లు భాగస్వాములు కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. 1995లో తాను ఐటీ గురించి చెప్పానన్నారు. ఇప్పుడు ఏఐ గురించి చెబుతున్నానని పేర్కొన్నారు. భవిష్యత్తులో భారతీయులు అద్భుతాలు సృష్టించనున్నారని చంద్రబాబు తెలిపారు. జెనిటికల్ పరీక్షలు ద్వారా ఎటువంటి రోగాలు రాబోతున్నాయో కూడా భవిష్యత్తులో తెలియనుందన్నారు. అయితే హెల్త్ కాస్ట్ తగ్గాలని ఆయన పేర్కొన్నారు. ఆయుష్మాన్ భవలో భాగస్వాములమవుతామన్నారు. నేచురల్ ఫుడ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నెంబర్‌వన్ చేస్తున్నామని చెప్పారు. దేశంలో ఉత్పత్తి అయ్యే గ్రీన్ ఎనర్జీలో 1/3 ఏపీలో చేయబోతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వెహికిల్స్ వాడే రోజు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఇక వాట్సాప్‌లోనే అన్ని సర్టిఫికేట్స్ పొందవచ్చునని చెప్పారు. వివిధ రంగంలో స్కిల్ డెవలప్‌మెంట్ చేయడానికి ముం దుకొచ్చే వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. సమర్థవంతమైన నాయకుడు, సుస్థిరపాలన ఉంటే అభివృద్ధి ఉంటుందన్నారు. 2019లో తెలుగు దేశం పార్టీ గెలిచి ఉంటే ఇంత విధ్వంసం జరిగి ఉండేదా? అని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ప్రశ్నించారు. ప్రాధాన్యత తెలియని వ్యక్తులు పాలన చేస్తే.. ఎలా ఉంటుందో ఎయిమ్స్‌కి నీళ్లు ఇవ్వలేక పోవడమే అందుకు నిదర్శమని ఆయన పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 300 పడకలతో స్పెషాలిటీ హాస్పటల్ ఏర్పాటు చేసే దిశగా తాము ఆలోచన చేస్తున్నామని చెప్పారు. పేదలకు అందుబాటులో మెరుగైన పాలన ఇచ్చేలా తాము ముందుకెళ్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. 15 శాతం ఆర్థిక వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన వివరించారు. రాబోయే బడ్జెట్‌ను అందుకు అనుగుణంగా రూపకల్పన చేస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

## అయోధ్య ప్రధాన పూజారి కన్నుమూత

### ఆచార్య సత్యేంద్ర కుమార్ దాస్ మృతి చెందినట్లు ధృవీకరణ



అయోధ్య, : అయోధ్యలోని శ్రీ రామ జన్మభూమి ఆలయ ప్రధాన పూజారి, అయోధ్య ధామ్ ఆచార్య సత్యేంద్ర కుమార్ దాస్ మహారాజ్ బుధవారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. 83 ఏళ్ల వయసున్న పూజారి.. ఫిబ్రవరి 3న బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి లక్నో సంజయ్ గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిలో చేరారు. తొమ్మిది రోజులుగా చికిత్స పొందుతున్న ... ఆయన ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచినట్లు డాక్టర్లు ప్రకటించారు. ఆచార్య సత్యేంద్ర దాస్ ఈ నెల ప్రారంభంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ ఆసుపత్రిలో చేరారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఆయనను ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి సంతాపం తెలిపారు. బాబ్రీ మసీదు కూల్చివేసిన సమయంలోనూ రామమందిరానికి పూజారిగా ఉన్నారు. బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సమయంలోనూ సత్యేంద్రదాస్ కీలక పాత్ర వహించారు. అయోధ్య రామాలయం ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ 20 ఏళ్ల వయస్సులోనే ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకున్నారు. సత్యేంద్ర దాస్ 34 సంవత్సరాలుగా శ్రీరామ జన్మభూమిలో ప్రధాన పూజారిగా పనిచే స్తున్నారు. ఆయన 1945 మే 20న ఉత్తరప్రదేశ్‌లోని సంత్ కబీర్ నగర్ జిల్లాలో జన్మించారు. సత్యేంద్ర దాస్ తన గురువు అభిరామ్ దాస్ జీ ప్రభావంతో 1958లో అంటే 13 ఏళ్ల వయస్సులో సన్యాసం స్వీకరించారు. అప్పటి నుంచీ ఆయన తన ఇంటిని వదిలి ఆశ్రమంలో నివసించారు. నిర్వాణి అఖాడకు చెందిన దాస్, అయోధ్యలో అందుబాటులో ఉండే సాధువులలో ఒకరు. అయోధ్యతో పాటు, రామాలయంలో జరుగుతున్న పరిణామాలపై... దేశవ్యాప్తంగా అనేక మంది మీడియా వ్యక్తులకు అందుబాటులో ఉండే వారు. రామమందిర ఉద్యమం, ముందుకు సాగే మార్గంపై మీడియా అడిగిన అన్ని ప్రశ్నలకు దాస్ చాలా ఓపికగా సమాధానాలిచ్చేవారు. కూల్చివేత తర్వాత కూడా, దాస్ ప్రధాన పూజారిగా కొనసాగారు. రామ్ లల్లా విగ్రహానికి తాత్కాలికంగా ప్రతిష్ఠించినప్పుడు పూజలు చేశారు.

## సోమరులను తయారు చేస్తున్న ఉచిత పథకాలు

ప్రభుత్వాల ఉద్దేశం మంచిదే. కానీ, వారిని దేశ అభివృద్ధిలో భాగం చేయాలి. ఉచితాల ద్వారా అలా జరుగుతోందా..?ఎన్నికల్లో ఉచిత పథకాలు ప్రకటించే పద్ధతి సరైనది కాదు‘ అని జస్టిస్ బీఆర్.గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేంద్రప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన మిషన్‌ను పూర్తి చేసే పనిలో ఉందని.. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించేందుకు యోచిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ఈసందర్భంగా ధర్మాసనానికి తెలిపారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. ఈ నిర్మూలన మిషన్ ఎంతకాలం పాటు పని చేస్తుందో తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ పిటిషన్‌ను మరో ఆరు వారాల తర్వాత విచారిస్తామని వాయిదా వేసింది.

## ఫ్రాన్స్‌లో యుద్ధవీరులకు మోడీ నివాళి

మార్సెయిల్‌లో భారత కాన్సులేట్ కార్యాలయాన్ని కూడా మోదీ, మాక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. కాంటినెంటల్ ఫ్రాన్స్‌లో తొలి భారత రాయబార కార్యాలయం ప్రారంభించడం ద్వారా ఇరుదేశాల మధ్య మరింత లోతైన సంబంధాలు ఏర్పడటంతో పాటు ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాలు, మల్టీ డైమన్షయల్ రిలేషన్‌షిప్‌కు బలం చేకూరిందని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు. దీనికి ముందు పారిస్‌లో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్‌లో మాక్రాన్‌తో కలిసి సదస్సుకు మోద అధ్యక్షత వహించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఫ్రాన్స్ పర్యటన అనంతరం ప్రధాని అమెరికా పర్యటనకు బయలుదేరుతున్నారు. రెండో దఫా అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టిన తర్వాత ఆదేశంలో మోదీ పర్యటించనుండటం ఇదే ప్రథమం.

## అసమానతల నిర్మూలనకే ఎస్సీ వర్గీకరణ

### ఇది ఎవరికో లాభం చేకూర్చే విషయం కాదు

### ప్రతి గడపకు ఎస్సీవర్గీకరణ లక్ష్యం తీసుకెళ్లాలి

### ఎస్సీ ఎమ్మెల్సీలకు మంత్రి దామోదర సూచన

హైదరాబాద్ : అణిచివేతకు గురైన కులాల్లోని అసమానతలను రూపుమాపేందుకే ఎస్సీ వర్గీకరణ అని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వర్గీకరణ అనేది ఏ కులానికో, వర్గానికో వ్యతిరేకం కాదన్నారు. ఇదే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి గడపకూ వర్గీకరణ ఫలాలను తీసుకెళ్లే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, లక్ష్మీకాంతరావు, అడ్లూరి లక్ష్మణ్, మందుల సామెల్, వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు తదితరులు ఇవాళ హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి దామోదర రాజనర్సింహతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మంత్రి వారికి దిశానిర్దేశర చేశారు. ఇతరులు సృష్టించే అపోహలను, అనుమానాలను నమ్మి ప్రజలు ఆందోళనకు గురికాకుండా చూసే బాధ్యత ఎమ్మెల్యేలది, మాదిగ సామాజిక వర్గ నాయకులదేనన్నారు. వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ మొదట్నుంచీ మద్దతుగా నిలిచిందని మంత్రి గుర్తు చేశారు. 2006 నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులో, 2024 ఆగస్ట్ ఒకటిన తీర్పు వచ్చిందని, తీర్పు వచ్చిన గంట లోపలే వర్గీకరణకు అనుకూలంగా సీఎం రేవంత్ ప్రకటన చేశారని గుర్తు చేశారు. ఆ వెంటనే కేబినెట్ సబ్ కమిటీ, ఆ తర్వాత వన్ మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్‌ను నియమించారన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా, జనాభా, విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, సామాజిక స్థితిగతులను కమిషన్ అధ్యయనం చేసిందని తెలిపారు. అన్నిరకాల విశ్లేషణ, అధ్యయనం తర్వాత శాస్త్రీయంగా రూపొందించిన రిపోర్ట్‌ను అందించిందన్నారు. ఇది కాంగ్రెస్ కమిట్‌మెంట్ అని, సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ప్రజలకు చెప్పాలన్నారు. ప్రతి కులానికి న్యాయం చేసేలా వర్గీకరణ ఉందని మంత్రి తెలిపారు. అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూప్ వన్‌లో, 18 కులాలను గ్రూప్2లో, కొంత మెరుగ్గా ఉన్న కులాలను గ్రూప్3లో చేర్చాలని కమిషన్ సూచించిందన్నారు. మాదిగ, మాదిగ సామాజిక వర్గాల దశాబ్దాల ఆకాంక్ష నెరవేరుతున్న ఈ తరుణాన్ని పండుగలా జరుపుకోవాలని సూచించారు.

## ఆందోళన బాటలో ఆటో డ్రైవర్లు

### ఇచ్చిన హామీల అమలుకు డిమాండ్

హైదరాబాద్ : ఆటో డ్రైవర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ ఆటో డ్రైవర్స్ ఐకాస ఆందోళనకు సిద్ధమవుతోంది. ఈనెల 15న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనల కార్యక్రమాలతో పాటు 24న అన్ని రాజకీయ పార్టీలతో రాష్ట్ర స్థాయి సమావేశాలు ఏర్పాటు చేస్తామని ఐకాస కన్వీనర్ వెంకటేశం తెలిపారు. ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. సమస్యలపై సమ్మెకు పిలుపునిస్తే.. ఇంటికి పిలిపించి చర్చించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ నాలుగు నెలలు గడుస్తున్నా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఆటో కార్మికులకు నెలకు రూ.12వేలు ఇస్తామని ఇప్పటికీ ఆ పథకం అమలు చేయలేదన్నారు. మరో వైపు మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారన్నారు. బడ్జెట్ సమయంలో ఆటో కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులకు గుడ్‌న్యూస్

## మరిన్ని పుష్పక్ సర్వీసులను నడపనున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ వెల్లడి



హైదరాబాద్ : శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. మరిన్ని పుష్పక్ సర్వీసులను నడపనున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఇప్పటికే కొన్ని బస్సులు సర్వీసులందిస్తుండగా.. మరో 6 సర్వీసులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ బస్సులు సికింద్రాబాద్ జేబీఎస్ నుంచి రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు మీదుగా రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. మొత్తం ఆ బస్సులు 24 ట్రిప్పులు నడుపుతున్నట్లు వెల్లడించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, రాణిగంజ్, సెక్రటేరియట్, రవీంద్రభారతి, హజ్‌హౌజ్, నాంపల్లి, గాంధీభవన్, ఎంజే మార్కెట్, అఫ్జల్‌గంజ్, బహదూర్‌పుర, ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 12.55 గంటలకు మొదటి బస్సు, రాత్రి 11.55 గంటలకు చివరి బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎయిర్‌పోర్టు నుంచి మధ్యాహ్నం 12.50 గంటలకు మొదటి బస్సు, రాత్రి 11.50 గంటలకు చివరి బస్సు బయల్దేరుతుందని అన్నారు. ప్రయాణికులు ఈ విషయాలను గమనించాలన్నారు. కాగా, పుష్పక్ బస్సుల నడుపుతుండటంతో ప్రయాణికులకు టెన్షన్ తీరనుంది. ప్రస్తుతం పలువురు ఎక్కువ డబ్బులు చెల్లించి క్యాబ్‌లు బుక్ చేసుకొని వెళ్తుండగా.. ఇప్పుడు ఆ తిప్పలు తప్పనున్నాయి. అధికారుల తనిఖీలతో నిలిచిన బస్సులుఇక హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారుల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలకు భయపడి ఏపీ నుంచి హైదరాబాద్ వచ్చే కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను డ్రైవర్లు వనస్థలిపురంలోనే నిలిపివేశారు. రవాణాశాఖ అధికారుల తనిఖీలు పూర్తయ్యే వరకు బస్సులను సిటీలోకి తీసుకెళ్లబోమని డ్రైవర్లు ప్రయాణికులకు తెగేసి చెప్పారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా ట్రావెల్స్ కాల్ సెంటర్లకి కాల్ చేసి మాట్లాడితే వారు నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైనా పత్రాలు లేకుండా రోడ్లపై బస్సులు ఎలా నడుపుతున్నారని డ్రైవర్లను నిలదీశారు. బస్సుల్లో వృద్ధులు, చంటి పిల్లలు ఉన్నారని.. తాము వెళ్లాల్సిన చోటుకు తీసుకెళ్లకుండా ఇక్కడే గంటలకొద్ది నిలిపేయటం ఏంటని మండిపడ్డారు. డ్రైవర్, కాల్ సెంటర్ల నుంచి సరైన స్పందన రాకపోవటంతో కొందరు క్యాబ్‌లు బుక్ చేసుకొని వెళ్లిపోయారు.

# రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కేసులు

## బిజెపి ప్రభుత్వంపై విహెచ్ మండిపాటు

హైదరాబాద్ : అధికార దుర్వినియోగంతో పాటు, రాజకీయ కక్ష సాధింపులో భాగంగా ప్రతిపక్ష నేతలపై కేసులు బనాయిస్తున్నారని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ వీ. హనుమంతరావు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అధికార పార్టీకి చెందిన నేతలపై చేసిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వీహెచ్ మాట్లాడుతూ, 2022 డిసెంబర్ 16న రాహుల్ గాంధీపై దేశ రక్షణకు సంబంధించిన అనుచిత వ్యాఖ్యల కేసు నమోదు చేసి, మార్చి 24న లక్నో కోర్టుకు హాజరుకావాలని సమన్లు పంపారని గుర్తుచేశారు. అదే సమయంలో, తాను స్వయంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యాంగాన్ని అవమానించారని, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ స్వాతంత్ర్యాన్ని అవమానించారని ఫిర్యాదు చేసినా, వారిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చట్టం అందరికీ సమానమేనని చెప్పుకుంటారు. కానీ రాహుల్ గాంధీకి ఒక న్యాయం, అమిత్ షా, మోహన్ భగవత్‌లకు మరో న్యాయమా?' అంటూ ప్రశ్నించారు. అదే విధంగా, మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా, ఫిబ్రవరి 14న ప్రజలు, పార్టీ శ్రేణులు ఆయన సమాధి వద్దకు రావాలని వీహెచ్ పిలుపునిచ్చారు. గతంలో సీఎం జగన్ కర్నూలులో సంజీవయ్య స్మృతివనం నిర్మిస్తామని ప్రకటించి, 2 కోట్లు కేటాయించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి కనిపించలేదని విమర్శించారు. అంబేద్కర్ తర్వాత ప్రజల పక్షాన నిలిచిన గొప్ప నాయకుడు సంజీవయ్య అని కొనియాడిన వీహెచ్, ఆయనకు మరింత గుర్తింపు కల్పించేందుకు కర్నూల్ జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలని కోరారు.

# వరంగల్ వచ్చే ధైర్యం చేయని రాహుల్

## ప్రజలు నిలదీస్తారనే భాయంతో పారిపోయారు

## బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శలు

హైదరాబాద్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వరంగల్ వచ్చే ధైర్యం లేక పారిపోయారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జాగృతి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలపై నిలదీస్తారనే భయంతో రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఆరోపించారు. వరంగల్ లో రాహుల్ గాంధీ చ్చిన రైతు డిక్లరేషన్ అమలే కాలేదని విమర్శించారు. ఇచ్చిన మాట తప్పితే ప్రజలు ఊరుకోబోరని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మకం లేక ఎన్నికలప్పుడు ఢిల్లీ నుంచి నాయకులను తీసుకొచ్చారని విమర్శించారు. సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ వచ్చి చిలుక పలుకులు పలికారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ముఖం కాదు. సోనియా, ప్రియాంక, రాహుల్ గాంధీల ముఖం చూసి మహిళలు కొంత వరకు ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు అయినా మహిళలకు 2500 ఇవ్వడం లేదు . రేవంత్ రెడ్డి మహిళలకు రూ .35 వేల చొప్పున బాకీ పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో క్రైమ్ రేటు 20 శాతం పెరిగిందని అన్నారు. ఆడపిల్ల కాలేజీకి వెళ్తే ఇంటికొచ్చే వరకు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని, శివారు ప్రాంతాల్లోని ఇళ్లలో దొంగలు చెలరేగుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఒక్క మతకల్లోలం జరగలేదని,రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాకా ఎక్కడో ఒక చోట తరుచూ మతకల్లోలాలు జరుగుతున్నాయి,రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీటీవీల్లో 70 శాతం పనిచేయడం లేదని ఆరోపించారు. భద్రత కోసం కూడా మహిళలు పోరాటం చేయాల్సిరావడం బాధాకరమని అన్నారు. కేసీఆర్ పై అక్కసుతో కేసీఆర్ కిట్ లను నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తుందని కవిత దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ ఆస్పత్రులపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చి బస్సుల సంఖ్యను తగ్గించారని, బీడీ కార్మికులకు పెన్షన్ ను 4 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# కుంభమేళా మృతుల సంఖ్యపై తప్పుడు లెక్కలు

## బెంగాల్ సిఎం మమతా బెనర్జీ విమర్శలు

కోల్‌కతా : యూపీలోని ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటన మృతుల సంఖ్యపై టీఎంసీ అధినేత్రి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు. యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం కచ్చితమైన మృతుల లెక్కలు చెప్పలేదని ఆన్నారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో బుధవారంనాడు బడ్జెట్ సమర్పణ అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ, పెద్ద సంఖ్యలో భక్తులు కుంభమేళాకు వస్తున్నప్పటికీ సరైన ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. మహాకుంభ్ తొక్కిసలాట ఘటనలో చాలా మంది చనిపోయారు. ఎంతమంది చనిపోయారనే కచ్చితమైన లెక్కలను ప్రభుత్వం విడుదల చేయలేదు. మహాకుంభ్‌కు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నట్టు హైప్ సృష్టించారు. కానీ వేదకల వద్ద సరైన ఏర్పాట్లు చేయలేదు' అని మమతా బెనర్జీ ఆరోపించారు. మౌని అమావాస్య సందర్భంగా జనవరి 29వ తేదీ తెల్లవారు జామున ఒంటిగంట, రెండు గంటల మధ్య త్రివేణి సంగమం వద్ద తొక్కిసలాట జరిగిన 30 మంది ప్రాణాలు కోల్పోగా, 60 మంది వరకూ గాయపడ్డారు. మమతా బెనర్జీ కంటే ముందు సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సైతం తొక్కిసలాట మృతుల సంఖ్యను యూపీ బీజేపీ సర్కార్ దాచిపెట్టిందని, తప్పుడు లెక్కలు చెప్పిందని ఇటీవల ఆరోపించారు. కుంభమేళా ఏర్పాట్లలో అవకతవకలను కప్పిపుచ్చే ప్రయత్నం జరిగిందన్నారు. ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, మహాకుంభ్ ఏర్పాట్ల పర్యవేక్షణను ఆర్మీకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

# శివరాత్రికి శైవాలయాల్లో ఏర్పాట్లు

## ఆలయ పరిసరాల్లో మద్యం అమ్మకాలపై దృష్టి

## అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం

హైదరాబాద్ : మహాశివరాత్రి పర్వదినం నేపథ్యంలో అన్ని శైవక్షేత్రాల్లో పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. శైవాలయాల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆలయాల దగ్గర ఎక్కడా మద్యం అమ్మకాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలి. మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉపవాసం ఉండే భక్తులకు ఉచితంగా పండ్లు, అల్పాహారం పంపిణీ చేయాలని తెలిపారు. మహాశివరాత్రి ఏర్పాట్లపై మంత్రి దేవాదాయశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే వేములవాడ, కాళేశ్వరం, కీసర రామలింగేశ్వరస్వామి, ఏడుపాయల వనదుర్గాభవానీ అమ్మవారు, రామప్ప, మేళ్లచెరువు, పానగల్లు, పాలకుర్తి, వేయి స్తంభాల గుడి, కాశీబుగ్గ, భద్రకాళి తదితర ఆలయాల్లో అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. ' అందుకోసం ప్రత్యేకంగా గస్తీ ఏర్పాటు చేయాలి. అన్ని ఆలయాలను సమన్వయం చేసేందుకు హైదరాబాద్‌లో ఎండోమెంట్ కమిషనరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలి. గోదావరి, ఇతర నదీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో నదీ హారతి కార్యక్రమం చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో అన్ని ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిపేందుకు జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులతో సమన్వయం అవసరం' అని మంత్రి సూచించారు.

# మాఘపూర్ణిమతో కుంభమేళాకు పోటెత్తిన భక్తులు

## కోటిన్నరకు పైగా భక్తులు వచ్చినట్లు వెల్లడ

ప్రయాగ్‌రాజ్ : ప్రయాగ్‌రాజ్‌లో ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా కన్నుల పండువగా కొనసాగుతోంది. దేశ, విదేశాల నుంచి ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. కుంభమేళాలో మరో పుణ్య ఘట్టమైన మాఘ పూర్ణిమ వేళ బుధవారం మధ్యాహ్నం 12గంటల వరకే త్రివేణీ సంగమం, ఇతర ఘాట్‌ల వద్ద దాదాపు 1.60 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. బుధవారం మాఘ పూర్ణిమ వేళ భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో మరింత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు కుంభ్ మేళా డీఐజీ వైభవ్ కృష్ణ తెలిపారు. ఈ మాఘ పూర్ణిమ స్నానంతో తమ నెల రోజుల కల్పవాసీ దీక్ష ముగించుకొని దాదాపు 10లక్షల మంది మహా కుంభమేళా నుంచి తిరుగు ప్రయాణం కానున్నారు. దీంతో వారంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పార్కింగ్ స్థలాలను మాత్రమే వినియోగించాలని అధికారులు కల్పవాసీలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు, భక్తులపై హెలికాప్టర్ నుంచి పూల వర్షం కురిపించారు. లఖ్‌నవూలోని తన అధికారిక నివాసం నుంచి సీఎం యోగి ఆదిత్యనాథ్ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వార్‌రూమ్‌లో సీఎంతో పాటు డీజీపీ ప్రశాంత్ కుమార్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ ప్రసాద్, సీఎం కార్యాలయం అధికారులు ఉన్నారు. మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే తన సతీమణితో కలిసి త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించారు. ప్రయాగ్‌రాజ్‌కు మంగళవారమే చేరుకున్నారు. సాధారణ యాత్రకుడిగా పడవపై సంగమం వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు. మరోవైపు, ఫిబ్రవరి 11వ తేదీ వరకు మొత్తంగా 46.25 కోట్ల మంది భక్తులు మహా కుంభ్‌కు విచ్చేసి పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు వెల్లడించారు.

# వనపర్తి జిల్లాకు ఐటి టవర్ మంజూరు

## ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి

హైదరాబాద్ : వనపర్తి జిల్లాకు ఐటి టవర్ మంజూరు అయిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి తెలిపారు. బుధవారం బిఆర్ అంబేద్కర్ సచివాలయ మీడియా సెంటర్‌లో విలేకరుల సమావేశంలో జి. చిన్నారెడ్డి ఐ.టి టవర్ మంజూరు అంశాలను వెల్లడించారు. వనపర్తి లో ఐటీ టవర్ నిర్మాణం కోసం రూ 22 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఐ టీ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని చిన్నారెడ్డి తెలిపారు. వనపర్తి పట్టణ శివారులోని నాగవరం గ్రామంలోని రెండు ఎకరాల స్థలంలో ఐటీ టవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. 25 వేల చదరపు అడుగులలో ఐటి టవర్ భవన నిర్మాణం జరుగుతుందని ఈ భవనంలో ఏకకాలంలో 250 మంది ఐటి ప్రొఫెషనల్స్ పనిచేసుకునే సౌకర్యం ఉంటుందని చిన్నారెడ్డి వివరించారు. గ్రామీణ ప్రాంతంలో ఐటి హబ్‌లను అభివృద్ధి చేయడంలో భాగంగా వనపర్తికి ఐటి టవర్ మంజూరు అయ్యిందని, సామాజిక, ఆర్థిక అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి సౌకర్యం కల్పించేందుకు ఈ ఐటి టవర్ ను వనపర్తి లో ఏర్పాటు చేస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. వనపర్తి కి మంజూరైన ఐటి టవర్‌ను ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసుకునే విధంగా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. ఐటి ప్రొఫెషనల్స్‌కు ఐటి టవర్ నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని వనపర్తి జిల్లాకు ఇది శుభవార్త అని చిన్నారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి ప్రాంతంలో విద్యాభ్యాసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ వల్ల ఐటీ టవర్ మంజూరు అయిందని, అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చిన్నారెడ్డి పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లో తిరిగి చేరిన అభిజిత్ ముఖర్జీ

న్యూఢిల్లీ : మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమారుడు అభిజిత్ ముఖర్జీ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)లో కొంతకాలంగా పని చేస్తున్న ఆయన తిరిగి సొంతగూటికి చేరారు. బుధవారం, కోల్‌కతాలో పిసిసి ఇన్‌ఛార్జ్ గులాం అహ్మద్ మీర్, ఇతర రాష్ట్ర నాయకుల సమక్షంలో అభిజిత్ అధికారికంగా పార్టీలో తిరిగి చేరారు. 2021లో కాంగ్రెస్ నుంచి టీఎంసీలో చేరిన ఆయన, తిరిగి రావడాన్ని సొంతింటికి వస్తున్నట్లుగా అభివర్ణించారు. రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఆయన కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో తిరిగి చేరడం రాజకీయంగా సరైన చర్యనా అని అడిగినప్పుడు.. 'కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉందో పట్టింపు లేదు. నాను కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల టీఎంసీలోకి వెళ్లా. మేము ఇప్పుడు కాంగ్రెస్ ఇచ్చే ఆదేశాలను, బాధ్యతల్ని ముందుకు తీసుకెళ్తాం.' అని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ శుభాంకర్ సర్కార్ మాట్లాడుతూ.. ఇది రాష్ట్ర విభాగానికి మంచి ఊపు ఇస్తుందని అన్నారు. 2012 జాంగిపూర్ లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికలో అభిజిత్ 2,536 ఓట్ల తేడాతో గెలిచారు. ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతి అయిన తర్వాత ఈ సీటు ఖాళీ అయింది. 2014 ఎన్నికల్లో మరోసారి తిరిగి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో ఎన్నికల్లో టీఎంసీ అభ్యర్థి ఖలీలూర్ రెహమాన్ చేతిలో ఓడిపోయారు. ప్రణబ్ ముఖర్జీ కుమార్తె, అభిజిత్ సోదరి శర్మిష్ఠ ముఖర్జీ ఇటీవల కాంగ్రెస్‌ని విమర్శించారు. ఈ తర్వాత కొన్ని వారాలకే అభిజిత్ కాంగ్రెస్‌లో చేరారు. గత ఏడాది డిసెంబర్‌లో, మాజీ కాంగ్రెస్ సభ్యురాలు శర్మిష్ఠ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ప్రత్యేక స్మారక స్థలాన్ని డిమాండ్ చేస్తూ, తన తండ్రి మరణానికి సంతాపం తెలిపేందుకు వర్కింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రణబ్ ముఖర్జీ స్మారక చిహ్నం కోసం ఢిల్లీలోని రాజ్‌ఘాట్ కాంప్లెక్స్‌లోని రాష్ట్రీయ స్మృతి స్థల్‌లో కేంద్ర ప్రభుత్వం భూమిని కేటాయిస్తున్నట్లు ప్రకటించినప్పుడు, శర్మిష్ఠ ముఖర్జీ ఈ నిర్ణయం తీసుకున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు

# పోలింగ్ డేటా అత్యంత భద్రం

## ఎక్కడా పొరపాట్లు లేవు: రాజీవ్ కుమార్

న్యూఢిల్లీ : లోక్‌సభతో పాటు ఆయా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ డేటా తారుమారు అయ్యిందంటూ కొంతకాలంగా ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ స్పందించారు. ప్రతిపక్షాల ఆరోపణలను ఖండించారు. 'పోలింగ్ బూత్ స్థాయి అధికారులతో సహా లక్షలాది మంది సిబ్బంది పోలింగ్ డేటాలో పాలు పంచుకుంటారు. కాబట్టి, పొరబాటు జరగడానికి ఆస్కారం ఉండదు. ఈసీ నిష్పక్షపాతంగా ఉండే వ్యవస్థ. అత్యంత నమ్మకమైనది. ఎవరైనా తప్పు చేస్తే మా వ్యవస్థ సహించదు. పోలింగ్ డేటా వ్యవస్థ పకడ్బందీగా ఉంది. ఎటువంటి తప్పిదాలకు తావులేదు' అని 'లోక్‌సభ 2024 అట్లాస్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పేర్కొన్నారు. సార్వత్రిక సమరానికి సంబంధించి ఎన్నికల సంఘం విడుదల చేసిన పోలింగ్ డేటా లో తేడాలు ఉన్నాయంటూ ఇటీవల ప్రతిపక్షాల నుంచి ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే.

# సచివాలయంలో పెచ్చులూడి కారు ధ్వంసం

హైదరాబాద్ : సచివాలయంలోని ఐదో ఫ్లోర్ సౌత్ భాగంలోని పట్టీ కూలింది. దీంతో రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ వాహనం దెబ్బతింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడడం తో పెను ప్రమాదం తప్పింది. పట్టీ మొత్తం కూలే అవకాశం ఉండడంతో వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే సచివాలయంలో అక్కడక్కడ వాటర్ లీకేజీ అవుతుండడంతో గోడలు పెచ్చులూడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కొన్నిచోట్ల మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం సచివాలయ నిర్మాణానికి రూ.1200 కోట్ల ఖర్చు కాగా, ఈ నిర్మాణం నాసిరకం అంటూ అప్పట్లో కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సచివాలయం ప్రారంభం రోజే అప్పటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి బిఆర్ఎస్ ప్రభుత్వం సచివాలయ నిర్మాణంపై విమర్శలు చేశారు.

# కాంగ్రెస్‌లో చేరిన మాజీ డిఎస్పీ

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా తప్పకునే చాన్స్

హైదరాబాద్ : మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న ఎం. గంగాధర్ బుధవారం ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గంగాధర్ ఇంకా నామినేషన్ ఉప సంహరించుకోలేదు. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. ఇటీవల డిఎస్పీ పదవికి ఆయన రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సీనియర్ కాంగ్రెస్ నేత వి.హన్మంతరావుతో పాటు సచివాలయానికి వచ్చిన గంగాధర్ కు మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అధికార అభ్యర్థి డాక్టర్ వి. నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని మంత్రి ఆయనకు సూచించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# దుప్పి మాంసం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

రాజన్నసిరిసిల్ల : దుప్పి మాంసాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గంభీరావుపేట మండలం, ముస్తాఫానగర్ అటవీ ప్రాంతంలో కోనరావుపేట మండలానికి చెందిన గంట కొమురయ్య అనే వ్యక్తి దుప్పిని వేటాడి చంపి, ముక్కలుగా చేసి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఫారెస్టు అధికారులు పట్టుకున్నారు. అతని నుంచి 30 కేజీల దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్ఓ శ్రీహరి ప్రసాద్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వన్యప్రాణులను ఎవరు వేటాడినా ఉపేక్షించేది లేదని, వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

# కులగణన సర్వే తప్పని ఒప్పుకున్నట్లే

## మరోమారు సర్వేకు ఆదేశాలపై కెటిఆర్ వ్యాఖ్య

హైదరాబాద్ : కులగణన సర్వే తప్పుల తడక అని తేలిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. మరోమారు సర్వేలో అయినా ఖచ్చితంగా నిర్వహించాలని అన్నారు. సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల కేటీఆర్ స్పందించారు. కులగణన సర్వే తప్పుల తడకని ప్రభుత్వం ఒప్పుకోవడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. అసంపూర్తి లెక్కలతో అసెంబ్లీలో తీర్మానం తప్పేనని అంగీకరించాలని, మనో వేదనకు గురిచేసినందుకు బీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రెండోసారి అయినా సర్వే సమగ్రంగా చేయాలని సూచించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, రిజర్వేషన్ల అంశాన్ని కేంద్ర పరిధిలోకి నెడితే అంగీకరించే ప్రసక్తే లేదని కేటీఆర్ అన్నారు.

# బర్డ్ ఫ్లూ వల్లే కోళ్లు చనిపోతున్నాయి

## మంత్రి అచ్చన్నాయుడు వెల్లడి

అమరావతి : బర్డ్ ఫ్లూ వల్లే కోళ్లు చనిపోయాయని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు వెల్లడించారు. చనిపోయిన కోళ్లను.. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపగా.. అవి బర్డ్ ఫ్లూ వల్లే చనిపోయినట్లు నివేదికలో స్పష్టమైందని చెప్పారు. ఈ వ్యాధి వల్ల ఏలూరు జిల్లా బాదంపూడిలో 2 లక్షల కోళ్లు, ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంలో 7 వేల కోళ్లు చనిపోయినట్టు సమాచారం ఉందన్నారు. బుధవారం అమరావతిలో మంత్రి అచ్చెన్నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ.. పౌల్ట్రీలలో ఉన్న గుడ్లను కూడా పూడ్చి వేయించామని చెప్పారు. ఈ బర్డ్ ఫ్లూ కారణంగా దాదాపు 5 లక్షల కోళ్లు చనిపోయినట్లు సమాచారం ఉందని.. కానీ 40 లక్షల కోళ్లు చనిపోయినట్లు ప్రచారం అయితే జరుగుతోందన్నారు. స్వల్ప ఉష్ణోగ్రతలో ఇలాంటి పరిస్థితి వస్తుందని తెలిపారు. ఈ బర్డ్ ఫ్లూ ప్రబలిన ప్రాంతాల్లో 10 కిలోమీటర్ల పరిధిలోని షాపులను మూసి వేశామన్నారు. ఇక బర్డ్ ఫ్లూ వల్ల ఆందోళన చెందాల్సిన పని లేదని స్పష్టం చేశారు. ఉష్ణోగ్రతలు ఎంత వేగంగా పెరిగితే అంతే వేగంగా ఈ వ్యాధి తగ్గుతుందన్నారు. పౌల్ట్రీలలో శానిటేషన్ సరిగ్గా లేకపోవడం వల్ల ఈ వ్యాధి వచ్చిందన్నారు. రాష్ట్రంలో 10 కోట్లకు పైగా కోళ్లు ఉన్నాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మరోవైపు తెలంగాణలో సైతం లక్షలాది కోళ్లు ఈ వ్యాధి వల్ల మరణిస్తున్నాయి. ఇక మార్కెట్‌లో చికెన్ ధరలు సైతం అమాంతంగా పడిపోయాయి. కేజీ చికెన్ ధర రూ. 150గా ఉంది. అయినా చికెన్ కొనుగోలు చేసేందుకు వినియోగ దారులు భయాందోళనలకు గురవుతోన్నారు.

# సంపాదకీయం

## కులాల కుంపట్లో చలికాచుకుంటున్న రాజకీయ పార్టీలు !

ఏరోజుకు ఏది అవసరమో అది మాట్లాడడం..ఆయా వర్గాలను ఆకట్టుకునేలా చెప్పడం రాజకీయ పార్టీలకు షరా మామూలు అయ్యింది. దేశంలో బడుగు,బలహీన వర్గాలతో పాటు, నిమ్న వర్గాలను దువ్వడంలో రాజకీయ పార్టీలు ఆరితేరాయి. తాజాగా ఇప్పుడు ఎస్సీవర్గీకరణ, బిసి కులగణన వ్యవహారం నడుస్తోంది. ఈ రెండు వర్గాలను ఆకట్టుకునేందుకు ఆయా పార్టీలు జెండాలెత్తుకున్నాయి. తామే వారికి రక్షణ కవచమని, వారి అభ్యున్నతే తమ రాజకీయం అని చెబుతున్నాయి. తెలంగాణలో బిసి కులగణన సరిగా జరగలేదని బిజెపి, బిఆర్ఎస్ వాదిస్తున్నాయి. పక్కా ప్రణాళికతో చేపట్టామని కాంగ్రెస్ చెబుతోంది. ఎవరు కరెక్ట్..ఎవరు రాంగ్ అన్నది ఆయా వర్గాల ప్రజలు విశ్లేషించుకుంటున్నారు. నిజానికి ఏ పార్టీ కూడా ఈ కులాలకు పెద్దపీట వేయడంలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడుగా దళితుడైన మల్లికార్జున ఖర్గే ఎన్నికైనా అది పేరుకు మాత్రమే. పెత్తనం, వ్యవహారమంతా రాహుల్, సోనియా, ప్రియాంకల గుప్పిట్లో ఉంది. అదో కుటుంబ పార్టీగా మారింది. బిఆర్ఎస్‌లో అయితే పక్కా కుటుంబ పార్టీయే. టిడిపి కూడా మరీ కుటుంబ పార్టీ అనక తప్పదు. వీరంతా ఇప్పుడు కులాల ఉద్దరణకు వీరతాళ్లు వేసుకున్నారు. బిసిలపై కాంగ్రెస్‌కు ప్రేమలేదని, వారిని మోసం చేశారని తెలంగాణలో బిజెపి, బిఆర్ఎస్‌లు అంటున్నాయి. అందుకే ఇప్పుడు బిజెపి కూడా బిసి అధ్యక్షుడిని చేస్తుందన్న ప్రచారం ఉంది. కాంగ్రెస్ ఇప్పటికే బిసిని అధ్యక్షుడిగా చేసేసింది.బిఆర్ఎస్‌లో ఆ ఛాన్స్ లేదు. అక్కడ వెలమదొరలు తప్ప మరొకరికి ఛాన్స్ లేదు. టిడిపిలో చంద్రబాబు కుటుంబం తప్ప మరొకరికి ఛాన్స్ లేదు. ఇలా పార్టీల్లోనే న్యాయంచేయలేని వారు ఎస్సీ, బిసిలకు న్యాయం చేస్తామంటే నమ్మడం ఎలా అన్నదే సమస్య. దేశంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సమాఖ్యలు అన్నీ అగ్రవర్ణాల నాయకత్వంలోనే నడుస్తున్నాయి. కమ్యూనిస్టుల్లో కూడా అగ్రకులాలదే పెత్తనం అని వేరుగా చెప్పనక్కరలేదు. తమ గుప్పిట్లో అధికారం ఉండాలి...కానీ తాము మాత్రం కింది కులాల వారికి అండగా ఉన్నామని చెప్పుకోవాలన్న తలబిరుసుతనంతో ఆయా పార్టీల నేతలు ఉన్నారు. అందుకే పార్టీ నాయకత్వ మైనా, అధికార పెద్దరికమైనా చేజారిపోకుండా జాగ్రత్త పడుతూనే ఉంటారు. ఇప్పటికీ తక్కువ కులాల్లో జాతి వివక్ష కొనసాగుతోంది. దీనిని తొలగించి వారిని సమాజాంలో అందరితో సమానంగా చేయడానికి ప్రయత్నాలు సాగడం లేదు. అంతెందుకు కులవ్యవస్థ నిర్మూలనకు ఎవ్వరూ పోరాడడం లేదు. కులాల పేరు చెప్పి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు అలవాటు పడ్డ వీరు కులుఅలను సజీవంగా కొనసాగించేలా చేస్తున్నారు. బడుగువర్గాల, శ్రమజీవుల ప్రతినిధులమని చెప్పుకొనే పార్టీల్లో కూడా ఈ జాడ్యం కొనసాగడం దారుణం. మరోవైపు అగ్రకుల అధిపత్యానికి విరుద్ధంగా..పాలనలో తమ వాటా, భాగస్వామ్యం కోసం దేశం లోని బిసిలు, దళితులు గట్టిగా పోరాడలేక పోతున్నాయి. కాన్షీరామ్ బిఎస్‌పి స్థాపించి సంచలనం సృష్టించినా, అధికార యావలో ఆ పార్టీ కొట్టుకుపోయింది. అంతెందుకు తెలంగాణలో దళిత ఉద్దరణ అంటూ బయలుదేరి బిఎస్‌పిలో చేరిన ఐపిఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా అధికార యావలో బిఆర్ఎస్‌లో చేరారు. బిఆర్ఎస్ పాలనకు వ్యతిరేకంగా గళం విప్పిన ఆయన చివరకు అదేపార్టీ చంకనెక్కారు. అంటే ఏదో ఒక డబ్బున్న పార్టీలో చేరితే తప్ప మనుగడ లేదని ఆయన గుర్తించివుంటారు. నిజానికి బిసిలు సమగ్ర కులగణన కోరుతున్నారు. మాదిగలు ఎస్‌సి రిజర్వేషన్లలో తమ వాటా తేల్చమంటున్నారు. తాజాగా ఎబిసిడి వర్గీకరణ జరగాలని మందకృష్ణమాదిగ కోరుతున్నారు. వీరి డిమాండ్లు క్రమంగా రాజకీయ ప్రాధాన్యతను పొందాయి. గత పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలు వీటి ప్రస్తావన తేక తప్పలేదు. తాజాగా ఇప్పుడు పంచాయితీ ఎన్నికలు రావడంతో అన్నిరాజకీయ పార్టీలు బిసిలకు తామే ప్రతినిధులం అన్నట్లుగా బయలుదేరాయి. తొమ్మిదన్నరేళ్లు అన్ని వర్గాలను అణగదొక్కి, తెలంగాణ పేరు చెప్పి దోచకున్న బిఆర్ఎస్ నేతలుకూడా బిసిలపట్ల ఎక్కడ లేని ప్రేమను ఒలకబోస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో గెలిపిస్తే దేశంలో బిసిల కులగణన చేపడతామని రాహుల్ గాంధీ చెబుతూ వచ్చారు. ఎస్‌సి రిజర్వేషన్లలో మాదిగలకు న్యాయం చేస్తామని భరోసా ఇస్తూ ప్రధాని మోడీ ఎన్నికల ప్రచార వేదికపై మందకృష్ణ మాదిగ కన్నీళ్లు తుడిచారు. నిజం ఏమిటంటే ఈ రెండు సమస్యలు రాజకీయ క్షేత్రంలో పావులుగా వాడుకోవడానికి అన్ని పార్టీలకు ఉపయోగపడుతున్నాయి. ఏ ప్రధాన రాజకీయ పార్టీకి వీరి డిమాండ్ల పట్ల చిత్తశుద్ధి లేదనడంలో సందేహం లేదు. తమ రాజకీయ నిచ్చెనను ఎక్కడానికి వీరు మెట్లుగా ఉపయోగపడతారు కాబట్టి వారి గురించి మాట్లాడుతున్నారు. వారి సమస్యలను అధ్యయనం చేసి, వారి ఆకాంక్షలను నెరవేర్చి ఆయా వర్గాల అభ్యున్నతికి పాటుపడాలన్న ఆసక్తి ఏ రాజకీయపార్టీకి లేదనే చెప్పాలి. పైగా వారిని ఎదగకుండా చేసి, ఉన్నచోటనే ఉంచి అవసరానుగుణంగా వాడుకోవాలన్న రాజకీయ దురుద్దేశం కూడా ఆయా పార్టీ నేతలకుంది. దేశంలోని బిసిలు, మాదిగలు కోరుకుంటున్న విధంగా విధాన కల్పన చేయాలనీ ఏ ప్రభుత్వానికి లేదు. కింది కులాలు ఎదిగి తమ పీఠాలు కదిలించకుండా సకల జాగ్రత్తలు ఆ నాయకులు తీసుకుంటారు. నిజానికి దేశం అభివృద్దిలో పయనించాలంటే పేద, ధనిక వర్గాలను గుర్తించి వారికి పథకాలు అందచేయాలి. దళిత,బిసి వర్గాలను గుర్తించి వారి ఆర్థిక స్థోమత ఆధారంగా పతకాలు రచించాలి. విద్య,ఉద్యోగ రంగాల్లో వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయంగా వారిని భాగస్వాముల ను చేయాలి. కులనిర్మూలన చేసి భారతజాతిని ఏకంచేయాలి. అలాచేసే ధైర్మం ఉందా అన్నది చెప్పాలి. కులాల కుంపట్లు రాజేసి రాజకీయ లబ్ది పొందే రాజకీయ స్వార్థ పరుల పట్ల ఆయా కులాల వారు జాగ్రత్తగా ఉండడం ఎప్పటికీ అసరం.

# పంచాయితీ ఎన్నికల వేళ కులాల బుజ్జగింపులు




## బిసి, ఎస్సీలను దువ్వుతున్న రాజకీయపార్టీలు

### చట్టపరంగా సీట్లు ఇచ్చే ధైర్యం చేస్తాయా అన్నదే సమస్య

హైదరాబాద్ : తెలంగాణలో పంచాయితీ ఎన్నికల వేళ కుటగణన చిచ్చురేపుతోంది. పార్టీపరంగా బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అందిస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో ప్రకటించారు. అన్ని పార్టీలు ఇలాగే చేయాలన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టాలని బిజెపి, బిఆర్ఎస్ చేసిన డిమాండ్ ముందుకు రాలేదు. సుప్రీం తీర్పు మేరకు రిజర్వేషన్లు 50శాతం మించరాదు. దీంతో బిల్లు పెట్టే ప్రసక్తి ఉండదు. కానీ రాజకీయంకోసం బిఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఇప్పుడు అదే నినాదంతో ఊరూవాడా ఊరేగుతోంది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టింది. అది ఏ మేరకు చట్టబద్ధతతో, ఎన్ని విధాలుగా ఉపయోగపడుతుందో కాలమే చెప్పాలి. ఇప్పటికే ఓట్ల కోసం బిసి లెక్కలు వేసిన కర్ణాటక, బీహార్, ఎపి రాష్ట్రాలు బిసి జనాభాకు కొత్తగా చేసిందేమీ లేదు. కేంద్రం చొరవలేకుండా జనాభా లెక్కలకు విలువ లేదని రాష్ట్రాలకు కూడా తెలుసు. జనాహభా లెక్కల ద్వారానే బిసిల లెక్కలు తేల్చాలన్న డిమాండ్ కూడా ఉంది. ఎస్‌సి రిజర్వేషన్లలో విభజనను రాష్ట్రాలు చేసుకో వచ్చని సుప్రీం కోర్టు తేటతెల్లం చేసింది. దీంతో తెలంగాణలో ఓ అడుగు ముందుకు పడింది. అయితే అది సమగ్రంగా లేదని తాజాగా మందకృష్ణ అంటున్నారు. ఎబిసిడి వర్గీకరణ చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఎస్సీ వర్గీకరణపై ఆగస్టు 2024లో సుప్రీం ఈ మాట చెప్పినా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఒక్కటి కూడా రిజర్వేషన్ల అంశంపై చర్చించడం లేదు. ఆయా రాష్ట్రాల్లో ఒత్తిడి కూడా కనిపించడం లేదు. తెలంగాణలో మాత్రమే ప్రభుత్వం అధ్యయన కమిటీని వేసి, 60 రోజుల్లో దళిత ఉపకులాల లెక్కల నివేదిక ఇవ్వాలని అక్టోబర్ 2024లో ఏకసభ్య కమిషన్ నియమించింది. నివేదిక రావడంతో అసెంబ్లీలో దీనిని ప్రవేశ పెట్టారు. ఆమేరకు రిజర్వేషన్లు ప్రకటించారు. తెలంగాణలో బిసిలను, మాదిగలను మచ్చిక చేసుకునే ప్రయత్నాల్లో బిజెపిక దూకుడు పెంచింది. వారికి తామే వారసులం అన్నరీతిలో ప్రకటనలు చేస్తున్నారు. రాజ్యాంగబద్ధంగా రాష్టాలు ఎస్‌సి రిజర్వేషన్లను ఉపకులాలకు పంచవచ్చని సుప్రీకోర్టు చెప్పింది. తెలంగాణ ఈ విషయంలో రెండు అడుగులు వేసింది కాబట్టి ఆయా నేతలతో వాటి అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి అనే వ్యూహంలో ఉన్నాయి. అందుకే ఒకరికి రాజ్యసభ సభ్యత్వం ఇచ్చి, మరొకరికి పద్మశ్రీ ఇచ్చింది. తెలివిగా బిసి ఉద్యమనేత కృష్ణయ్యకు రాజ్యసభను, ఎస్సీవర్గీకరణ కోసం పోరాడిని మందకృష్ణకు పద్మశ్రీని ప్రకటించింది. ఇది రాజకీయ లబ్దికోసంచేసిందే తప్ప ప్రేమతో చేసింది కాదు. ఒకరికి పద్మశ్రీ, మరొకరికి రాజ్యసభ పదవి కట్టబెడితే ఆయా నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న వర్గాలకు లభించేదేమిటన్నదే ప్రశ్న. కులాల పరంగా వారికి న్యాయం చేయకుండా ఇలాంటి డ్రామాలు చేస్తున్నారు. ఇవ్వాళ్ళ ఈ గౌరవాలు ఇచ్చిన ప్రభుత్వం తమ డిమాండ్లను కూడా సానుకూలంగా పరిష్కరిస్తుందని భరోసా ఇవ్వగలరా. ఇప్పుడు బిసిలకు గాని, మాదిగలకు గాని వారి డిమాండ్లపై నిజాయితీగా పోరాడే కొత్త శక్తితో వీరు ముందుకు రావాలి. రాజకీయంగా సాధించే పటిమను ప్రదర్శించాలి. పంచాయితీ ఎన్నికల్లో ఆయా వర్గాలు తమ డిమాండ్లపై దృష్టి పెట్టి రాకీయ పార్టీల మెడలు వంచాలి.

## ఇంత వరకు హెూంగార్డులకు జీతాలు ఇవ్వకపోడం సిగ్గుచేటు

హైదరాబాద్ : చిన్నజీతాలతో జీవితాలు నెట్టుకొచ్చే వారికి 12 రోజులు గడుస్తున్నా జీతాలు ఇవ్వకపోవడం దారుణమని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 16వేలకు పైగా ఉన్న హెూంగార్డులకు 12 రోజులు గడుస్తున్నా జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటని అన్నారు. చిన్న జీతాలపైనే ఆధారపడి జీవిస్తున్న హెూంగార్డులు చేతిలో చిల్లిగవ్వలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. ఈఎంఐలు చెల్లించకపోవడం వల్ల బ్యాంకు అధికారులు ఫోన్లు చేసి నిలదీస్తున్న పరిస్థితి ఉందని వాపోయారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెలా ఇదే తీరు కొనసాగుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని ధ్వజమెత్తారు. మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీరికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా ఉద్యోగులకు వాతలు పెడుతున్నారని విమర్శించారు. ఇది ప్రజా పాలన కాదు, ప్రజా వ్యతిరేక పాలన అని ఆక్షేపించారు. హెూంగార్డులకు వేతనాలు తక్షణం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

## నార్సింగ్ డిఐ శ్రీనివాస్‌పై చర్యలు

### ఐజి కార్యాలయానికి అటాచ్డ్

హైదరాబాద్ : నార్సింగ్ డిఐ (డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్) శ్రీనివాస్‌ను సైబరాబాద్ సీపీ ఐజి కార్యాలయానికి అటాచ్ చేశారు. లావణ్యతో తరచూ వాట్సాప్‌లో వీడియో కాల్స్ మాట్లాడుతూ శ్రీనివాస్ పరిచయం పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరి ఆడియో కాల్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీస్ ఉన్నతాధికారులు విచారణ జరిపారు. విచారణలో డిఐ శ్రీనివాస్ లావణ్యతో మాట్లాడింది నిజమే అని తేలడంతో అతనిని ఐజి ఆఫీసుకు అటాచ్ చేశారు.. లావణ్య నటుడు రాజ్ తరుణ్‌పై ఫిర్యాదు చేసినప్పటి నుంచి శ్రీనివాస్‌తో ఆమె పరిచయం పెరిగింది. తరచూ ఇద్దరూ ఫోన్లో వీడియో కాల్స్.. ఆడియో కాల్స్ మాట్లాడుతున్నారు. అవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో సైబరాబాద్ సీపీ శ్రీనివాస్‌పై ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

## కేసులను తప్పదోవ పట్టించే యత్నం

### ఆరోపణలు, ఎదురుదాడలతో బిఆర్ఎస్ డ్రామా

హైదరాబాద్ : మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిన చందంగా ఇప్పుడు బిఆర్ఎస్ అన్ని వర్గాలకు ప్రాతనిధ్య పార్టీగా ప్రచారం చేసుకుంటోంది. రైతులపట్ల ఎక్కడలేని ప్రేమను ఒలకబోస్తోంది. వారి సమస్యలపై జిల్లాల వారీగా పోరాటాలు చేస్తోంది. ధర్నాలు చేస్తోంది. హాస్టళ్లలో పురుగుల అన్నం అని గగ్గోలు పెడుతోంది. బిసిలకు కాంగ్రెస్ ద్రోహంచేస్తోందని అంటోంది. జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని అంటోంది. గ్రామీణ వైద్యులకు అన్యాయం జరిగిపోయిందని వారి ధర్నలకు మద్దతు ప్రకటించింది. ఇలా చెప్పుకుంటూ పోతే తెలంగాణలో సకల సమస్యలన్నీ కాంగ్రెస్ వల్లనే పుట్టుకు వచ్చాయని ప్రచారం చేసి, ఆయా వర్గాలను దువ్వే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. గతంలో ప్రజల్లోకిరాకుండా, ప్రజల సమస్యలు పట్టించుకోకుండా, తొమ్మదిన్నరేళ్లు నిరంకుశంగా పాలించిన బిఆర్ఎస్ ఇప్పుడు చిలకపలుకులతో బయలుదేరింది. ఓవైపు తమ హయాంలో జరిగిన అవినీతిపై ఓ వైపు విచారణ సాగుతోంది. వాటికి సమాధానం ఇవ్వడం లేదు. కానీ ఏడాది రేవంత్ రెడ్డి పాలనలో మాత్రం తెలంగాణ ఆగమైందని వలపోస్తున్నారు. అమృత్ పథకంలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదుచేశారు. గతంలో ప్రధాని స్వయంగా కాళేశ్వరం కెసిఆర్‌కు ఎటిఎంలాగా మారిందని ప్రధాని స్వయంగా ఆరోపించారు. బిజెపి నేతలు కూడా ఆరోపించారు. వీటిని తిప్పికొట్టడం మినహా బిఆర్ఎస్ చేసిందేమీ లేదు. ఇప్పుడు కాళేశ్వరం, పోన్ ట్యాపింగ్, ఫార్ములా రేసింగ్ తదిరాల్లో అవినీతి గుప్పుమంది. అమృత్ పథకంలో భారీ స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రమంత్రికి ఖట్టర్‌కు ఫిర్యాదు చేశారు. టెండర్లు రద్దు చేసి వెంటనే ఈ విషయంపై విచారణ చేపట్టాలని సూచించారు. రేవంత్ రెడ్డి భావమరిది సృజన్ రెడ్డికి ఈ టెండర్లు అక్రమంగా కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. ఇవే కాకుండా మరిన్ని కుంభకోణాలు రాబోతున్నాయని టీజర్ కూడా ఇచ్చేశారు. సీరియల్ మాదిరి అన్ని శాఖల్లో జరిగిన అవినీతిని వెలికి తీస్తామని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలను జాతీయ స్థాయిలోనే ఎండగడతామని ఎన్నిసార్లు అయినా ఢిల్లీ వస్తామని అన్నారు. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకనో బిఆర్ఎస్ దూరంగా ఉంది. ఈ మధ్య కాలంలో రేవంత్ రెడ్డిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తూ వస్తోంది. ఫార్ములా ఈ– కార్ రేస్ కేసులో కీలక మలుపు తిరుగుతుందని కీలక వ్యక్తులను విచారించేందుకు అవకాశం ఉందని అంటున్నారు. ఈ కేసులో కీలకంగా కేటీఆర్ పేరు వినిపిస్తోంది. అయనపై ఎసిబి విచారణ సాగుతోంది. మొత్తంగా అవినీతి కేసుల్లో బిఆర్ఎస్ నేతలు బయటపడతారా లేక విచారణతో కాలయాపన చేస్తారా అన్నది చూడాలి.


## జీహెచ్ఎంసీ కార్మికుల సేవలను ప్రభుత్వం గుర్తించింది : కోదండరామ్



హైదరాబాద్ : జీహెచ్ఎంసీ కార్మికులు చేస్తున్న సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తిస్తుందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ జనసమితి మద్దతు ఇచ్చిన ఐఎన్‌టీయూసీ అనుబంధ మునిసిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో జరిగిన జీహెచ్ఎంసీ ఉద్యోగులు, కార్మికుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ సంజీవరెడ్డి, కనీస వేతనాల బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, సత్యజిత్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అదిల్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి ఏవీఎస్ గాంధీ, అదనపు ప్రధాన కార్యదర్శి శివకుమార్, టీజేఏసీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ, జీహెచ్ఎంసీ కార్మిక యూనియన్ నాయకులతో కలిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. ఈ సందర్భంగా హయత్‌నగర్, ఎల్‌బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లకు చెందిన పలువురు ఉద్యోగులు, కార్మికులు సంజీవరెడ్డి సమక్షంలో ఐఎన్‌టీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జోనల్ ప్రెసిడెంట్ శివకుమార్, కార్యదర్శి శరణ్‌జిత్‌సింగ్, నాయకులు శివరాజ్, మహేష్, నరసింహ, యాదగిరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సమదృష్టి సాధ్యమా?

చరాచర ప్రకృతిలోని సకల జీవులను తనతో సమంగా భావిస్తూ, తనలో దర్శిస్తూ, ఇతరుల కష్టసుఖాలకు సహృదయంతో స్పందించేవారిని, పరమ యోగులుగా పరిగణిస్తాను' అంటాడు కృష్టపరమాత్మ. వ్యక్తి ఎలాగైతే శరీరంలోని అవయవాలను తనవిగా భావిస్తూ అన్నిటినీ సమానంగా ఆదరిస్తాడో, అలాగే తన అంశ అయిన అన్ని జీవరాసులనూ పరమాత్మ సమంగానే చూస్తాడు. పరమాత్మలాగే పరమయోగులూ ప్రపంచంలోని ప్రతి జీవినీ సమదృష్టితో దర్శిస్తారు. జీవకోటీ శ్రేయస్కరమైన మార్గంలో తరించాలనీ తపిస్తారు. 'సమం పశ్యతి' అంటే సమదర్శనం. సృష్టిలో ఒకే విధంగా జనించని అందరినీ సమంగా దర్శించడం సాధ్యమా? ఒక్కొక్కరి బలాలు, బలహీనతలు వేరువేరుగా ఉంటాయి. అలాంటప్పుడు అం దరినీ సమదృష్టితో ఆదరించాలి అనడం వినడానికి బాగుంటుందేమో కాని ఆచరణలో సాధ్యమా? నిజానికది చూసేవారి దృష్టికోణమే కాని, చూడబడేవారికి సంబంధించినది కాదు! కాబట్టి అసాధ్యం కాదు.. సాధన చేస్తే సమదృష్టి అలవడడం జరుగుతుంది. వ్యక్తిలో భౌతిక ఆధ్యాత్మిక పార్శ్వాలలో జాత్యంతరీకరణ జరగాలి. జాతి అంటే స్థాయి. నిజానికి వ్యక్తుల సాధనలో వారి స్థాయిని బట్టి వారి దృష్టి పరిణతి చెందుతుంది. భౌతిక దృష్టికోణంతో పరిశీలిస్తే.. 'నేను నాది, నీవు నీది' అనే భేదభావం కలుగుతుంది. స్థాయి కొంత ఉన్నతమైతే ఎదుటివారిని భౌతికంగా కాకుండా ఆత్మగా భావిస్తాం. భేదమనేది భౌతికమే కాని ఆత్మపరంగా లేదనే సత్యం అవగతమైతే జాతి మత స్థాయి భేదాలకు ప్రాధాన్యం లేకుండా అందరినీ ఒకే దృష్టితో చూస్తాం. స్థాయిని మరింత పెంచుకున్న సాధకులు అందరిలోనూ పరమాత్మను దర్శించగలుగుతారు. అయితే వారు కూడా భౌతిక జగత్తును పట్టించుకుంటారు.. కాకపోతే ఫలితాలపై ఉదాసీన వైఖరితో కర్మలను ఆచరిస్తారు. సమాజంలో మంచిని మాత్రమే స్వీకరించి చెడును వదిలేస్తారు. పరమయోగులు అత్యున్నత స్థాయికి చెందినవారు.



ఆధ్యాత్మికం

# వంద శాతం ఆస్తి పన్ను వసూలే లక్ష్యంగా రామగుండం నగరపాలక సంస్థ

## • ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్... అదనపు కలెక్టర్



**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** మార్చి లోపు వంద శాతం ఆస్తి పన్ను వసూళ్ళు సాధించడమే లక్ష్యంగా రామగుండం నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు , సిబ్బంది కృషి చేస్తున్నారు. రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్, కమిషనర్ గా వ్యవహరిస్తున్న అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు )లు నిత్యం పన్ను వసూళ్ల పురోగతిని సమీక్షిస్తున్నారు. బుధవారం నాటికి ప్రైవేటు ఆస్తుల ఇంటి పన్ను 53 శాతం, ప్రభుత్వ ఆస్తుల నుండి 92 శాతం వసూలు కాగా మిగతా బకాయలు వసూలు చేయడానికి కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి నేతృత్వంలో నగర పాలక సంస్థ ఆర్ ఓ ఆంజనేయులు, ఆర్ ఐ శంకర్ రావు ఆద్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. డిప్యూటీ కమిషనర్ స్వయంగా మొండి బకాయ దారుల ఇళ్లకు వెళ్ళి అవగాహన కల్పిస్తున్నారు. పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని సూచిస్తున్నారు. స్పెషల్ డ్రైవ్ లో భాగంగా వాహనాలకు మైకులు అమర్చి వాడవాడలా ప్రచారం చేస్తున్నారు. ఏళ్ల తరబడి వసూలు కాని భారీ మొత్తం బకాయలను వసూలు చేయడానికి రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం ఇచ్చిన నోటీసులకు స్పందన వచ్చిన నేపధ్యంలో ఇదే తరహాలో మరి కొన్ని ఆస్తులకు కూడా ఈ చట్టం ప్రకారం నోటీసులు జారీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బకాయదారులు తమ పన్నులను ఫిబ్రవరి లోగా చెల్లించనట్లయితే మార్చి నెలలో చట్ట ప్రకారం ఆస్తులను జప్తు చేయడం జరుగుతుందని డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి తెలిపారు. జప్తుల బారిన పడకుండా సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు.

# అధికారులు బిల్లులు చెల్లించక రోడ్డున పడుతున్న బాధితులు

## • 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్లలో కాంట్రాక్టు పద్ధతిన పని చేసిన వారికి బిల్లులు చెల్లించండి

## • ప్రభుత్వం నుండి సుమారు 60 లక్షల కు పైగా నిధులు విడుదలైనట్టు సమాచారం

**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో నవంబర్ 30, 2023న జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రామగుండం కార్పొరేషన్ పరిధిలోని దాదాపు (206) పోలింగ్ బూత్ లలో ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బంది, ఇబ్బంది పడకుండా వాళ్ళందరికీ కాంట్రాక్టు పద్ధతిన స్థానిక, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నాడు జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పోలింగ్ స్టేషన్ లలో సౌకార్యర్థం కొరకు టెండర్ల ద్వారా టెంట్ హౌజ్ సామాగ్రి హెూటల్ భోజనాలు, కిరాణం, సామాన్లు సౌండ్ బాక్స్ లు స్వీట్లు, స్వశక్తి మహిళా గ్రూప్స్ సభ్యుల ద్వారా బోజనాలు ఇంకా తదితర వారితో పనులు చేయించి 15 నెలలు గడిచినా ఇప్పటి వరకు కూడ బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసిన వారు, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నారని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ 2023 నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికల జరిగి నేటికీ 15నెలలు అవుతున్న ఎన్నికల సమయంలో పోలింగ్ స్టేషన్లలో సిబ్బందితో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో అధికారుల ఆదేశాల మేరకు వివిధ రకాల టెండర్ల ద్వారా కాంట్రాక్టు పొందిన వారు అధికారులు చెప్పినవన్ని వివిధ రకాల పనులు కష్టపడి పని చేసినప్పటికీ ని ఇంత వరకు వారికి రావాల్సిన బిల్లులు పూర్తిగా చెల్లించక పోవడంతో పనులు చేసిన వారు బిల్లులు రాక తెచ్చిన అప్పులు వాటి వడ్డీలు కట్టలేక సంబంధించిన అధికారుల కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేల తిరిగిన కాని కనికరం చూపుకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ప్రభుత్వం నుండి నిధులు రాలేదని ఉచిత సలహాలు ఇవ్వడమే సరిపోతుందా అని ఆయన అధికారుల ను ప్రశ్నించారు. ఒక కాంట్రాక్టర్ అయితే బిల్లులు రాక బాధలు భరించలేక, అప్పుల బాధలు తట్టుకోలేక చివరికి ప్రధాన ఎన్నికల కమీషన్ కు ఫిర్యాదు చేయడం గమనార్హమని ఆయన పేర్కొన్నారు. ఇక చేసిన పనులకు బిల్లుల ఇవ్వకుంటే త్వరలో న్యాయ పోరాటం చేస్తామని అట్టి కాంట్రాక్టర్ హెచ్చరించారని, ఇక పోతే అసెంబ్లీ ఎన్నికల లో పని చేసిన వారికి పార్లమెంట్ ఎన్నికలలో బిల్లులు ఇవ్వకుండా అధికారులు ఇతర ప్రాంతాల వారికి పనులు అప్పజెప్పడం కోసమెరుపని ఆయన అన్నారు. ఇప్పటికైనా అసెంబ్లీ ఎన్నికలలో పనిచేసిన వారికి పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించాలని, రాష్ట్ర ఆర్థిక శాఖ నుండి 61లక్షల రూపాయలు నిధులు విడుదల అయినట్టు సమాచారం ఉందని కనుక జిల్లా ట్రెజరీ నుండి సంబందించిన అధికారుల ద్వార పనులు చేసి 15 నెలల నుండి వేచి చూస్తున్న వారికి మానవతా దృక్పధంతో అలోచించి నిర్లక్ష్యం చేయకుండా త్వరిత గతంగా వారి వారి బిల్లులు మంజురు చేయాలని వారి కుటుంబాలను ఆదుకువాలని ఒక ప్రకటన దినేష్ డిమాండ్ చేశారు.

# లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం ఏర్పాటు



**లక్షేటిపేట, ఫిబ్రవరి 12 (క్రైమ్ న్యూస్):** పట్టణంలోని కరీంనగర్ చౌరస్తాలో బుధవారం లారీ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ బ్రాంచ్ కార్యాలయాన్ని లక్షేటిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లక్షేటిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఆరిఫ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చింత అశోక్, మంచిర్యాల జిల్లా రవాణా సంస్థ డైరెక్టర్ అంకతి శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం ప్రాంతాలలోని లారీలకు ఈ కార్యాలయం ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు. గతంలో మంచిర్యాల జిల్లాలో బొగ్గు రవాణా కోసం లారీలు ఎంతగానో ఉపయోగపడేటివని ఇప్పుడు బొగ్గు రవాణా తగ్గిపోవడంతో లారిల యజమానులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వరి ధాన్యం, పత్తి లోడింగ్ పక్క జిల్లాలకు వెళ్లడానికి ఈ ప్రాంత లారీలు ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. ఇతర జిల్లాల లారీలకు తీసుకురావడం, తీసుకెళ్లడం ఇక్కడ ఉన్న ప్రాంత రైతులకు గాని ట్రేడర్స్ గాని భారం పడుతుందని అన్నారు. ఈ ప్రాంతంలో లారీ ట్రాన్స్ పోర్ట్ అసోసియేషన్ సబ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం వలన లారీ యజమానులకు రైతులకు ట్రేడర్స్ కు ఎంతో ఉపయోగపడుతుందని లారీ ట్రాన్స్ పోర్ట్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లారి ఓనర్స్ అసోసియేషన్ ఆడల్స్ కమిటీ చైర్మన్ మహమ్మద్ ఖాళీద్, మెంబర్స్ కరీం బాబా, షరీఫ్, అజాం, ఇషుప్, శ్రీనివాస రెడ్డి, అలీమ్, ముజీబ్, లచ్చన్న, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# టీ బీ జీ కే ఎస్‌ను మరింత బలోపేతం చేద్దాం

## - గౌరవాధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 12:** కార్మికుల శ్రేయస్సును కోరే, కార్మికుల పక్షపాతిగా ఉండే తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని మరింత ఐక్యతగా బలోపేతంగా తీర్చిదిద్దుదామని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవాధ్యక్షురాలు, నిజామాబాద్ స్థానిక సంస్థల శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. హైదరాబాదులోని తన నివాసంలో టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి ఇతర నాయకులతో కలిసిన సందర్భంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం గెలిచిన సంఘాలు కార్మికుల హక్కులను, ప్రయోజనాలను విస్మరిస్తున్నాయన్నారు. కేసీఆర్ పాలనలో టీబీజీకేఎస్ హయాంలో అనేక ఆర్థిక ప్రయోజనాలు, వారసత్వ ఉద్యోగాలు పెద్ద ఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. రానున్న రోజుల్లో యూనియన్ బలోపేతం కోసం వినూత్న రీతిలో కార్యక్రమాలను నిర్వహిద్దామన్నారు. కార్మికులను చైతన్య పరుస్తూ హక్కుల సాధన కోసం, విద్య, వైద్య రంగాలలో మెరుగైన వసతుల కోసం ఐక్యంగా కదులుదామని సూచించారు. ఈ నెల 23వ తేదీ రోజున జరిగే తన కుమార్తె వివాహ వేడుకకు హాజరు కావాల్సిందిగా కోరుతూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవాధ్యక్షురాలు నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పింగిలి సంపత్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానాన్ని అందజేసిన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు పాశం శ్రీనివాస్ రెడ్డి ,బోయినపల్లి శ్రీకాంతరావు ఉన్నారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## - జమాతే ఇస్లామి జిల్లా పట్టణ అధ్యక్షులు అబ్దుల్ హై జావిద్

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి జమాతే ఇస్లామి జిల్లా పట్టణ అధ్యక్షులు అబ్దుల్ హై జావిద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాన్ని ఫార్చ్యూన్ హాస్పిటల్, కరీంనగర్ తో కలిసి పెద్దపల్లి పట్టణంలోని ఫారం కాంప్లెక్స్ లో ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 4:00 వరకు నిర్వహిస్తున్నామని, ఇందులో కరీంనగర్ కు చెందిన ప్రముఖ వైద్యుల ఆధ్వర్యంలో హృదయ సంబంధిత చికిత్స, సాధారణ ఆరోగ్య సమస్యలు, ఎముకలు %ం% కీళ్ల సమస్యలు, ఉచిత కంటి శస్త్ర చికిత్స, పళ్లు, నోటి సంబంధిత చికిత్స, శిశువుల, పిల్లల ఆరోగ్య సేవలు, మహిళల ఆరోగ్య సేవలు,ఉచిత ఈ సీ జీ,2డీ ఈకో, షుగర్ టెస్ట్, చేసిన తర్వాత ఉచితముగా మందులు పంపిణీ చేస్తామని, కంటి జబ్బులు ఉన్నవారికి శస్త్ర చికిత్సలు కూడా చేస్తామని ఈ అవకాశాన్ని కుల మతాలకతీతంగా పెద్దపల్లి పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మరిన్ని వివరాలకు 9849607860 నెంబర్ కు కాల్ చేసి వివరాల నమోదు చేసుకోవాలని తెలిపారు.

# పేకాట రాయుళ్ళ అరెస్టు




**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 12, (క్రైమ్ న్యూస్):** మండలంలోని బలరావు పేట గ్రామ శివారులో పేకాట స్థావరం పై బుధవారం లక్షెట్టిపేట ఎస్సై సతీష్ సిబ్బందితో కలిసి 7గురు పేకాట రాయుళ్ళను అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై సతీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బలరావుపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారాన్న పక్క సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది దాడి చేసి పేకాట ఆడుతున్న బత్తుల రమేష్, కోన తిరుపతి, బేర రాజయ్య, సంగం ఒదయ్య, గోర్క మల్లేష్, వనపర్తుల సుధాకర్, మండే సత్తన్న ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 5 బైకులు, 6 సెల్ ఫోన్లు, 13 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.

# యూనియన్ జెండా ఆవిష్కరించిన విద్యుత్ ఉద్యోగులు



**లక్షెట్టిపేట, ఫిబ్రవరి12:** 74 వసంతాలు పూర్తి చేసుకొని 75వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా విద్యుత్ శాఖ ఉద్యోగుల 1104 యూనియన్ కంపెనీ రిటైర్డ్ ఫార్మెన్ మెట్టు రాజేశ్వర్ రావు జెండా ఆవిష్కరించారు. బుధవారం పట్టణంలోని విద్యుత్ ఏ ఈ కార్యాలయం వద్ద సభ్యులతో కలిసి మాట్లాడారు. యూనియన్ వల్ల ఎన్ని అడ్డంకులు ఉన్న ఎదుర్కోవచ్చని అన్నారు . విద్యుత్ పనుల్లో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నర్సింగ రావు, శంకరయ్య, చంద్రమౌళి, రాజమౌళి సెక్షన్ సిబంది తదితరులు పాల్గొన్నారు.

# మోరం తరలింపుకు అనుమతులు

## - మండల తాసిల్దార్ యం.డి వకీల్



**ధర్మారం,ఫిబ్రవరి ,12 (ది క్రైమ్ న్యూస్):** ధర్మారం మండలం తాసిల్దార్ యం డి వకీల్ బుధవారం రోజు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ..పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు గృహఅవసరాల నిమిత్తం మొరం తీసుకొనుటకు మండల తహశీల్దార్ కార్యాలయం నుండి అనుమతి ఇవ్వటం జరుగుతుందని తెలిపారు ట్రాక్టర్ లోడు మట్టికి 2 వందల రూపాయలు టిప్పర్‌లోడు మట్టికి 8వందలు చలాన లేదా డిడి చెల్లించి అనుమతి పొందవలసి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా అనుమతి లేకుండా తవ్వకాలు జరిపి మట్టిని తరలించినట్లైతే చట్టపరంగా తగు చర్యలు తీసుకోవటం జరుతుందని ప్రభుత్వ భూములకు అనుమతి ఉండదని అన్నారు. మరియు సొంత పట్ట బూములకైన అనుమతి తప్పనిసరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ ఉదయ్ కుమార్, ఆర్ఐ వరలక్ష్మి, ఆ రైతు నవీన్ రావు, మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ కులగణన తప్పుల తడక

- కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసానికి కేరాఫ్ అడ్రస్
- కులగణన పై ఈ నెల 14న రౌండప్ సమావేశం
- 42 శాతం రిజర్వేషన్ల వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కింది
- కాంగ్రెస్ బిసిలకు న్యాయం చేసేదాక వదిలిపెట్టం
- రామగుండం మాజీ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్




**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలోని బిసిలను అనుగదొక్కేందుకే రెవంత్ రెడ్డి కుట్రలు పన్నుతున్నాడు. అత్యధిక జనాభా కలిగిన బిసిలను అనుగదోక్కేందుకే కులగణన పేరుతో సర్వే చేపట్టిందని కులగణన సర్వే అంతా తప్పుల తడకని కాంగ్రెస్ పార్టీ అంటేనే మైసానికి కెరాఫ్ అడ్రస్ అని రీ సర్వే నిర్వహించకుంటే బీసీల పక్షాన ఉద్యమం చేస్తామని రామగుండం మాజీ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హెచ్చరించారు. 14న గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో నిర్వహించే బిసి రౌండ్ టేబుల్ సమావేశం కు అందరూ హాజరుకావాలని ఆయన పిలుపు నిచ్చారు. బుధవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోమాజీ కోరుకంటి చందర్ మాట్లాడుతూ సర్వేలో పేరుతో బీసీల జనాభా శాతాన్ని తగ్గించి ఓసీల జనాభాను పెంచారన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సకలజనుల కుటుంబాల సర్వేకు ప్రస్తుతం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగనన సర్వేను ఆ పార్టీకి సంబంధించిన నేతలే తప్పుపడుతున్నారని, అయినా కాంగ్రెస్ ప్రభుత్వంలో మార్పు రావడంలేదని విమర్శించారు. బీసీ కులాలు ఐక్యం కావలసిన అవసరం ఉందని ఈనెల 14న గోదావరిఖని ప్రెస్ క్లబ్లో ఉదయం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని ఈ సమావేశానికి బీసీ ఉప కులాలు అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. బీసీ వర్గాలకు జరిగిన అన్యాయం పై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సర్వే పేరుతో బీసీ ఉపకులాల వర్గాలకు చేసిన అన్యాయంతో కాంగ్రెస్ పతనం ప్రారంభ మైందని స్పష్టం చేశారు. కుల గణన సర్వేలో 5న్నర శాతం బిసి జనాభా తగ్గించి దాదాపు 22 లక్షల మంది లేనట్టుగా చేసింది రెవంత్ సర్కార్ అన్నారు. బీసీ వర్గాలను లక్షలాది సంఖ్యల్లో తగ్గించి చూపిన సిఎం రెవంత్ బిసిలకు క్షమాపణ చెప్పాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ మాత్రమే బిసిలకు పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల్లో 50 శాతం సీట్లు కెటాయుంచిందని గుర్తు చేశారు. అసెంబ్లీ 34 పార్లమెంటు లో 6 సీట్లు కెటాయుంచిదన్నారు. కులగణన జరిగిన తరువాత బిసిలు ఆందోళనకు గురైతున్నని కాంగ్రెస్ చేపట్టిన కులగణన పూర్తిగా బీసీలకు అన్యాయం జరిగేలా ఉందన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కనీవినీ ఎరుగని రీతిలో 24 గంటల్లో సమగ్ర కుటుంబ సర్వే చేయించారన్నారు. కులగణన పై ఈ నెల 14న గోదావరిఖని ప్రెస్ క్లబ్లో చేపట్టే రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ కులస్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో నాయకులు గోపు ఐలయ్య యాదవ్, బొడ్డు రవీందర్, బోడ్డుపల్లి శ్రీనివాస్ నూతి తిరుపతి, అచ్చ వేణు, కల్వచర్ల కృష్ణవేణి,సట్టు శ్రీనివాస్ అల్లం అయులయ్య సంధ్యారెడ్డి, కోడి రామకృష్ణ, వెంకన్న కిరణ్ జీ , సారయ్య నాయక్ వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలు భారత దేశ ప్రగతికి రథచక్రాలు

## - మల్యాల సిడిపిఓ వీరలక్ష్మి..




**ఎండపల్లి, ఫిబ్రవరి12(ది క్రైమ్ న్యూస్ ):** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో అనే కార్యక్రమం 10సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యము, ప్రేరణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమానికి మల్యాల ప్రాజెక్ట్ సిడిపిఓ వీరలక్ష్మి హాజరు అయ్యారు. అనంతరం మాట్లాడుతూ... ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందు ఉంటూ భారత దేశ ప్రగతికి రథచక్రాలుగా మారాలని వారి అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. అనంతరం జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుండి చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కో ఆర్డినేటర్ శ్రావణ్ మాట్లాడుతూ... ప్రస్తుత తరుణంలో పిల్లలు అనేక రకాల ఆకర్షణలకి ముఖ్యంగా మొబైల్ ఫోన్, డ్రగ్స్, ప్రేమ అనే అంశాలకు ఆకర్షితులు కావద్దని, అదే వారి బంగారు భవిష్యత్తుకు ఆటంకం కలిగించుకుంటున్నారని వాటి నుంచి బయటపడి ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని ఎన్ని రకాల అవంతరాలు వచ్చినా ఆకర్షణలు వచ్చినా లోను కాకుండా మానసిక ధైర్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. నేటి సమాజంలో ఇప్పటికి వయస్సు నిండకుండా వివాహాలు చేస్తున్నారని బాల్య వివాహాల రూపంలో బాలికల యొక్క హక్కులకు భంగం కలుగుతుందని వారు 21సంవత్సరాల వచ్చేంత వరకు వివాహం చేసుకోరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు జ్యోతి, ప్రధాన ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



# శేఖర్ అన్న కోసం మేము సైతం అంటూ

# ప్రచారం నిర్వహించిన హుజురాబాద్ ట్రస్మా సభ్యులు




**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి12(ది క్రైమ్ న్యూస్):** ఎమ్మెల్సీ ఎలక్షన్ ప్రచారంలో భాగంగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ లో ట్రస్మా బలపరిచిన అభ్యర్థి యాదగిరి శేఖర్ రావుకు మద్దతు తెలపాలని కోరుతూ ట్రస్మా ప్రైవేట్ పాఠశాలల యజమానులు పట్టభద్రులను కలుస్తూ మద్దతు కోరడం జరిగింది. పట్టభద్రుల సమస్యలు తెలిసిన వాడిగా పట్టభద్రుల కోసం కష్టపడే శక్తి సామర్థ్యాలు ఉన్న నాయకుడు యాదగిరి శేఖర్ రావు అని అలాంటి వారిని గెలిపించుకుంటే ఇటు పట్టభద్రులు అటు ప్రజలు అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తామని పట్టభద్రుల అభివృద్ధి కోసమే ఈరోజు ఎమ్మెల్సీగా వస్తున్నారని ఒక్కసారి ఆలోచించి సరైన నిర్ణయం తీసుకునే బాధ్యత పట్టభద్రుల పైన ఉందని పదవి కోసం జీతం కోసమో రావడంలేదని తనకు వచ్చే జీతం మొత్తం ప్రతినెల ఒక మండలనికి ఖర్చు చేస్తానని బహిరంగంగా ప్రకటించిన ఏకైక వ్యక్తి ఎవరన్నా ఉన్నారు. అంటే తనే మా యాదగిరి శేఖర్ రావు అని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ట్రస్మా అధ్యక్షులు ఉపాధ్యక్షులు మరియు ట్రస్మా బాధ్యులు పాల్గొన్నారు.



# అర్చక రంగరాజన్ పై దాడి హేయమైన చర్య

- శ్రీ మహా గణపతి, భిక్షేశ్వర ఆలయాల అర్చకులు పల్లి రాము, సంజీవ్



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 12:** చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ పైజరిగిన దాడి చాలా తీవ్రమైన హేయమైన చర్య గా మంథని పట్టణంలో గల శ్రీ మహా గణపతి దేవాలయాల అర్చకుడు పల్లి రాము, శ్రీ బిక్షేశ్వర స్వామి ఆలయ పూజారి పల్లి సంజీవ్ లు అభివర్ణించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక ఆలయానికి ప్రధాన అర్చకుడుగా స్వామివారికి సేవ చేస్తున్న రంగరాజన్ పై రామరాజ్యం పేరుతో దాడి చేయడం చాలా దారుణమన్నారు. అసలు ఆలయ పురోహితుడు చేసిన తప్పిదం ఏమిటని వారు ప్రశ్నించారు. దాడి చేసిన రాఘవ రెడ్డి రామరాజ్యం గ్రూప్ యొక్క లక్ష్యమేమిటని వారు నిడదీశారు. రామరాజ్య స్థాపనకు రంగరాజన్ ఏమైనా అడ్డుపడ్డాడా ? ఏ రోజైనా ఆ రామరాజ్య ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రవర్తించాడా? తన ఆలయ నిర్వహణ పనులేవో తాను చేసుకుంటున్న అర్చకుని మీద శారీరక దాడి చేయడం ఎంతవరకు సమంజసము అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అసలు అర్చకుడు అనే విషయాన్ని పక్కకు పెడితే, ఒక వ్యక్తి మీద మరొక వ్యక్తి శారీరక దాడికి పాల్పడడం అంటే అతని ప్రాథమిక హక్కులకు విఘాతం కల్పించడమేనన్నారు. ఇంకా కఠినంగా చెప్పాలంటే అతని మీద అది ఒక హత్యా ప్రయత్నము లాంటిదని, ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడుతూ, ఆ చర్యలను సమర్థించుకోవడానికైనా లేదా మద్దతు కూడగట్టుకోవడానికైనా రామరాజ్యం అనే సంస్థ తరపున తామే ఈ పని చేశామని నిర్భీతిగా బాహటం గా చెప్పుకోవడం ప్రజాస్వామ్య దేశంలో ఒక క్రూరమైన స్పందనను బాహటంగా ప్రకటించడమే అవుతుందన్నారు. ఇలాంటి చర్యలు ఎవరు ఎవరి మీద చేసినా దానికి సభ్య సమాజం మద్దతు ఉండదనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఇలాంటి దాడులు తిరిగి నిర్వహిస్తామని భావిస్తే అది పూర్తిగా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఆలయ పురోహితునిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించి ఇకముందు ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా దుండగులకు కఠిన శిక్షలు అమలు చేయాలని వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

# ముఖ్యమంత్రిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యేలు



**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** ఎస్సీవర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం తెలిపిన నేపథ్యంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలో మానకొండూర్ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, వేముల వీరేశం, తోట లక్ష్మీకాంతారావు లతో పాటు పలువురు మాదిగ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్లో కలిసి ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ పోరాటానికి దేశంలోనే మొట్టమొదటగా తెలంగాణ రాష్ట్ర శాసనసభలో వర్గీకరణ నివేదికలను ప్రవేశపెట్టి చర్చ అనంతరం ఆమోదింపజేయడం శుభపరిణామని, దీంతో మాదిగల ఏళ్లనాటి కల సాకారం చేశారని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యేలు కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యేలు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

**ఇల్లంతకుంట (ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రహీంఖాన్ పేట గ్రామం వద్ద అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుదవారం పోలీసులు పట్టుకున్నారు. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన గంట సమ్మవ్వ( 27 ), కొమురయ్య అనే దంపతులు రహీమ్ ఖాన్ పేటలో బుధవారం ఇళ్ళిళ్ళుతిరుగుతూ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తూ బియ్యాన్ని తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకుని వారిద్దరిని నుండి 1.5 క్వింటాల్ల బియ్యాన్ని స్వాధీనపరచుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్టు తెలుపారు. ఎవ్వరైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసినట్లుయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇలాంటి వారిని గుర్తించితే పోలీసులకు సమాచారం అందించాలని స్థానిక ఎస్సై కదిరె శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

# డయాబెటిక్ పేషెంట్లకు ఈ బియ్యం వరం. శాస్త్రవేత్తల సలహా ఏంటంటే..

సంప్రదాయ విత్తనాలకు భిన్నంగా అధిక దిగుబడుల్చిన వంగడం సాంబ మసూరి.. దక్షిణ భారతదేశంలోని ఎక్కువ ప్రాంతాల్లో రైతులు ఈ రకం వరినే సాగు చేస్తారు. దీని అన్నం తినడానికి రుచిగా ఉంటుంది. అదే సమయంలో పంట తక్కువ రోజుల్లో పండడం వల్ల రైతుకు పెద్దగా ఖర్చు ఉండదు. నేడు ఈ ఈ రకం వరి వంగడాన్ని ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, జార?ండ్, తెలంగాణ వంటి వివిధ రాష్ట్రాల్లో 1.5 లక్షల హెక్టార్లకు పైగా సాగు చేస్తున్నారు. నిర్వహించిన జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. హితేంద్ర పటేల్ సాంబా మన్సూరి బియ్యం గురించి వివరించారు. సాంబా మసూరి బియ్యం బాక్టీరియా ముడత వ్యాధికి నిరోధకతను కలిగి ఉంటుంది. చాలా తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటుంది. ఇది డయాబెటిక్ రోగులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. గ్లైసెమిక్ ఇండెక్స్ అనేది కార్బోహైడ్రేట్-రిచ్ ఫుడ్ లేదా డ్రింక్‌ని తినడం లేదా తాగిన తర్వాత రక్తంలో ఎంత గ్లూకోజ్ పెరుగుతుందనే దాని ఆధారంగా ర్యాంక్ చేసే స్కేల్ అని గమనించాలి. తక్కువ ఉన్న బియ్యం మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిదని చెబుతున్నారు.. తక్కువ ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల రక్తప్రవాహంలోకి గ్లూకోజ్ నెమ్మదిగా విడుదలై మధుమేహం దుష్ప్రభావాలను తగ్గిస్తుంది. ఇది మంచి దిగుబడి మరియు చక్కటి ధాన్యం రకాన్ని కూడా చూపింది, దాని మార్కెట్ సామర్థ్యాన్ని మరియు రైతులకు లాభాన్ని పెంచుతుంది. ఇది బాక్టీరియా ముడతకు కూడా నిరోధకతను కలిగి ఉంటుంది.

# మహిళలను ఇబ్బందులకు గురిచేసే వారిని ఉపేక్షించేది లేదు

## - అడిషనల్ డిసిపి అడ్మిన్ సి.రాజు




**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** మహిళలను ఇబ్బందులు పెట్టే వారిని ఉపేక్షించేది లేదని, అటువంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ డిసిపి అడ్మిన్ సి.రాజు హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో షీ టీమ్స్ గత నాలుగు నెలల కాలంలో మహిళలను, అమ్మాయిలను వేధింపులకు గురిచేసిన ఈవ్ టీజర్స్, వేధింపులకు గురి చేస్తూ షీ టీమ్స్‌కు ప్రత్యక్షంగా పట్టుబడిన ఈవ్ టీజర్స్ మొత్తం 29 మందికి కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా భద్రతా విభాగం (ఉమెన్ సేఫ్టీ వింగ్) హైదరాబాద్‌కు చెందిన నిపుణులచే నిర్వహించిన జూమ్ మీటింగ్ ద్వారా ఆన్లైన్‌లో కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో మహిళలను ఎలా గౌరవించాలి, వారి పట్ల ప్రవర్తించాల్సిన తీరు, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించి నట్లయితే చట్ట ప్రకారం ఎలాంటి శిక్షలకు గురి అవుతారు, సమాజంలో మహిళలను గౌరవిస్తూ బాధ్యత గల పౌరునిగా ఎలా జీవించాలి తదితర విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి అడ్మిన్ సి.రాజు మాట్లాడుతూ ఆడవారి పట్ల బాధ్యతగా, మర్యాదగా నడుచుకోవాలని, వారికి అండగా నిలవాలని, పలు రకాల అవసరాలతో ఇంటి నుంచి బయటకు వచ్చే స్త్రీలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించ కూడదన్నారు. స్త్రీలను గౌరవించడం తమ వ్యక్తిత్వంలో భాగం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి షీ టీమ్ ఎస్ఐ ఎం.లావణ్య, షీ టీమ్ మంచిర్యాల, పెద్దపల్లి జిల్లా సిబ్బంది పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మాజీ కౌన్సిలర్




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి బస్టాండ్ సమీపంలో బైక్ పై వెళ్తున్న వ్యక్తికి గుండె పోటు రావడంతో బైక్ నుండి కింద పడిపోవడంతో అటుగా వెళ్తున్న పెద్దపల్లి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కొలిపాక సంధ్య చిరంజీవి వెంటనే స్పందించి ఆ వ్యక్తి కి సిపిఆర్ చేసి అతని ప్రాణాలు కాపాడారు. పెద్దపల్లి పట్టణం కొంతవాడకు చెందిన బర్ల శ్రీనివాస్ తన బైక్ పై బస్టాండ్ నుండి అయ్యప్ప టెంపుల్ దారిలో వెళ్తుంటే ఉన్నటుండి కింద పడి పోవడం జరిగింది గమనించిన మాజీ కౌన్సిలర్ కొలిపాక సంధ్యా చిరంజీవి ప్రక్కకు తన కారును అపి ఆ వ్యక్తిని సీపిఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. చుట్టూ ప్రక్కల వారు చేరుకొని సహాయం చేశారు వెంటనే కౌన్సిలర్ చిరంజీవి అంబులెన్సుకి సమాచారం అందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. తన ప్రాణాలు కాపాడినందుకు బర్ల శ్రీనివాస్ చిరంజీవికి కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం ప్రజలలో ఉంటూ తనకి తోచిన సహాయం అందిచడంతో పాటు నేడు ఒకరి ప్రాణాలు కాపాడడంతో స్థానికులు అభినందించారు.

# పరిశుభ్రత విషయంలో పట్టణ ప్రజలు సహకరించాలి

- చెత్త - ప్లాస్టిక్ రహిత పెద్దపల్లిగా తీర్చిదిద్దుదాం
- మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి పట్టణ పరిశుభ్రత విషయంలో ప్రజలందరూ సహకరించాలని,పెద్దపల్లి పట్టణాన్ని చెత్త ప్లాస్టిక్ రహిత పెద్దపల్లిగా తీర్చిదిద్దామని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ అన్నారు. స్వచ్ఛత హీ సేవ 2024-25 కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మున్సిపల్ సిబ్బంది తో కలిసి పెద్దపల్లి పట్టణం లోని మినీ ట్యాంక్ బండ్ (ఎల్లమ్మ గుండమ్మ చెరువు) పై స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణాన్ని చెత్త - ప్లాస్టిక్ రహిత పెద్దపల్లి గా తీర్చిదిద్దడానికి పెద్దపల్లి పట్టణ ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఇంట్లో ప్రతిరోజు వెళ్లే చెత్త తడి పొడి చెత్తగా వేరుచేసి మీ వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని అలాగే పెద్దపల్లి పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ పై సాయంత్రం వేళ వచ్చే సందర్శకులు అలాగే పట్టణ ప్రజలు ఇంట్లో నుండి పూజ సామాన్లు,ప్లాస్టిక్ కవర్లు తీసుకువచ్చి చెరువులో వేయడం జరుగుతుందని దయచేసి అలా వేయకుండా మినీ ట్యాంక్ బండ్ పై ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ డస్ట్ బిన్స్ లో వేయాలని అన్నారు. పెద్దపల్లి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే క్రమంలో మీ వంతు సహాయ సహకారాలు అందించాలని, ఇంత చక్కటి కార్యక్రమం చేయడం చాలా సంతోషంగా ఉందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బందికి వార్డ్ ఆఫీసర్లకు మరియు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్, వార్డ్ ఆఫీసర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అడుగంటి పోతున్న భూగర్భజలాలు

- జోరుగా సాగుతున్న ఇసుకదందా..
- ట్రాక్టర్ల ద్వారా ఇష్టానుసారంగా ఇసుక జాతర
- ఇసుక తరలిస్తున్న వారిపై పిడియాక్ట్ నమోదు చేయాలి




**భూపాలపల్లి, ఫిబ్రవరి -12:(ది క్రైమ్ న్యూస్):** టేకుమట్ల, చిట్యాల మండలాల్లో అక్రమ ఇసుక రవాణా మూలంగా భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టేకుమట్ల మండలం కలికోటపల్లి శివారు మానేరు నుండి, చిట్యాల మండలం కల్వపల్లి మానేరు నుండి నిరంతరం రాత్రనక పగలనక ఇసుక దోపిడీ జరుగుతుందని గత ప్రభుత్వంలో లారీల ద్వారా అక్రమ ఇసుక రవాణా జరిగేదని ప్రస్తుత ప్రభుత్వంలో ట్రాక్టర్ల ద్వారా నిరంతరం ఇసుక అక్రమ రవాణా చేస్తూ కొంత మంది నాయకులు అట్టి ఇసుకను పట్టణాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని , ప్రభుత్వం మారిన కూడా సహజ వనరుల దోపిడీ ఆగడం లేదని, గతంలో లారీల ద్వారా ఇప్పుడు ట్రాక్టర్ ల ద్వారా తరలించడమేనని ఎద్దేవా చేశారు. ఈ అక్రమ రవాణా మూలంగా భూగర్భ జలాలు అడుగంటిపోయి ప్రజలకు తాగు,సాగునీరు దొరకక చాలా ఇబ్బందులు పడుతున్నారని, చలివాగు పరివాహక ప్రాంతాల్లో బోర్లు ఎండిపోయి పంటలు పండే పరిస్థితి లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత అక్రమ దందా కొనసాగుతున్న మైనింగ్ రెవెన్యూ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై పిడి యాక్ట్ నమోదు చేయాలని, యాసంగి పంటలకు డిబిఎం 38 కాలువ ద్వారా రైతులకు నీరు అందించే విధంగా మరియు ఈ అక్రమ ఇసుక దందాను అరికట్టే విధంగా జిల్లా కలెక్టర్, మరియు శాసనసభ్యులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# సింగరేణి అధికారులతో సీఎంపిఎఫ్ కమిషనర్ సమావేశం




**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రెండవ ఏరియా జీఎం కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం సీఎంపిఎఫ్ (భవిష్య నిధి) కో ఆడినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఉదయం ఇక్కడికి వచ్చిన సీఎంపిఎఫ్ రామగుండం రీజినల్ కమిషనర్ శ్రీహరి పచోరి ని ఏరియా అధికారులు శాలువా కప్పి పుష్పగుచ్చాన్ని అందజేసి స్వాగతం పలికారు. తదనంతరం జరిగిన సమావేశంలో ఆయన ఏరియా ఉద్యోగుల సీఎంపిఎఫ్ రికవరీ ఇతర అంశాలపై సింగరేణి అధికారులతో చర్చించారు. సింగరేణి కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయం ద్వారా కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించి మెంబర్ మాస్టర్ డేటాను సమర్పించడం, 11.11.2024 నాటి లెటర్ నెం. -31- 0028.0/1/2023-%/47 ద్వారా లోని సబ్‌స్క్రైబర్ల డేటాను సవరించడం, కాంట్రాక్ట్ కార్మికుల కవరేజీ మరియు %ూూ%-5 యొక్క సకాలంలో డిపాజిట్, తప్పనిసరి రాబడి, రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించి సాఫ్ట్ కాపీలో, అలాగే హార్డ్ కాపీలో యొక్క సకాలంలో సమర్పించడం, సవరించిన పెన్షన్ క్లెయిమ్ సెటిల్మెంట్, పోర్టల్‌లో ప్రకారం అడ్వాన్స్ క్లెయిమ్‌ల సమర్పణ తదితర విషయాలపై కమిషనర్ ఏరియా సింగరేణి అధికారులతో చర్చించారు. అలాగే ఏరియాలోని సంభంధించిన సమస్యలపైన ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జియం ఎం.రాముడు, డిజిఎం (పర్సనెల్) అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్, డిజిఎం ఫైనాన్స్ వెంకట రామచంద్ర, ఏరియా సెక్యూరిటి అధికారి షరీఫ్ మహమ్మద్, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రెటరీ జిగురు రవీందర్, అసిస్టెంట్ సెక్రెటరీ సామ్సన్, ఏరియాలోని వివిధ విభాగాల అధికారులు, సంక్షేమాధికారులు, సిఎంపిఎఫ్ కొ ఆడినేషన్ కమిటీ అధికారులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లా మూడవ మహాసభను విజయవంతం చేయండి


## - ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్



**పగడపల్లి, ఫిబ్రవరి, 12 (ది క్రైమ్ న్యూస్):** పెగడపల్లి మండల కేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్, ఆధ్వర్యంలో భవనిర్మాణ కార్మికుల కరపత్రం విడుదల చేశారు. అనంతరం ఇరుగురాల భూమేశ్వర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా మూడవ మహాసభను విజయవంతం చేయాలని కోరారు కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలని అన్నారు. సంక్షేమ బోర్డులో ఉన్న కోట్లాది రూపాయలు ఇతర అవసరాలకు ప్రభుత్వం వాడకుండ కార్మికులకే చెందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు జిల్లాలో కార్మికుల ఐక్యతను చాటుతూ జిల్లా 3వ మహాసభను అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి శనిగారపు ప్రవీణ్, మండల కన్వీనర్ రాచర్ల సురేష్, బొమ్మన శంకర్, బొమ్మన బాబు, సుంకే ప్రకాష్, బొమ్మన పురుషోత్తం, మల్యాల అంజయ్య, వద్లూరి అంజయ్య, బొల్లం రవి, బైర అంజయ్య, బైరరాజ్ కుమార్, బొమ్మన శంకర్, తదితరులు పాల్గొన్నారు..

# స్వదేశీ భావజాలంతో దేశం ఆర్థికంగా మనుగడ సాధిస్తుంది

## - స్వదేశీ మేళాతో ఉత్పత్తులు, వ్యాపారులకు, కళాకారులకు గుర్తింపు



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి12(ది క్రైమ్ న్యూస్):** స్వదేశీ జాగరణ మంచ్ నిర్వహిస్తున్న స్వదేశీ మేళాతో స్థానిక కళాకారులు, ఉత్పత్తులు, వ్యాపారులను అమితంగా ప్రోత్సహించడం అభినందనీయమని, స్వదేశీ భావజాలం కలిగి ఉండి స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయడం వల్ల దేశానికి ఆర్థిక ప్రయోజనమే కాకుండా, కుటుంబం, గ్రామం, రాష్ట్రం, దేశం మొత్తం స్వయం సమృద్ధిని సాధిస్తుందని స్వాలంబి భారత్ అభియాన్ ప్రాంత కో కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, స్వదేశీ జాగరణ మంచ్ దక్షిణ మద్య క్షేత్ర సంఘటన కార్యదర్శి జగదీష్ జి, రాష్ట్రీయ స్వయంసేక్ సంఘ్ తెలంగాణ పూర్వ సంఘ్ చాలాక్ బుర్లా దక్షిణామూర్తి అన్నారు. బుధవారం స్వదేశీ మేళా ప్రారంభోత్సవ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారూ మాట్లాడుతూ ముఖ్యంగా స్వదేశీ అనేది మన స్వయం సమృద్ధి తో పాటు దేశ ఆత్మ నిర్భరతను అన్ని రంగాల్లో సహకారం చేసే అద్భుత తారక మంత్రమన్నారు. ముఖ్యంగా స్వదేశీ వస్తువుల తయారీ దిగుమతి చేసుకున్న వస్తువులపై ఆధారపడటాన్ని అధిగ మించడంలో సహాయపడుతుందని , ప్రజలు స్వదేశీ వస్తువులు, ఉత్పత్తులను ఉపయోగించాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రధానంగా స్వదేశీ వస్తువుల తయారీదారుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, ప్రయోజనాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వదేశీ మేళా ప్రోగ్రాంలో భాగంగా పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించారు. విద్యా తో పాటుగా ఉద్యోగం, వ్యాపారం లల్లో రాణించలని, ఉద్యోగం ఇచ్చే స్థాయి కి ఎదగాలని ఈ వర్క్ షాప్ కార్యక్రమంలో పాల్గొన్న కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ సూపరిండిన్డెంట్ సుంకర శ్రీనివాస్ , ఐ వి వై స్కూల్ చైర్మన్ పసువుల మహేష్ సూచించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సూచనలు చేసి, విద్యార్దుల భవిష్యత్తు ను తీర్చిదిద్దుకోవడానికి పలు ఉదాహరణలు చెప్పారు. ఇట్టి కార్యక్రమంలో స్వదేశీ మేళా బాధ్యులు ముక్క హరీష్ బాబు, గంప వెంకట్, కళ్లెం వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సంత్ సేవాలాల్ జయంతి

- 286 వ జయంతి 15 ఫిబ్రవరిన రాష్ట్ర ప్రభుత్వం సెలవు రోజుగా ప్రకటించాలి
- బి,జె,పి సీనియర్ నాయకులు రఘు నాయక్, రవీందర్ నాయక్...



**సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్):** సంగారెడ్డి జిల్లాలో బుధవారం జరిగిన సమావేశం లో బి జె పి నాయకులు రఘు నాయక్ మాట్లాడుతూ సేవాలల్ జయంతి రోజు బంజారా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్దులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేస్తారు. మహా భోగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, ఈ కార్యక్రమాలకు బంజారాలు భారీ సంఖ్యలో పాల్గొంటారు కావున ఆ రోజు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని ఆయన కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారకంగా ఘనంగా నిర్వహించేందుకు తక్షణమే సెలవు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో బంజారా నాయకులు రఘు నాయక్, రవీందర్ నాయక్, బేగంపేట్ తండా ప్రవీణ్, వినోద్, రవి నాయక్, శంకర్, రాము, రమేష్, బంజారా సభ్యులు పాల్గొన్నారు.

# రోజూ ఈ జ్యూస్ తాగితే ఇన్ని లాభాలా..? ఇప్పటికైనా అలవాటు చేసుకోండి..!



జీర్ణ సమస్యలతో బాధపడేవారికి పైనాపిల్ జ్యూస్ చాలా మేలు చేస్తుంది. మీరు అతిసారం, కడుపు నొప్పి, మలబద్ధకం లేదా ఉబ్బరంతో బాధపడుతుంటే, పైనాపిల్ రసం మీకు సరైనది. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ పండులో లభించే కాల్షియం, మెగ్నీషియం, ఇతర పోషకాలు పైనాపిల్స్‌లో తగినంత పరిమాణంలో కనిపిస్తాయి. ఇది ఎముకలు, దంతాలను బలపరుస్తుంది. పైనాపిల్ రసంలో పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి.



ముఖ్యంగా మాంగనీస్, కాపర్, విటమిన్ బి6, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలన్నీ ఎముకల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, గాయం నయంకావటం, శక్తి ఉత్పత్తి చేయటానికి, కణజాల సంశ్లేషణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.ఇందులో ఐరన్, కాల్షియం, ఫాస్పరస్, జింక్, కోలిన్, విటమిన్లు కె, బి కూడా ఉంటాయి. పైనాపిల్ యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి అద్భుతమైన మూలం. ఇది గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. పైనాపిల్ జ్యూస్ తాగడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి. పైనాపిల్ రసంలో విటమిన్ ఎ లభిస్తుంది. ఇది కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పిల్లలకు పైనాపిల్ జ్యూస్ ఇవ్వడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. అనేక రకాల క్యాన్సర్‌తో పోరాడవచ్చు.. బ్రోమెలైన్ జీర్ణక్రియ, గుండె ఆరోగ్యంతో పాటు అనేక రకాల క్యాన్సర్‌ల నుండి మిమ్మల్ని కాపాడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆస్తమా లక్షణాలను కూడా తగ్గించవచ్చు. పైనాపిల్ రసం ఉబ్బసంతో ఇబ్బంది పడేవారికి కూడా మేలు చేస్తుంది. పైనాపిల్ జ్యూస్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది మీ శరీరాన్ని డ్యామేజ్ నుండి, ఇతర వ్యాధుల నుండి కాపాడుతుంది. ఇందులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్‌ల సమూహం కూడా ఉంటుంది. ఇది వాపును తగ్గిస్తుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

# 30 ఏళ్లు వచ్చేసరికి.. పురుషుల్లో వచ్చే అనారోగ్య సమస్యలు ఇవే!

సాధారణంగా వయసు పెరిగే కొద్దీ.. ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు వస్తూ ఉంటాయి. ఇవి చాలా కామన్ విషయం. కానీ ఇప్పుడున్న రోజుల్లో చిన్న పెద్దా అనే వయసుతో సంబంధం లేకుండా అన్ని రకాల వ్యాధులు వస్తున్నాయి. వీటి పట్ల మొదట్లోనే జాగ్రత్తలు తీసుకోకపోతే.. చిన్న సమస్యలు కాస్తా పెద్ద సమస్యలుగా మారుతున్నాయి. అయితే ఆడవారి కంటే పురుషులు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఉంటారు. అస్సలు పట్టించుకోరు. అనారోగ్య సమస్యల లక్షణాలు కనిపించినా కేర్ చేయరు. ఆ తర్వాత ఆస్పత్రి పాలవ్వాల్సి వస్తుంది. ఇటీవల జరిగిన సర్వేల ప్రకారం.. 30 ఏళ్లు దాటిన పురుషుల్లో కొన్ని రకాల హెల్త్ ప్రాబ్లమ్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయట. వీటిని ప్రారంభంలో గుర్తించకపోతే.. చివరికి ప్రాణాల మీదకే వస్తుంది. ఇంతకీ పురుషులకు 30 ఏళ్లు దాటాక వచ్చే సమస్యలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఎముకలు బలహీనం: 30 ఏళ్లు వచ్చిన తర్వాత పురుషుల్లో ఎముకలు



బలహీనంగా మారతాయి. ఈ వయసులో ఆహారం విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే.. శరీరంలో విటమిన్ డి, క్యాల్షియం లోపం ఏర్పడుతుంది. దీంతో కీళ్ల నొప్పులు, ఎముకలకు సంబంధించిన సమస్యలు రావచ్చు. కాబట్టి 30 ఏళ్ల వయసులో పురుషులు ఖచ్చితంగా క్యాల్షియం ఉండే ఆహారం తీసుకోవాలి. అలాగే వ్యాయామం కూడా చేయాలి. గుండె జబ్బులు: ప్రస్తుత కాలంలో ఉన్న ఆహారపు అలవాట్ల కారణంగా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ అనేది విపరీతంగా పెరిగిపోతుంది.

ఈ కొలెస్ట్రాల్ కారణంగా గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. మీ లైఫ్ స్టైల్‌లో ఖచ్చితంగా మార్పులు చేసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. బరువు పెరగడం: పురుషులకు 30 ఏళ్లు దాటాక.. బరువు అనేది పెరుగుతూ ఉంటారు. ఒత్తిడి, సరైన వేళకు సరైన ఆహారం తీసుకోకపోవడం వంటి కారణాల వల్ల బరువు అనేది పెరిగిపోతారు. ఈ సమయంలో మీరు మీ శరీరంపై ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలి. వ్యాయామాలు, వాకింగ్ వంటివి చేయడం వల్ల ఒత్తిడి, బరువు తగ్గుతాయి. క్యాన్సర్: పురుషులకు 30 ఏళ్ల వయసులో ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. మూత్రంలో మంట, వృషణాల్లో నొప్పి, యూరిన్ సమస్యలు, ఇన్ ఫెక్షన్లు రావచ్చు. మీరు ఈ సమస్యలతో ఇబ్బంది పడితే టెస్టులు చేయించుకోవడం అవసరం.

# గుట్టలాంటి పొట్టకు ఛూమంత్రం..





గసగసాలులో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మసాలా దినుసు గసగసాలు యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉన్నాయి. వీటిని రాగి, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, కాల్షియం, ఫైబర్, మాంగనీస్ గొప్ప మూలంగా పరిగణిస్తారు. గసగసాలు అనేక వ్యాధుల నుండి రక్షించడంలో సాయపడతాయి. నాడీ వ్యాధులు, మధుమేహం, గుండె జబ్బులు వంటి వివిధ రకాల ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలోగసగసాలుఉపయోగపడతాయి.ఇంకాఎసిడిటీ, మలబద్ధకం సమస్య నుంచి కూడా ఉపశమనం కలిగిస్తాయి. గసగసాలు.. బరువు తగ్గించడంలో కూడా ప్రభావవంతంగా ఉంటాయి. పొట్ట, నడుము చుట్టూ కొవ్వు పెరగడం వల్ల మీరు ఇబ్బంది పడుతుంటే గసగసాలు తీసుకోవడం చాలా మంచిది.. ఎందుకంటే ఇందులోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్‌లు బరువు తగ్గడానికి సహకరిస్తాయి. గసగసాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. రోజువారీ ఆహారంలో గసగసాలు చేర్చుకుంటే.. కొన్ని రోజుల్లోనే మార్పు వస్తుంది. ఇంకా గసగసాల సిరప్‌ను మార్కెట్ నుంచి కొనుగోలు చేసి, దానిని షర్బత్‌గా చేసుకుని తాగవచ్చు.ఇదితీసుకోవడం వల్లఎక్కువసేపు ఆకలిగా అనిపించకుండా చేస్తుంది. దీంతో బరువు క్రమంగా తగ్గుతుంది.గసగసాలు, పాలు కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. దీని వినియోగం వల్ల కండరాలు, ఎముకలు బలపడతాయి. ఒక గ్లాసు పాలలో 1టేబుల్ స్పూన్ గసగసాలు వేసిమరిగించి గోరువెచ్చగా ఉన్నప్పుడు త్రాగాలి.

# ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొత్తిమీర నీళ్లు తాగితే ఏమవుతుందో తెలుసా..?

కొత్తిమీర నీరు ఎసిడిటీ, పిత్తాను తగ్గించడంలో చాలా మేలు చేస్తుంది. కొత్తిమీరలోని గుణాలు పొట్టకు మేలు చేస్తాయి. కొత్తిమీర నీరు తాగడం వల్ల కడుపులో యాసిడ్ స్థాయి తగ్గుతుంది. ఎసిడిటీ వల్ల వచ్చే మంట, నొప్పి తగ్గుతుంది. కొత్తిమీరలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది అసిడిటీ వల్ల వచ్చే సమస్యలను తగ్గిస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొత్తిమీర నీరు తాగడం వల్ల కడుపు సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కొత్తిమీర నీరు మలబద్ధకం సమస్య నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. కొత్తిమీరలో అధిక పీచు ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొత్తిమీర గింజలలో ఉండే థైమోల్ అనే పదార్థం మలబద్ధకం నుండి ఉపశమనం కలిగించే జీర్ణ రసాల స్రావాన్ని పెంచుతుంది. అలాగే, కొత్తిమీర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. ఇది మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. బరువు నియంత్రణ, బరువు తగ్గడంలో కొత్తిమీర నీరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కొత్తిమీరలో ఉండే ఫైబర్ కడుపు నిండుగా ఉంచుతుంది. ఆకలి దప్పులను తగ్గిస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు నియంత్రణలో సహాయపడుతుంది. కొత్తిమీరలో ఉన్న పాలీఫెనాల్ యాంటీ ఆక్సిడెంట్లు కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి. థైరాయిడ్ సమస్యలకు సహజ నివారణగా పనిచేస్తుంది. కొత్తిమీర ఆకులు, కాండం యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి సరైన థైరాయిడ్ పనితీరుకు సహాయపడతాయి. మీరు దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తాగితే అద్భుత ఫలితం ఉంటుంది. కొత్తిమీరలో గ్లైసెమిక్ 33 మాత్రమే ఉంది. ఇది చాలా తక్కువ. అటువంటి పరిస్థితిలో, ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా చెప్పవచ్చు. పచ్చి కొత్తిమీర శరీరంలో చక్కెర స్థాయిని తగ్గించి, ఇన్సులిన్ మొత్తాన్ని పెంచుతుంది. అలాగే, రక్తంలో చక్కెర తక్కువగా ఉంటే కొత్తిమీర నీటిని తాగకూడదు. అది రక్తంలో చక్కెరను తగ్గిస్తుంది.





# అవిసె గింజలతో ఆరోగ్యమే కాదు.. ఇలా వాడితే మెరిసే అందం మీ సొంతం!



మన శరీరానికి అవసరమైన ఎన్నో పోషకాలు అవిసె గింజల్లో ఉన్నాయి. కొలెస్ట్రాల్, డయాబెటిస్, ఆర్థరైటిస్ వంటి సమస్యలు ఉన్నవారు, ప్రతిరోజూ అవిసె గింజలతో చేసిన ఆహారాన్ని తినడం వల్ల వాటిని అదుపులో ఉంచుకోవచ్చు. మన శరీరానికి ఎంతో అత్యవసరమైన ఒమేగా త్రీ ఫ్యాటీ ఆమ్లాలు అవిసె గింజల్లో ఉంటాయి. ఇవి పిల్లలకు, పెద్దలకు, గర్భిణులకు చాలా అవసరం. అవిసె గింజలతో చేసుకుంటే రోజుకో లడ్డును తినవచ్చు. ఇది శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఫేస్ ప్యాక్: ఒక టీస్పూన్ అవిసె గింజలను కప్పు నీటిలో వేసి అరగంట పాటు నానబెట్టాలి. తర్వాత చిన్న మంటమీద నీరంతా జెల్‌గా మారేవరకు ఉడికించాలి. చల్లారిన తర్వాత జెల్‌ను ముఖానికి పట్టించాలి. కాసేపటి తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. రోజుకు ఒకసారి ఈ ప్యాక్ వేసుకుంటే చర్మంపై ఉన్న వాపు, మచ్చలు, మొటిమలు తగ్గుతాయి. రోజ్ వాటర్‌తో: అవిసెలను నీళ్లలో నానబెట్టి మిక్సీలో వేసి పేస్టులా చేసుకోవాలి. ఆ పేస్టులో రోజ్ వాటర్ కలిపి ముఖానికి పట్టించాలి. ఇలా చేయడం వల్ల అవిసె గింజల్లో ఉన్న పోషకాలు చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తాయి. స్క్రబ్ గా ఉపయోగపడుతుంది: చర్మంలో ఉండే మృత కణాలను తొలగించి చర్మాన్ని తాజాగా ఉంచడానికి అవిసె గింజల పొడి మంచి స్క్రబ్‌గా ఉపయోగపడుతుంది. ఇందుకోసం ఒక కప్పులో అవిసె గింజల పొడి, ఒక టేబుల్ స్పూన్ తేనె వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకుని పదిహేను నిమిషాల తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. ఇలా చేస్తే చర్మం తాజాగా మారుతుంది. జుట్టు ఆరోగ్యానికీ: ఒక టీస్పూన్ అవిసె గింజల పొడిని చిన్న గిన్నెలో వేసి, ఒక గుడ్డును కొట్టి ఆ పొడిలో వేసి బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి, జుట్టుకు రాసుకుని అరగంట తర్వాత స్నానం చేయాలి. ఇలా చేస్తే జుట్టు మెరుస్తుంది. చర్మం కాంతిమంతంగా మారుతుంది.

# షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచే దివ్యాస్త్రాలు.. ఈ 5 జాగ్రత్తలు తప్పనిసరి!






డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు ఏడాది పొడవునా బ్లడ్ షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచుకోవడం సవాలుతో కూడుకున్న విషయం. ముఖ్యంగా వేసవిలో షుగర్ లెవెల్స్‌ను తగ్గించుకోవడం అంత సులువు కాదు. అందుకే డయాబెటిక్ రోగులందరికీ వేసవి కష్టకాలంతో సమానం. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వేసవిలో మీ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చంటున్నారు నిపుణులు. వోక్‌హార్డ్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ మీరా.. డయాబెటిక్ రోగులను వేసవి ఎలా ప్రభావితం చేస్తుందో వివరించారు. సాధారణంగా అధిక వేడి వల్ల అలసట, డీహైడ్రేషన్ వంటి కారణాల వల్ల రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవడం కష్టతరం అవుతుంది. అందుకే మధుమేహం ఉన్నవారు వేసవిలో మరింత జాగ్రత్తగా ఉంగాలి. ఎందుకంటే మధుమేహం ఉన్నవారు తమ శరీరంలోని నీటిని త్వరగా కోల్పోతారు. దీంతో సులభంగా నిర్జలీకరణానికి గురవుతారు. పైగా తక్కువ నీరు తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. దీంతో రక్తనాళాలు, నరాల దెబ్బతినడం వంటి కొన్ని మధుమేహం సమస్యలు స్వేద గ్రంధులపై ప్రభావం చూపుతాయి. పైగా శరీర ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది. ఇది హీట్ ఎగ్జాషన్, హీట్ స్ట్రోక్‌కు కారణమవుతుంది. ఒక్కోసారి ప్రాణాలు కూడా పోతాయి. అందుకే వేసవిలో షుగర్ లెవల్స్ అదుపులో ఉంచుకోవాలి. వేసవిలో మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ కింది జాగ్రత్తలు తీసుకుంటే హాయిగా ఉండొచ్చు. ఔ వేసవిలో మధుమేహాన్ని నియంత్రించడానికి తీసుకోవల్సిన జాగ్రత్తలు వీలైనంత హైడ్రేటెడ్‌గా ఉండాలి వేసవి కాలంలో అధిక వేడికారణంగా చెమట ద్వారా ఎక్కువ నీటిని కోల్పోతారు. ఇది నిర్జలీకరణానికి దారితీస్తుంది. నిర్జలీకరణం రక్తంలో చక్కెర స్థాయిలను పెంచడానికి దారితీస్తుంది. అందుకే ఈ కాలంలో నీరు ఎక్కువగా తాగాలి. తద్వారా డీహైడ్రేషన్‌ను నివారించవచ్చు. కానీ చక్కెర కలిపిన తీపి పానీయాలకు దూరంగా ఉండాలి. ఆల్కహాల్ కెఫిన్ వద్దు ఆల్కహాల్, కెఫిన్ ఆధారిత పానీయాలు నిర్జలీకరణానికి దారితీస్తాయి. ఎందుకంటే ఇవి అధిక మూత్రవిసర్జనకు కారణం అవుతాయి. ఈ పానీయాలు శరీరంలో నీటిని కోల్పోవడానికి, రక్తంలో చక్కెర స్థాయిలను పెంచడానికి దారితీస్తాయి. కాబట్టి అలాంటి డ్రింక్స్ తీసుకోవడం తగ్గించాలి. రక్తంలో చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ ఉండాలి వేసవిలో రక్తంలో చక్కెర స్థాయిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలి. వేడి వాతావరణంలో హృదయ స్పందన రేటు పెరిగి, అధిక చెమటలు పట్టవచ్చు. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుంది. అందుకే ఈ కాలంలో ఇన్సులిన్ మోతాదును మార్చుకోవాలి. ఇన్సులిన్ మోతాదును మార్చాలనుకుంటే వైద్యుడిని సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి. శారీరకంగా చురుకుగా ఉండాలి శారీరకంగా చురుకుగా ఉండటం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చు. ఈ కాలంలో యాక్టివ్‌గా ఉండటానికి ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయాలి. ఇలాంటి చిన్నపాటి వ్యాయామాలు చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలో హెచ్చుతగ్గులు వస్తాయి. అందుకే వ్యాయామాలు చేసే ముందు, పూర్తి చేసిన తర్వాత దాన్ని పరీక్షించుకోవాలి. ఎండలో బయటకు వెళ్లకపోవడం బెటర్ రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవడానికి వేసవి ఎండల నుంచి మిమ్మల్ని మీరు వీలైనంత ఎక్కువగా రక్షించుకోవాలి. వడదెబ్బ శరీరాన్ని ఒత్తిడికి గురి చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ఒకవేళ తప్పనిసరైతే చర్మానికి సన్ స్క్రీన్ రాసుకోవడంతోపాటు వడదెబ్బను నివారించడానికి టోపీ, సన్ గ్లాసెస్, గొడుగుతో బయటకు వెళ్లాలి. అలాగే, శరీరంలోని బహిర్గత భాగాలను కవర్ చేసేలా చూసుకోవాలి.

# ఇంగ్లాండ్‌పై భారత్ సూపర్ విక్టరీ

స్పోర్ట్స్

**ఇంగ్లాండ్‌ను వైట్ వాష్ చేసిన భారత జట్టు**
**142 పరుగుల తేడాతో విజయం**
**3-0 తేడాతో సిరీస్ కైవశం**
**భారీ స్కోర్ నమోదు చేసిన భారత్**
**తకంతో కదం తొక్కిన శుభ్?మన్ గిల్**
**విరాట్, అయ్యర్ మెరుపు ఇన్నింగ్స్**
**వన్డేల్లో కోహ్లి 73వ అర్ధ సెంచరీ పూర్తి**




భారత్-ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో చివరి మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగింది. ఈ మ్యాచ్‌లో ఇండియా బ్యాటింగ్, బౌలింగ్ లో అదరగొట్టి 142 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో ఇంగ్లాండ్ జట్టును వైట్ వాష్ చేస్తూ సిరీస్‌ను 3-0 తేడాతో భారత జట్టు గెలుచుకుంది. టాస్ గెలిచిన ఇంగ్లాండ్ కెప్టెన్ జోస్ బట్లర్ ముందుగా బౌలింగ్ ఎంచుకోవడంతో భారత్ బ్యాటింగ్ కు దిగింది. భారత్ అద్భుతమైన బ్యాటింగ్ తో 50 ఓవర్లలో ఇంగ్లాండ్ ముందు 357 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. భారీ టార్గెట్ లో బ్యాటింగ్ కు దిగిన ఇంగ్లాండ్ జట్టు 34.2 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌట్ అయింది. 357 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ ను భారత బౌలర్లు చెడుగుడు ఆడుకున్నారు. ఆరంభం నుంచే ఇంగ్లాండ్ పై పట్టు సాధించి పరుగులు చేయకుండా అడ్డుకున్నారు. ఇంగ్లాండ్ కు మంచి ఆరంభం లభించింది. 11 ఓవర్లలో 2 వికెట్లకు 89 పరుగులు చేసింది. బెన్ డకెట్ దూకుడుగా ఆటను ప్రారంభించాడు కానీ, పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. అతను 22 బంతుల్లో 34 పరుగులు చేశాడు. అర్ష్‌దీప్ సింగ్ వేసిన ఒక ఓవర్‌లో డకెట్ వరుసగా 4 ఫోర్లు కొట్టాడు. డకెట్ తన ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లు కొట్టాడు. అర్ష్‌దీప్ సింగ్ వేసిన బంతికి కెప్టెన్ రోహిత్ శర్మ అతన్ని క్యాచ్‌గా తీసుకున్నాడు. డకెట్ తర్వాత, ఫిలిప్ సాల్ట్ 21 బంతుల్లో 23 పరుగులు చేసి ఔటయ్యాడు. సాల్ట్ 4 ఫోర్లు కొట్టి అర్ష్‌దీప్ బౌలింగ్‌లో అక్షర్ బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. కుల్దీప్ యాదవ్ భారత్ కు మూడో వికెట్ అందించాడు. అతను టామ్ బాంటన్, జో రూట్ భాగస్వామ్యాన్ని కట్ చేశాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కుల్దీప్ బాంటన్ ను కేఎల్ రాహుల్ క్యాచ్ తో అందుకున్నాడు. బాంటన్ 41 బంతుల్లో 38 పరుగులు చేశాడు. ఆ తర్వాత లెజెండరీ బ్యాట్స్‌మన్ జో రూట్‌ను అక్షర్ పటేల్ క్లీన్ బౌల్డ్ చేశాడు. రూట్ 29 బంతుల్లో 24 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ కు చేరాడు. 22 ఓవర్లలో 4 వికెట్లకు 139 పరుగులు చేసిన ఇంగ్లాండ్ ఆ తర్వాత కూడా భారత బౌలింగ్ ముందు నిలవలేకపోయింది. ఆ తర్వాత హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్ లు రాణించడంతో ఇంగ్లాండ్ కష్టాలు మరింత పెరిగాయి. ఇంగ్లాండ్ స్కోరు 31 ఓవర్లలో 8 వికెట్లకు 179 పరుగులు చేసింది. మొత్తంగా బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా తలా 2 వికెట్లు తీసుకోవడంతో ఇంగ్లాండ్ జట్టు 214 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో ఇంగ్లాండ్ పై ఇండియా 142 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ తో పాటు సిరీస్ మొత్తంగా పరుగుల వరద పారించిన భారత వైస్ కెప్టెన్ శుభ్ మన్ గిల్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును అందుకున్నాడు. అనతకుముందు మూడో వన్డేలో ఇంగ్లాండ్ కు 357 పరుగుల లక్ష్యాన్ని భారత్ నిర్దేశించింది. బుధవారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఇంగ్లాండ్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత జట్టు 50 ఓవర్లలో 356 పరుగులకు ఆలౌట్ అయింది. శుభ్‌మన్ గిల్ (102 బంతుల్లో 112 పరుగులు) సెంచరీ సాధించాడు. విరాట్ కోహ్లీ 52, శ్రేయాస్ అయ్యర్ 78, కేఎల్ రాహుల్ 40 పరుగులు చేసి జట్టు స్కోరును 350 దాటించారు. విరాట్ ఎట్టకేలకు తన హాఫ్ సెంచరీతో విమర్శలకు సమాధానం ఇచ్చాడు. వన్డేల్లో అతడికి ఇది 73వ అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. బోర్డర్- గావస్కర్ ట్రోఫీ తర్వాత తాజా మ్యాచ్?లో కోహ్లీ అద్భుతమైన టచ్‌లో కనిపించాడు. రెండో వికెట్‌కు గిల్‌తో కలిసి కీలకమైన 116 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ ఇన్నింగ్స్‌లో 7 ఫొర్లు, 1 సిక్సు ఉంది. కీలకమైన ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు విరాట్ వైట్?బాల్ ఫార్మాట్లో కమ్?బ్యాక్ ఇవ్వడం భారత్?కు శుభసూచికం. గత మ్యాచ్?లో కెప్టెన్ సెంచరీతో అలరించగా, తాజాగా విరాట్ హాఫ్ సెంచరీతో రాణించాడు. ఈ సిరీస్?తో సీనియర్లిద్దరూ టచ్?లోకి రావడంతో టీమ్‌ఇండియా ఫ్యాన్స్? సోషల్ మీడియాలో తమ ఆనందం షేర్ చేసుకుంటున్నారు. ఇక రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కూడా కోహ్లీ ఇన్నింగ్స్‌ను ప్రశంసిస్తూ పోస్ట్ షేర్ చేసింది. 'కింగ్ ఈజ్ బ్యాక్' అనే హ్యాష్ ట్యాగ్‌లతో సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఓపెనర్ రోహిత్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు హాట్‌స్టార్ వ్యూవర్స్ సంఖ్య 80 లక్షలుగా ఉంది. కోహ్లీ వచ్చిన తర్వాత అకస్మాత్తుగా 1.9 కోట్లకు చేరుకుందని ఓ ఫ్యాన్ పోస్ట్ చేశాడు. మరోవైపు, శ్రేయస్ అయ్యర్ కూడా నిలకడగా ఆడుతున్నాడు. నాలుగో స్థానంలో స్థిరంగా రాణిస్తూ జట్టులో చోటు పదిలం చేసుకుంటున్నాడు. ఈ సిరీస్?లో రెండు హాఫ్ సెంచరీలు నమోదు చేసి తన ప్రతిభ చాటుకుంటున్నాడు. ఈ సిరీస్‌లో అయ్యర్ రెండో హాఫ్ సెంచరీ కొట్టాడు. మూడో వన్డేల్లో ఎనిమిది ఫోర్లు, రెండు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. 64 బంతుల్లోనే 78 పరుగులు చేశాడు. 122 పరుగుల వద్ద విరాట్ ఔట్? అవ్వగానే అయ్యర్ క్రీజులోకి వచ్చాడు. ఎదుర్కొన్న తొలి బంతి నుంచే ఆధిపత్యం చూపించాడు. ఎడా పెడా బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ క్రమంలోనే 43 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత వేగంగా సెంచరీ దిశగా దూసుకెళ్లాడు. దురదృష్టవశాత్తూ 78 పరుగులు వద్ద ఆదిల్? రషీద్ బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అయ్యర్, గిల్ 93 బంతుల్లో మూడో వికెట్‌కు 104 పరుగులు జోడించారు. కాగా, తొలి వన్డేలో 59 పరుగులు చేసిన అయ్యర్, రెండో మ్యాచ్?లో 44 రన్స్?తో రాణించాడు. 2023 వన్డే వరల్డ్?కప్ నుంచి నాలుగో స్థానంలో 53.40 యావరేజ్‌తో పరుగులు చేస్తున్నాడు. ఇప్పటివరకు నాలుగో స్థానంలో అయ్యర్? 18 ఇన్నింగ్స్‌లలో 114.59 స్ట్రైక్ రేట్‌తో 801 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 6 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇక ఇంగ్లాండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ 4 వికెట్లు పడగొట్టగా, మార్క్ వుడ్ 2 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. గస్ అట్కిన్సన్, సాకిబ్ మహమూద్, జో రూట్ తలా ఒక వికెట్ పడగొట్టారు. మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలో ఉంది. ఇంగ్లాండ్ విజయానికి 357 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో టీం ఇండియా రెండు వికెట్లు కోల్పోయింది. ఇందులో అర్ష్‌దీప్ సింగ్ రనౌట్ కాగా, వాషింగ్టన్ సుందర్ మార్క్ వుడ్ బౌలింగ్‌లో హ్యారీ బ్రూక్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. భారత జట్టులో 3 మార్పులు జరిగాయి. రవీంద్ర జడేజా, మహ్మద్ షమీలకు విశ్రాంతి ఇచ్చారు. వరుణ్ చక్రవర్తి గాయపడ్డాడు. కుల్దీప్ యాదవ్ ప్లేయింగ్ ఎలెవన్ లోకి తిరిగి వచ్చాడు. అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్‌లకు అవకాశం లభించింది. ఇంగ్లీష్ జట్టు ఒక మార్పు చేసింది. జేమీ ఓవర్టన్ స్థానంలో టామ్ బాంటన్ కు అవకాశం ఇచ్చారు. 2011 నుండి ఇంగ్లాండ్‌తో జరిగిన 3 లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌ల సిరీస్‌లో భారతదేశం అన్ని మ్యాచ్‌లను గెలుచుకుంది. చివరిసారిగా 2011-12లో ఇండియా సొంత మైదానంలో జరిగిన 5 మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లాండ్‌ను 5-0 తేడాతో ఓడించింది. 1984 తర్వాత సొంతగడ్డపై ఇంగ్లాండ్‌తో జరిగిన ఒక్క వన్డే సిరీస్‌ను కూడా టీమ్ ఇండియా కోల్పోలేదు.



## ఆసీస్ జట్టును వేధిస్తున్న గాయాలు.

**కొత్త ఆటగాళ్లతో బరిలోకి దిగే అవకాశం**
**కెప్టెన్ స్టీవెన్ స్మిత్ ను నియమించే చాన్స్**

మూడోసారి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ గెలుచుకుని హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తున్న ఆస్ట్రేలియాకు అన్ని అపశకునాలే ఎదురవుతున్నాయి. ఇప్పటికే రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్, జోష్ హేజిల్ వుడ్ గాయాల కారణంగా మెగాటోర్నీకి దూరమవ్వగా, తాజాగా వ్యక్తిగత కారణాలతో స్టార్ పేసర్ మిషెల్ స్టార్క్ ఈ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. అలాగే స్టార్ ఆల్ రౌండర్ మార్కస్ స్టొయినిస్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డాన చందాన మరో స్టార్ ఆల్ రౌండర్ మిషెల్ మార్ష్ కూడా గాయంతో టోర్నీకి దూరమయ్యాడు. దీంతో దాదాపు కొత్త ముఖాలతోనే ఈ మెగాటోర్నీలో ఆసీస్ ఆడనుంది. 2009లో రికీ పాంటింగ్ నాయకత్వంలో చివరిసారిగా ఈ టోర్నీ నెగ్గిన కంగారూలు.. ఆ తర్వాత కనీసం ఫైనల్ కు కూడా చేరుకోలేకపోయారు. ఈసారి ఎలాగైనా టోర్నీని దక్కించుకుందామని భావించినా, ఆటగాళ్ల గాయాలు టీమ్ ను సతమతం చేస్తున్నాయి. ఇక కమిన్స్ దూరం కావడంతో జట్టు కెప్టెన్ అనుభజ్ఞుడైన స్టీవెన్ స్మిత్ ను ప్రకటించారు. మెగాటోర్నీకి స్టార్క్ దూరం కావడం చాలా బాధకరమని, అయితే అతని వ్యక్తిగత ప్రైవసీని గౌరవించి, కారణాలు బయటకు చెప్పడం లేదని ఆసీస్ చీఫ్ సెలెక్టర్ జార్జ్ బెయిలీ వ్యాఖ్యానించాడు. ఇక జట్టులో కొత్త ఆటగాళ్లు చాలా మంది ఉన్నారని వారిని సీనియర్లు నడిపిస్తారని, సత్తా చాటుకోవడానికి ఇది మంచి తరుణమని తెలిపాడు. టోర్నీలో వివిధ ప్రత్యర్థులకు తగినట్లుగా జట్టు కూర్పు చేసేంత ఆటగాళ్లు తమ వద్ద ఉన్నారని పేర్కొన్నాడు. బుధవారం నుంచి శ్రీలంకతో ప్రారంభమయ్యే రెండు వన్డేల సిరీస్ కు కూడా స్టార్క్ దూరమయ్యాడని తెలిపాడు. గతేడాది భారత్ తో 5 టెస్టుల సిరీస్ నుంచి మొదలుకుని, ఇటీవల లంకతో జరిగి రెండు టెస్టుల సిరీస్ వరకు స్టార్క్ నిరంతరాయంగా ఆడాడని గుర్తు చేశాడు. ముగ్గురు ప్రధాన పేసర్లు దూరం కావడంతో సీన్ అబాట్ తో కలిసి స్పెన్సర్ జాన్సన్, నాథన్ ఎల్లిస్, బెన్ డ్వార్షియస్ లు పేస్ బాధ్యతలు మోస్తారు. సీమ్ ఆల్ రౌండర్ గా ఆరోన్ హార్డీ ని జట్టులోకి తీసుకున్నారు. ఈనెల 19 నుంచి పాక్ లో ప్రారంభమయ్యే ఈ మెగాటోర్నీలో గ్రూప్-బిలో ఆసీస్ ఆడనుంది. ఇందులో సౌతాఫ్రికా, ఇంగ్లాండ్, ఆఫ్ఘానిస్థాన్ జట్లు ఆడుతున్నాయి. ఆస్ట్రేలియా స్క్వాడ్: స్టీవెన్ స్మిత్ (కెప్టెన్), సీన్ అబాట్, అలెక్స్ కేరీ, బెన్ డ్వార్షియస్, నాథన్ ఎల్లిస్, జేక్ ఫ్రేసర్ మెక్ గర్క్, ఆరోన్ హార్డి, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లీష్, స్పెన్సర్ జాన్సన్, మార్నస్ లబుషేన్, గ్లెన్ మ్యాక్స్ వెల్, తన్వీర్ సంఘా, మథ్యూ షార్ట్, ఆడమ్ జంపా.

## భారత్ గెలవాలంటే రోహిత్ రాణించాలి

ఫామ్‌లో ఉంటేనే కెప్టెన్‌గా సరైన నిర్ణయాలు
దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ అభిప్రాయం

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమిండియా విజేతగా నిలవాలంటే కెప్టెన్ రోహిత్ శర్మ రాణించడం కీలకమని దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ ఫామ్‌లో ఉంటేనే కెప్టెన్‌గా ఎలాంటి ఒత్తిడి లేకుండా సరైన నిర్ణయాలు తీసుకుంటాడని చెప్పాడు. ఫిబ్రవరి 19 నుంచి ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి తెరలేవనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో భారత్ తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. ఈ మెగా టోర్నీకి ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు విరాట్ కోహ్లీ ఫామ్‌లోకి వచ్చారు. ఇంగ్లండ్‌తో రెండో వన్డేలో రోహిత్ శర్మ విధ్వంసకర శతకం సాధించగా.. మూడో వన్డేలో విరాట్ కోహ్లీ హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. రోహిత్ శర్మ ఫామ్‌లోకి రావడంపై సంతోషం వ్యక్తం చేసిన సునీల్ గవాస్కర్.. అతను అత్యంత అరుదైన బ్యాటర్ అని ఓ జాతీయ దినపత్రికకు రాసిన కాలమ్‌లో పేర్కొన్నాడు. వన్డే ఫార్మాట్‌లో రోహిత్ శర్మ అత్యంత విధ్వంసకర ఓపెనింగ్ బ్యాటర్. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ విజేతగా నిలవాలంటే రోహిత్ ఫామ్‌లో ఉండటం అత్యంత కీలకం. ఈ ఫార్మాట్‌లో మూడు డబుల్ సెంచరీలు బాదిన మరో బ్యాటర్ లేడు. రోహిత్ శర్మనే ఈ అత్యంత అరుదైన రికార్డ్ అందుకున్నాడు. కెప్టెన్‌గా ఒత్తిడిలోనూ సరైన నిర్ణయాలు తీసుకోవాలంటే అతను ఫామ్‌లో ఉండటం కీలకం. విరాట్ కోహ్లీ బిగ్ మ్యాచ్ ప్లేయర్. దేశం తరపున పరుగులు చేసి ఛాంపియన్స్ ట్రోఫీ అందించాలనే విషయం కంటే ఏది అతనికి ప్రేరణగా నిలవదు. 2013 ఛాంపియన్స్ ట్రోఫీ విజయానంతరం విరాట్ కోహ్లీ గంగ్నమ్ డ్యాన్స్‌తో సెలెబ్రేట్ చేసుకున్నాడు. ఈ సారి అతను భారత విజయంలో భాగమైతే.. అతని నుంచి మేం మరో ప్రత్యేకమైన సెలెబ్రేషన్‌ను చూడవచ్చు.'అని గవాస్కర్ పేర్కొన్నాడు.

## సంజు సామ్సన్ వేలికి శస్త్రచికిత్స

**ఐపీఎల్ 2025లో ఆడడంపై అనుమానం!**

భారత వికెట్ కీపర్-బ్యాటర్ సంజు సామ్సన్ తన వేలికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఐపీఎల్ 2025లో అతను పాల్గొనగలడా అన్నదానిపై పెద్ద చర్చ జరుగుతోంది. ఈ నెల ప్రారంభంలో ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదవ టీ20లో, పేసర్ జోఫ్రా ఆర్చర్ వేసిన బంతి అతని కుడి చూపుడు వేలిని బలంగా తాకడంతో గాయపడ్డాడు. ఆ గాయంతో ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత అతని స్థానంలో ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టాడు. శస్త్రచికిత్స అనంతరం సామ్సన్ పూర్తిగా కోలుకోవడానికి దాదాపు ఒక నెల సమయం పడుతుంది. అయితే, మార్చి 21-23 వారాంతంలో ప్రారంభమయ్యే ఐపీఎల్ 2025కు అతను ఫిట్‌గా ఉండే అవకాశం ఉంది. ఈ గాయంతో అతను కేరళ తరపున రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్‌కు దూరమయ్యాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో సంజు సామ్సన్ ఘోరంగా విఫలమయ్యాడు. మొత్తం ఐదు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 51 పరుగులే చేయగలిగాడు. దీంతో, భారత మాజీ క్రికెటర్లు రవిచంద్రన్ అశ్విన్, క్రిస్ శ్రీకాంత్ అతనిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అశ్విన్ మాట్లాడుతూ, "ఒక బ్యాట్స్‌మన్‌గా ఇలాగే అవుట్ అవుతూ ఉంటే, అతని మనస్సు మాయలు చేస్తుంది. బౌలర్ ఒకే విధంగా బౌలింగ్ చేస్తూ ఉంటే, నేను ఇలా అవుట్ అవుతున్నాను, నా బ్యాటింగ్‌లో ఏదైనా లోపముందా? అనే ప్రశ్నలు మనస్సులో కలుగుతాయి" అని తెలిపారు. శ్రీకాంత్ కూడా సంజు బ్యాటింగ్‌పై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, "ఒకే విధంగా ఐదుసార్లు అవుట్ అవ్వడం అర్థరహితం. అతను తన అహాన్ని నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడా? లేదా తన ఆటతీరును మార్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడా? అనే విషయంలో స్పష్టత లేదు" అని అన్నారు. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ప్రకారం, మార్చి 23న ప్రారంభం కానున్న ఐపీఎల్ 2025లో సంజు సామ్సన్ పాల్గొనడం ఖాయమనే నమ్మకముంది. ముంబైలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఐపీఎల్ తేదీలను ప్రకటించిన ఆయన, "%ఖా% మార్చి 23 నుంచి ప్రారంభం కానుంది" అని స్పష్టం చేశారు. అయితే, దీనిపై బీసీసీఐ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. సంజు సామ్సన్ గాయం నుంచి త్వరగా కోలుకుని ఐపీఎల్ 2025లో తన ఫామ్‌ను తిరిగి పొందగలడా? అనే ప్రశ్నకు సమాధానం తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.




## న్యూజిలాండ్‌కు భారీ ఎదురుదెబ్బ

**గాయం కారణంగా రచిన్ రవీంద్ర దూరం?**

**ఛాంపియన్స్ ట్రోఫీకి లాకీ ఫెర్గూసన్ దూరం**

2025 ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం దగ్గర పడుతుండగా, ఒకరి తర్వాత ఒకరు స్టార్ ఆటగాళ్లు గాయం కారణంగా ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి వైదొలుగుతున్నారు. గాయాల కారణంగా ఆస్ట్రేలియా, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా స్టార్ ఆటగాళ్ళు ఐసీసీ టోర్నమెంట్‌లో ఆడడం లేదు. అదే సమయంలో, న్యూజిలాండ్ కూడా పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. గాయం కారణంగా న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ లాకీ ఫెర్గూసన్ కూడా ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. ఇప్పుడు ఫెర్గూసన్ స్థానంలో కివీ జట్టులో ఎవరికి అవకాశం లభిస్తుందో చూడాలి. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం కివీస్ జట్టు ఎంపిక చేసిన 15 మంది సభ్యుల జట్టులో లాకీ ఫెర్గూసన్ ఉన్నాడు. అయితే, అతను తొడ కండరాల గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు. దుబాయ్‌లో జరిగిన 2025 లీగ్ సందర్భంగా లాకీ గాయపడ్డాడు. అతను షార్జా వారియర్స్ తరపున ఎలిమినేటర్ మ్యాచ్‌లో కూడా పాల్గొనలేదు. అయితే పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో అతను ఆడలేకపోయాడు. ఈ సిరీస్ కోసం అతను కివీస్ జట్టులో కూడా చేరాడు. లాకీ ఫెర్గూసన్ న్యూజిలాండ్ ఉత్తమ ఆటగాళ్ళలో లెక్కించబడ్డాడు. లాకీ వన్డే కెరీర్ అద్భుతంగా ఉంది. అతను 2016 లో న్యూజిలాండ్ తరపున వన్డే అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు, ఫెర్గస్ 65 వన్డే మ్యాచ్‌లు ఆడి 64 ఇన్నింగ్స్‌లలో 99 వికెట్లు పడగొట్టాడు. అతను ఒక ఇన్నింగ్స్‌లో ఒకసారి ఐదు వికెట్లు, రెండుసార్లు నాలుగు వికెట్లు పడగొట్టాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో లాకీ ఎకానమీ 5.68గా ఉంది. న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా మధ్య నాలుగు మ్యాచ్‌ల ముక్కోణపు వన్డే సిరీస్ పాకిస్తాన్‌లో జరుగుతోంది. అంతకుముందు (ఫిబ్రవరి 8న పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో), న్యూజిలాండ్ ఆల్ రౌండర్ రచిన్ రవీంద్ర ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు పెద్ద ప్రమాదానికి గురయ్యాడు. బంతిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తుండగా అతని ముఖంపై దెబ్బ తగిలింది. మైదానంలోనే అతని ముఖం నుంచి రక్తం కారడం ప్రారంభమైంది. అతను మైదానం నుంచి వెళ్లిపోయాడు. అతని నుదిటిపై కుట్లు పడ్డాయి. ఆ తర్వాత అతను తదుపరి మ్యాచ్ కూడా ఆడలేదు. ఛాంపియన్స్ ట్రోఫీలో రచిన్ ఆడటంపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది.




## ఆస్ట్రేలియాపై శ్రీలంక ఘన విజయం!

**సమష్టిగా రాణించిన శ్రీలంక**
**49 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చిత్తు**

ఆస్ట్రేలియాతో రెండు టెస్టుల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయిన శ్రీలంక.. వన్డే సిరీస్‌లో మాత్రం శుభారంభం చేసింది. రెండు వన్డేల సిరీస్‌లో భాగంగా కొలంబో వేదికగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన శ్రీలంక 49 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 46 ఓవర్లలో 214 పరుగులకు కుప్పకూలింది. చరిత్ అసంలక(126 బంతుల్లో 14 ఫోర్లు, 5 సిక్స్‌లతో 127) సెంచరీతో చెలరేగగా..దునిత్ వెల్లాలేగే(30) రాణించాడు. ఆసీస్ బౌలర్లలో సీన్ అబాట్ మూడు వికెట్లు తీయగా.. స్పెన్సర్ జాన్సన్, ఆరోన్ హార్డీ, నాథన్ ఎల్లిస్ రెండేసి వికెట్లు పడగొట్టారు. మాథ్యూ షార్ట్ ఓ వికెట్ తీసాడు. అనంతరం ఆస్ట్రేలియా 33.5 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. మార్నస్ లబుషేన్(41), ఆరోన్ హార్డీ(32) టాప్ స్కోరర్లుగా నిలిచారు. శ్రీలంక బౌలర్లలో మహీష్ తీక్షణ(4/40) నాలుగు వికెట్లు తీయగా.. అసిత ఫెర్నాండో రెండు వికెట్లు, వానిందు హసరంగా, చరిత్ అసలంక తలో వికెట్ తీసారు.


# విశ్వజి



## ప్రతిరోజు చల్లటి నీటితో స్నానం చేస్తే ఏమవుతుంది? మంచిదేనా!!

చాలామంది వర్షాకాలం, శీతాకాలంలో వేడి నీళ్లతో స్నానం చేస్తారు. ఇక ఎండాకాలం వచ్చిందంటే ఉష్ణ తాపాన్ని తట్టుకోలేక చన్నీళ్ళతో స్నానం చేస్తూ ఉంటారు. ఎండాకాలంలో ప్రతిరోజు చన్నీళ్ళతో స్నానం చేస్తే ఏమవుతుంది? స్నానం చేయడం మంచిదేనా? చన్నీళ్ళ స్నానం వలన జుట్టు ఊడిపోతుందా? ఏమైనా అనారోగ్యాలు వస్తాయా? వంటి వివరాలను ప్రస్తుతం మనం తెలుసుకుందాం. చన్నీటి స్నానం వలన ఏం జరుగుతుందంటే వేసవికాలంలో చన్నీళ్ళతో స్నానం చేయడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, ప్రతిరోజు చన్నీళ్ల స్నానం చేయడం ఎంతో మంచిదని చెబుతున్నారు వైద్యనిపుణులు. చల్లటి నీటిలో స్నానం చేయడం వల్ల శరీరంలో ఉండే వాపులు, కండరాల నొప్పులు తగ్గుతాయని, రక్త ప్రసరణ మెరుగు పడుతుందని చెబుతున్నారు. అంతేకాదు మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుందని, ఫలితంగా ఆరోగ్యంగా ఉంటామని చెబుతున్నారు వైద్యనిపుణులు. చన్నీటి స్నానంతో డిప్రెషన్ నుండి రిలాక్స్ చన్నీళ్ల స్నానం చేస్తే ఏదో జరిగిపోతుందన్న అపోహ వద్దని, చన్నీళ్ల స్నానం చేయడం వల్ల నాడీ వ్యవస్థ ప్రేరేపితం అవుతుందని చెబుతున్నారు. ఇది శరీరానికి కావలసిన శక్తిని ఇస్తుందని సూచిస్తున్నారు. వేసవిలో చన్నీళ్ళ స్నానం ఒత్తిడి కలిగించే హార్మోన్ల ఉత్పత్తిని తగ్గిస్తుందని సూచిస్తున్నారు. ఐదు నిమిషాల పాటు చన్నీటి స్నానం చేయడం వల్ల డిప్రెషన్ నుంచి ఉపశమనం లభిస్తుంది . ఇది ఫీల్ గుడ్ ఎండార్ఫిన్ హార్మోన్ ఉత్పత్తిని పెంచుతుంది. వ్యాధి నిరోధక శక్తి కోసం చన్నీటి స్నానం చన్నీటి స్నానం చేయడం వల్ల మన హృదయ స్పందన రేటు కరెక్ట్ గా మారుతుందని, రక్తపోటు తగ్గుతుందని, ఆక్సిజన్ సక్రమంగా తీసుకోగలమని చెబుతున్నారు. మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, వేసవిలో రోజు చన్నీళ్ళతో స్నానం చేస్తే ఎంతో మంచిదని సూచిస్తున్నారు. చర్మం, జుట్టుకు చన్నీటి స్నానం మేలు చల్లని నీళ్లతో స్నానం చేయడం వల్ల శరీరంలోని ల్యూకోసైట్లు ప్రేరేపితం అవుతాయి. ఇవి మనల్ని సాధారణ అనారోగ్యాల నుండి కాపాడతాయి. చన్నీటి స్నానం చేయడం వల్ల చర్మ రంధ్రాలను బిగుతుగా చేసి ఆయిల్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. చర్మాన్ని, జుట్టు పొడిబారకుండా కాపాడుతుంది.

# నాసా ఏరో స్పేస్ ఇంజనీర్‌గా తొలి భారతీయ యువతి!







అమెరికాలోని నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్)లో ఉద్యోగం... ఈ కల చాలా మందికే ఉండి ఉంటుంది. ఈ కలను సాకారం చేసుకున్న తొలి భారతీయ యువతి అక్షత కృష్ణమూర్తి. నాసా అనగానే మనకు అంతరిక్షంలోకి వెళ్లి గ్రహాలను అధ్యయనం చేసిన రాకేశ్ శర్మ గుర్తు వస్తారు. అలాగే కల్పనా చావ్లా, సునీత విలియమ్స్ కూడా గుర్తుకు వస్తారు. కల్పనా చావ్లా, సునీత విలియమ్స్ ఇద్దరూ భారతీయ సంతతికి చెందిన వారే కానీ భారత పౌరసత్వం ఉన్న వాళ్లు కాదు. అమెరికా పౌరసత్వమే వారి అంతరిక్ష పథాన్ని సుగమం చేసింది. ఇక అక్షత విషయానికి వస్తే... ఆకాశానికి ఆవల బెంగళూరుకు చెందిన అక్షతా కృష్ణమూర్తికి చిన్నప్పటి నుంచి ఆకాశానికి ఆవల ఏముంటుంది అనే ఆలోచనే. ఆమె బాల్యం ఆకాశంలో నక్షత్రాలను చూడడంతో, చుక్కల్లో చందమామ వెలుగుతో సంతృప్తి చెందలేదు. అంతరిక్షం అంటే మనకు కనిపించేది మాత్రమే కాదు, ఇంకా ఏదో ఉంది, అదేంటో తెలుసుకోవాలనే ఆసక్తి ఉండేది. బాల్యంలో మొదలైన ఆసక్తిని పెద్దయ్యేవరకు కొనసాగించింది. తన పయనాన్ని అంతరిక్షం వైపుగా సాగాలని కోరుకుంది. అందుకోసం తీవ్రంగా శ్రమించింది, నేడు నాసాలో ఏరో స్పేస్ ఇంజనీర్‌గా ఉద్యోగం సంపాదించింది. ఆ వివరాలను తెలియచేస్తూ "ఇది కేవలం అదృష్టం అని కానీ, కాకతాళీయంగా జరిగిపోయిందని చెప్పను. పూర్తిగా పదిహేనేళ్ల కఠోర శ్రమతోనే, అంతకు మించిన ఓర్పుతోనే సాధ్యమైంది" అంటుంది అక్షత. అలాగే అంతరిక్షంలో కెరీర్‌ని వెతుక్కోవాలంటే పాటించాల్సిన కొన్ని సూత్రాలను కూడా పంచుకుంది. నక్షత్రశాల నుంచి అంతరిక్షం వరకు... "నాసాలోని జెట్ ప్రోపల్షన్ లాబొరేటరీలో స్పేస్ మిషన్‌లకు 'ప్రిన్సిపల్ నావిగేటర్ అండ్ స్పేస్ సిస్టమ్స్ ఇంజనీర్'గా విధులు నిర్వర్తిస్తున్నాను. నాసా ఇస్రో సంయుక్తంగా నిర్వహించిన సింథటిక్ ఆపెర్చర్ రాడార్ మిషన్‌లో ఫేజ్ లీడ్‌గానూ, మార్స్ 2020 మిషన్‌లో రోబోటిక్స్ సిస్టమ్స్ ఇంజనీర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించాను. నేను చదివింది స్టేట్ బోర్డ్ సిలబస్‌లోనే. మాది సంపన్న కుటుంబం కూడా కాదు. అయితే చిన్నప్పుడు నా వీకెండ్ ఎంజాయ్‌మెంట్‌లో ప్లానిటేరియం విజిట్స్, బెంగుళూరులో ఎయిర్‌షోస్ ఎక్కువగా ఉండేవి. నా ఆసక్తిని గమనించిన మా అమ్మానాన్న నేనడిగిన ప్రతిసారీ తీసుకెళ్లేవారు. హబుల్ టెలిస్కోప్ గురించి తెలుసుకోవడం నా జీవితంలో గొప్ప మలుపు. బహుశా 2000 సంవత్సరంలో అనుకుంటాను. నాకప్పుడు పదేళ్లు. వ్యోమగాములు అంతరిక్షంలో నడవడం గురించి తెలిసి చాలా ఆనందం కలిగింది. అంతరిక్షం నుంచి భూమిని చూడాలనే కోరిక కూడా. కెరీర్ గురించిన ఆలోచనలకు స్పష్టమైన రూపం వచ్చింది కూడా అప్పుడే. అంతరిక్షంలోకి వెళ్లే మార్గాల గురించి అధ్యయనం చేయగా చేయగా వ్యోమగాముల్లో ఎక్కువమంది ఎమ్ఐటీలోనే చదివారని తెలిసింది. నేను అదే సంస్థలో చదవాలని నిర్ణయించుకున్నాను. దాంతో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో చేరాను. బెంగళూరులోని ఆర్ కాలేజ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ 2010 బ్యాచ్‌లో నేను మాత్రమే అమ్మాయిని. యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిలో ఏరోస్పేస్‌లో మాస్టర్స్ చేశాను. పీహెచ్‌డీకి ఎమ్ఐటీ (మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) నుంచి స్కాలర్‌షిప్‌తో సీటు వచ్చింది. అయితే యూఎస్‌లో అంతరిక్షంలో ఉద్యోగం రావాలంటే ఆ దేశ పౌరసత్వం ఉండాలి కనీసం గ్రీన్‌కార్డ్ అయినా ఉండాలి. సెమినార్‌లలో నేను సమర్పించిన పేపర్‌లకు ప్రశంసలు వచ్చినప్పటికీ ఉద్యోగం వచ్చేది కాదు. అయినా నా పరిశోధనలను మాత్రం ఆపలేదు. ప్రొఫెసర్‌లకు వారితో కలిసి పని చేసే అవకాశం ఇవ్వమని వినతులు పోస్ట్ చేయడం కూడా ఆపలేదు. నా అప్లికేషన్ ఎప్పుడూ వెయిల్ లిస్టులోనే ఉండేది. వీసా సమయం పూర్తి కావస్తున్న సమయంలో ఒక పేపర్ ప్రెజెంటేషన్ సారా సీగర్ అనే ఆస్ట్రో ఫిజిసిస్ట్ దృష్టిని ఆకర్షించింది. అలా ఒక ఏడాదికి ఇంటర్న్‌షిప్‌కి అవకాశం వచ్చింది. ఆ ఏడాది పూర్తవుతున్న సమయంలో మరో పీహెచ్‌డీకి అప్లయ్ చేశాను. నాసా ఇస్రో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమాల్లో కూడా పని చేశాను. మొత్తం మీద మూడవ ప్రయత్నంలో నాసాలో ఫుల్‌టైమ్ ఉద్యోగినయ్యాను. మేధ ఉంది పాదు లేదు, మనదేశంలో అంతరిక్షంలో పరిశోధన చేయగలిగిన మేధ ఉంది. మొక్క ఎదగాలంటే అందుకు అనువైన పాదు ఉండాలి. అలాంటి పాదును తల్లిదండ్రులు బాల్యంలోనే వేయాలి. అలాంటి ప్రోత్సాహం మన దగ్గర ఉండాల్సినంతగా లేదనే చెప్పాలి. అందుకే లక్ష్యాన్ని సాధించడంలో నాకు ఎదురైన సవాళ్లతోపాటు అవకాశాలను వివరిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాను. నేను సూచించేదేమిటంటే... స్కూల్‌లో సైన్స్ ప్రాజెక్టుల్లో పాల్గొనాలి. అంతరిక్షంలో కూడా ఆస్ట్రో ఫిజిక్స్, ఆస్ట్రానమీ, టెక్నాలజీ, ఇంజినీరింగ్ వంటి చాలా విభాగాలుంటాయి. మన ఆసక్తి ఎందులో అనేది తెలుసుకోవాలి. అంతరిక్షరంగంలో స్థిరపడాలంటే బాచిలర్స్ సరిపోదు. బాచిలర్స్‌లో సైన్స్, ఇంజినీరింగ్‌తోపాటు పీహెచ్‌డీ తప్పనిసరి. అలాగే ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, కోడింగ్ వంటి నైపుణ్యాలను కూడా మెరుగుపరుచుకోవాలి. అంతరిక్షానికి సంబంధించి వీలైనంత ఎక్కువ సదస్సులు, సమావేశాల్లో పాల్గొనాలి. నిపుణులను సంప్రదిస్తూ మన సందేహాలను నివృత్తి చేసుకుంటూ జ్ఞానాన్ని పెంచుకోవాలి. ఇవన్నీ అంతరిక్షయానాన్ని సుగమం చేసే మార్గాలు" అంటోంది అక్షత.

## మామిడి పండ్లను తినడం వల్ల మొటిమలు వస్తాయా? నిపుణులు ఏమంటున్నారంటే..





మామిడి పండ్లు తినడం వల్ల ముఖంపై మొటిమలు, గడ్డలు వస్తాయని చాలామంది చెబుతుంటారు. పాపం ఆ ఉద్దేశ్యంతోనే మామిపండు తినేందుకు భయపడు తుంటారు. నిజానికి మామిడి పండ్లకు మొటిమలకు సంబంధం ఉందా? వాటిని తినడం వల్ల వస్తాయా ? అంటే.. వేసవిలో అందరూ మామిడి పండ్లంటే ఇష్టంగా తింటారు. పోషకాల రీత్యా మామిడిని పండ్లలో రారాజు అని పిలుస్తారు. నిజానికి ఈ మామిడి ఆగ్నేయాసియాలో ఉద్భవించింది. కానీ ఇది ప్రపంచవ్యాప్తంగా సాగు చేసే సాధారణ పండుగా మారింది. ఈ మామిడి తినడం వల్ల శరీరానికి కావాల్సిన ఎన్నో రకాల విటమిన్లు, పోషకాలు అందుతాయి. దీనిలో బీటా కెరోటిన్ అధికంగా ఉండటం వల్ల చర్మ ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో కీలకపాత్ర పోషిస్తుందని డెర్మటాలజీ నిపుణులు చెబుతున్నారు. ఈ బీటా కెరోటిన్ అనేది యాంటీ ఆక్సిడెంట్ పిగ్మెంట్, శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది. కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతుంది. అంతేగాక దీనిలో ఉండే పోషకాలన్నీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ముఖ్యంగా మంటను తగ్గించి జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. అలాంటి మామిడి పండ్లను తింటే కొందరిలో మొటిములు ఎందుక వస్తాయంటే..? అధిక చక్కెర స్థాయి, గ్లైసెమిక్ సూచిక అని చెబుతున్నారు నిపుణులు. ఇక్కడ గ్లైసెమిక్? ఇండెక్స్ అనేది రక్తంలో చక్కెర స్థాయిలను సూచించే స్కేల్. ఇక్కడ పండ్లు, బియ్యం, ఇతర కార్బ్ రిచ్ ఉత్పత్తులు, ముఖ్యంగా వేయించిన లేదా ప్రాసెస్ చేసిన ఆహారాల్లో అత్యధిక గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటాయి. అమెరికన్ అకాడమీ ఆఫ్ డెర్మటాలజీ అసోసియేషన్ ప్రకారం..టీనేజ్ పిల్లలు తెగ ఇష్టంగా తింటారు. ఇది వారు యుక్త వయసుకు చేరుకునే సమయం..సరిగ్గా ఈ టైంలోనే వారిలో సెబమ్ ఉత్పత్తి అవుతుంటుంది. దీంతో వారిలో జిడ్డు చర్మం, మొటిమలు మొదలయ్యే దశ స్లోగా మొదలవుతుంది. సరిగ్గా ఆ సమయంలోనే ఈ మామిడి పండ్లు కూడా వాళ్లుగా ఇష్టంగా తినడంతో పెద్దవాళ్లు మొటిమలకి, మామిడి పండ్లకి లింక్ చేసి..అవి తినడం వల్లనే వస్తున్నాయని అనేస్తారు. మొటిమలను నిరోధించే క్రీమ్‌లను ఉపయోగిస్తే..ఈ సమస్య నుంచి సులభంగా బయటపడగలుగుతారు. పైగా చర్మం కూడా ప్రకాశవంతంగా అందంగా మారుతుందని చెబుతున్నారు నిపుణులు.

## ఇన్‌స్టంట్ నూడుల్స్ మంచివి కావా? తింటే ఫుడ్ పాయిజనింగ్ అవుతుందా?

ఇటీవలకాలంలో ఇన్‌స్టంట్ ఫుడ్ ఐటెమ్స్‌కి ప్రివరెన్స్ ఇస్తున్నారు చాలామంది. ఈ ఉరుకులు పరుగులు జీవితంతో ఏదో స్పీడ్‌గా తయారయ్యే ఇన్‌స్టంట్ రెసిపీలు వండుకుని తినేసి హమ్మయ్యా..! అనుకుంటున్నారు. ఇది ఆరోగ్యానికి మంచిదా? కాదా? అన్నది ముఖ్యం కాదు. కేవలం ఆకలి తీరిపోతే చాలు అన్నట్లుగా రెడీమేడ్ ఫుడ్‌పై ఆధారపడుతున్నారు జనాలు. ముఖ్యంగా ఇన్‌స్టంట్ నూడుల్స్ లాంటివి అయితే ప్రజలు ఎగబడి మరీ తింటున్నారు. కానీ ఇలాంటి నూడుల్స్ మరింత ప్రమాదమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు ఫుడ్ పాయిజనింగ్‌కి దారితీస్తుందా.. మాములు న్యూడిల్స్‌లా కాకుండా దీనిలో ఆయిల్‌తో సహా అన్ని ఇన్‌గ్రేడియంట్స్ మిక్స్ చేసి ఉంటాయి. జస్ట్ దాన్ని తీసి గిన్నెలో వేసుకుని వేడి చేసుకుంటే చాలు న్యూడిల్స్ రెడీ అంతే..అయితే దీనిలో అన్ని ఇన్‌గ్రేడియంట్స్ ఉండటంతో తటస్థ పీహెచ్ స్థాయిలు ఎక్కుకవగా ఉంటాయి. అందువల్ల దీనిలో ఈజీగా బ్యాక్టీరియా వృద్ధి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఫుడ్ పాయిజినింగ్ దారితీసే స్థాయికి చేరుకుంటుంది.



# మార్కెట్

## కృత్రిమ మేధస్సుకు భారతీయులు సై..

**ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్న దేశ జనాభాలో సగం కంటే ఎక్కువ మంది**

**ఈ టెక్నాలజీని వినియోగిస్తున్న 65 శాతం మంది**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 : టెక్నాలజీ రంగంలో రోజుకొక వినూత్న మార్పులు జరుగుతుంటాయి. ఇటీవలకాలంలో అత్యంత ప్రజాదరణ పొందిన కృత్రిమ మేధస్సు(ఏఐ) టెక్నాలజీ వాడకంలో భారతీయులు ముందువరుసలో నిలిచారు. దేశ జనాభాలో సగం కంటే అత్యధిక మంది ఈ టెక్నాలజీని వినియోగిస్తున్నారని మైక్రోసాఫ్ట్ విడుదల చేసిన సర్వేలో వెల్లడైంది. అంతర్జాతీయ దేశాల్లో వినియోగిస్తున్నవారికంటే ఇది రెండింతలు అధికంగా 65 శాతం మంది ఇండియన్స్ ఈ టెక్నాలజీని వినియోగిస్తున్నారని మంగళవారం మైక్రోసాఫ్ట్ విడుదల చేసిన గ్లోబల్ ఆన్‌లైన్ సేఫ్టీ సర్వేలో ఈ విష యం వెల్లడైంది. జూలై 19 నుంచి ఆగస్టు 9, 2024 మధ్యకాలంలో భారత్‌తోపాటు ఇతర దేశాల్లో ఈ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో 15 వేల మంది యువతియువకు లు, పెద్దలు పాల్గొన్నారు. వీరిలో 65 శాతం మంది ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నామ ని, 2023 కంటే ఇది 26 శాతం అధికమని పేర్కొంది. అంతర్జాతీయ దేశాల్లో సరాసరిగా 31 శాతం మంది ఈ టెక్నాలజీని వాడుతున్నారు. ముఖ్యంగా దేశీయంగా ఈ టెక్నాలజీని అనువాదాలకు, ప్రశ్నల జవాబులకోసం, మెరుగైన పనితీరు కనబర్చడానికి, స్కూల్‌వర్క్‌లో విద్యార్థులకు సహాయం అందించడానికి వినియోగిస్తున్నారు. ఏఐ టెక్నాలజీ వాడకంలో మిలియనీర్లు(25 నుం చి 44 ఏండ్లలోపువారు) 84 శాతం మంది ఉన్నారని పేర్కొంది. డిజిటల్ చాలెంజ్‌పై తల్లిదండ్రులకంటే తమ పిల్లలకు అవగాహణ అధికంగా ఉన్నదని, గడిచిన కొన్నేండ్లుగా ఇది మరింత పెరుగుతున్నదని తెలిపింది. అయినప్పటికీ అంతర్జాతీయ ట్రెండ్‌లను ప్రతిబింబించేలా ఆన్‌లైన్ దుర్వినియోగం, డీప్ ఫేక్‌లు, స్కామ్‌లపై ఈ నివేదిక ఆందోళన వ్యక్తంచేసింది. 18 ఏండ్ల కంటే తక్కువ వయస్సు కలిగిన యువకులు ఏఐ టెక్నాలజీని విపరీతంగా వాడేస్తున్నారని తెలిపింది.

# ట్రంప్ సుంకాల దెబ్బతో విదేశీ ఇన్వెస్టర్లు ఔట్..



### దెబ్బతిన్న సెంటిమెంట్.. నష్టాలతో ఈక్విటీ మార్కెట్‌లు..!

%హ్‌శీ‌ఎం% ఎ దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం వరుసగా ఆరో సెషన్‌లో నష్టాలతో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల యుద్ధం.. అమెరికా డాలర్ ప్లస్ యూఎస్ బాండ్లు బలోపేతం కావడంతో దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు వాటాలు ఉపసంహరిస్తుండటంతో దేశీయ మదుపర్లలో సెంటిమెంట్ బలహీన పడింది. ఫలితంగా బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ ఇంట్రాడే ట్రేడింగ్‌లో 905.21 పాయింట్ల పతనంతో 76 వేల పాయింట్ల దిగువన 75,388.39 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి ఫైనాన్సియల్ స్టాక్స్ రికవరీతో 122.52 పాయింట్ల నష్టంతో 76,171.08 పాయింట్లతో సరి పెట్టుకున్నది. మరోవైపు ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 26.55 పాయింట్లు (0.12 శాతం) కోల్పోయి 23,045.25 పాయింట్ల వద్ద స్థిర పడింది. అంతర్గత ట్రేడింగ్‌లో 273.45 పాయింట్లు (1.18 శాతం) నష్టంతో 22,798.35 పాయింట్లకు చేరుకుని కీలక 23,000 మార్క్ దిగువకు చేరుకుంది. ఈ నెల నాలుగో తేదీ నుంచి బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 2,412.73 పాయింట్లు (3.07 శాతం), ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 694 పాయింట్లు (2.92 శాతం) నష్టపోయాయి. బీఎస్ఈ-30 సెన్సెక్స్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ, పవర్‌గ్రిడ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, టైటాన్, ఇన్ఫోసిస్ భారీగా నష్టపోయాయి. మరోవైపు బజాజ్ ఫిన్ సర్వ్, టాటా స్టీల్, లార్సెన్ అండ్ టర్బో, అల్ట్రా టెక్ సిమెంట్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టాటా మోటార్స్ తదితర షేర్లు లాభ పడ్డాయి. మంగళవారం నాటికి దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 4,486.41 కోట్ల విలువైన వాటాలను ఉపసంహరించారు. జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ స్పందిస్తూ 'దేశీయ మార్కెట్‌లో ఇంట్రాడే భారీ నష్టాల నుంచి ట్రేడింగ్ ముగింపుకల్లా స్వల్ప రికవరీ నమోదైంది. బ్రాడర్ మార్కెట్ పుంజుకున్నాఇన్వెస్టర్ల సెంటిమెంట్ ఓవరాల్‌గా బలహీనంగా ఉంది. మూడో త్రైమాసికం ఆర్థిక ఫలితాలు అంతంత మాత్రంగానే ఉంటాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు సంఘటితమయ్యే దిశగా ప్రయాణిస్తాయని భావిస్తున్నారు' అని చెప్పారు. అమెరికా ద్రవ్యోల్బణం గణాంకాలు భవిష్యత్ మార్కెట్ల గమనాన్ని నిర్దేశిస్తాయన్నారు. ఏషియన్ మార్కెట్లలో సియోల్, టోక్యో, షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు పాజిటివ్‌గా ముగుస్తాయి. యూరోపియన్ యూనియన్ మార్కెట్‌లు లాభాలతో ముగుస్తాయి. మంగళవారం అమెరికా మార్కెట్లు అత్యధికంగా లాభాలతో స్థిర పడ్డాయి. గ్లోబల్ ఆయిల్ బెంచ్ మార్క్ బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్‌పై 0.78 శాతం పతనమై 76.40 డాలర్లకు చేరుకుంది.

## గ్వాషా..బ్యూటీ తమాషా!

అందంగా కనిపించాలంటే చర్మ ఆరోగ్యంతోపాటు, ముఖాకృతీ ముఖ్యమే. అయితే వయసు పెరిగేకొద్దీ రకరకాల కారణాల వల్ల అది మార్పులకు లోనవుతుంటుంది. గీతలు, ముడతలు పడుతుంటాయి. వాటి నుంచి ఉపశమనం పొందడంతోపాటు, చక్కని ముఖాకృతి కోసం అంటూ ఇటీవల బ్యూటీ బజార్లో ఓ కొత్త సౌందర్య సాధనం హల్‌చల్ చేస్తున్నది. అదే 'గ్వాషా స్టోన్'. హృదయాకారంలో ఉండే ఉపరత్నాల జాతికి చెందిన రాయి ఇది. జేడ్, క్వార్ట్, అమెథిస్ట్ లాంటి రాళ్లు వీటిలో ఉంటాయి. ఈ తరహా రాళ్లకు కొన్ని రుగ్మతల నుంచి స్వస్థపరిచే గుణం ఉంటుందని నమ్ముతారు. చైనా సంప్రదాయ వైద్య విధానంలో ఈ రాయి భాగంగా ఉండేది. బిగుసుకుపోయిన కండరాలను రిలాక్స్ చేసేందుకు, నొప్పుల్ని తగ్గించేందుకు దీన్ని వాడేవారు. ఆ కాలం నుంచే ఇది సౌందర్య సాధనంగానూ ఉంది. హృదయాకారంలో ఉండే ఈ రాయిని ముఖం, మెడ ప్రాంతాలను మసాజ్ చేసేందుకు వాడుతున్నారు. ముక్కు, చెంపలు, దవడ, నుదురులాంటి చోట్ల ప్రత్యేక పద్ధతుల్లో దీనితో మర్దనా చేస్తారు. వివిధ కోణాల్లో ఉపయోగించేలా దీని ఆకృతి ఉంటుంది. ఇలా మర్దనా చేయడం వల్ల రక్త ప్రసరణ బాగా జరిగి చర్మం అందంగా, ఆరోగ్యంగా కనిపిస్తుంది. ముడతలు తగ్గి చర్మం కాంతిమంతంగా, బిగుతుగా తయారవుతుందట. కళ్లకింద వలయాలు, ఉబ్బినట్టు కనిపించడంలాంటి వాటి మీదా ప్రభావం చూపుతుంది. మొత్తంగా సరికొత్త యాంటీ ఏజెనింగ్ టూల్‌గా గ్వాషా మారిందన్న మాట. దీన్ని ఎలా వాడాలన్న దానిమీదా యూట్యూబ్‌లో వీడియోలు చాలానే ఉన్నాయి. వాటినే ఇప్పుడు అమ్మాయిలు తెగ వెతికేస్తున్నారట.

# సనాతనధర్మ పరిరక్షణ యాత్రలో పవన్ కళ్యాణ్

## కేరళలో అగస్త్యమహర్షి ఆలయ సందర్శన

కొచ్చి : తిరుమల లడ్డూ వివాదంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు.. తిరుమల లడ్డూ వివాదం దురదృష్టకరం అని అన్నారు. ప్రస్తుతం సనాతన ధర్మ యాత్రలో ఉన్న పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ ఈమేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆలయాల నుంచి ఎవరూ డబ్బులు ఆశించకూడదని.. కానీ అలా జరగకపోవడం బాధాకరమని అన్నారు. ఘటనకు బాద్యులైన నిందితులు అరెస్టయ్యారని అన్నారు. తిరుమల కల్తీ నెయ్యి కేసులో ఇటీవల సీబీఐ నలుగురిని అరెస్ట్ చేసిన క్రమంలో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సనాతన ధర్మ యాత్రలో భాగంగా బుధవారం కేరళ, తమిళనాడులోని వివిధ పవిత్ర స్థలాలకు పవన్ కళ్యాణ్ తీర్థయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా తమిళనాడులోని పవిత్ర స్థలాలకు ఆధ్యాత్మిక యాత్రకు బయలుదేరారు. కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన తన ప్రయాణంలో శ్రీ అగస్త్య మహర్షి ఆలయాన్ని దర్శించుకొని.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత పవన్ కళ్యాణ్ కేరళ పర్యటనకు వెళ్లారు.



సనాతనధర్మ పరిరక్షణలో భాగంగా కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు ఆలయాలను పవన్ సందర్శించనున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఆయన కేరళలోని కొచ్చి సమీపంలో ఉన్న అగస్త్య మహర్షి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పవన్ కళ్యాణ్ వెంట ఆయన కుమారుడు అకీరానందన్, తితిదే బోర్డు సభ్యుడు ఆనంద్‌సాయి ఉన్నారు. బుధవారం సాయంత్రం తిరువనంతపురంలోని పరశురామ స్వామి ఆలయాన్ని పవన్ సందర్శించనున్నారు. మూడు రోజుల పర్యటనలో అనంత పద్మనాభస్వామి, మధుర మీనాక్షి, అగస్త్య జీవసమాధి, కుంభేశ్వర, స్వామిమలైయ్, తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు పవన్ వెళ్లనున్నారు. మూడు రోజుల పాటు కేరళ, తమిళనాడులోని పలు పుణ్య క్షేత్రాలను పవన్ కళ్యాణ్ దర్శించుకోనున్నారు. పవన్ కళ్యాణ్ నడుము నొప్పి బాధపడుతుండడంతో రాష్ట్రం సచివాలయంలో మంత్రులు, ముఖ్య కార్యదర్శులతో సిఎం చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమావేశానికి ఆయన రాలేదు. మంత్రి నాదెండ్ల మనోహర్ కలుగ జేసుకొని పవన్ రెండు వారాలుగా తీవ్రమైన నడుము నొప్పితో బాధపడుతున్నారని, అందుకే సమావేశానికి రాలేదని చెప్పారు. రెండు మూడు రోజుల్లో విధులకు హాజరవుతారని వివరణ ఇచ్చారు. వెంటనే చంద్రబాబు స్పందించారు. పవన్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించానని, కానీ దొరకలేదని, ఇప్పుడెలా ఉన్నారని బాబు అడిగారు. కాస్త పర్వాలేదని మనోహర్ జవాబిచ్చారు.

# జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా ప్రజలు ఇవ్వలేదు

### బుద్ధితెచ్చుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరించాలి : మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి : జగన్ కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమేనని, ప్రజలు కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వటానికి ఇష్టపడలేదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి మంత్రి కొల్లు రవీంద్ర వినితులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర, పల్లా శ్రీనివాస్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. వైఎస్ జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని జగన్ అనడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఏపీలో బటన్ నొక్కే సీఎం పోయి అభివృద్ధి కాంక్షించే నాయకుడు ముఖ్యమంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో బర్డ్ ఫ్లూపై ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతున్నామని తెలిపారు. బర్డ్ ఫ్లూపై సీఎం చంద్రబాబు నిరంతరం అధికారులతో మాట్లాడుతున్నారని తెలిపారు. వైసీపీ చేసే దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని.. అలా చేస్తే వదలబోమని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# కాల్‌మనీ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి

### ప్రధాన నిందితుడు మహబూబ్ సుభానీ కోట్లలో వసూలు

అమరావతి : కాల్‌మనీ కేసులో సంచనలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా నెల్లూరు జిల్లాలోని కావలిలో మనీస్కాం వెలుగు చూసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు మహబూబ్ సుభానీ ఆగడాలు మీతిమిరిపోయాయి ఇప్పుడు ఈ కేసు ఏపీలో సంచలనంగా మారింది. కావలిలో మనీస్కాం ప్రధాన నిందితుడు మహబూబ్ సుభానీ రూ.వందల కోట్ల కుంభకోణాలను వెలుగులోకి వచ్చింది. ఏపీ, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో మనీ స్కాంలు. మక్తల్, రాయచూర్, నరసరావుపేట, కాకినాడలో ఆర్థిక నేరాలువెలులుగోకి వచ్చాయి. కొన్నేళ్లుగా పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతూ కావలిలో మహబూబ్ సుభానీ మకాం వేసినట్లు పోలీసులు తెలిపారు. మక్తల్‌లో రూ.200కోట్లు స్వాహా చేసినట్లు మహబూబ్ సుభానీపై ఆరోపణలు వచ్చాయి. మక్తల్ ప్రాంత పీఎస్‌లలో మహబూబ్ సుభానీపై నాలుగు కేసులు నమోదయ్యాయి. ఏబీఎన్ కథనాలు చూసి కావలికి మక్తల్ బాధితులు చేరుకుంటున్నారు. కావలి ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డిని ఫోనులో తెలంగాణ రాష్ట్రంలోని నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీహరి అభినందించారు. ప్రజలు మోసపోతున్న వైనాన్ని పసిగట్టి పోలీసులని అలెర్ట్ చేయడంపై కావ్యా కృష్ణారెడ్డిపై ప్రశంశలు కురిపించారు. కాగా.. కావలిలో భారీ మనీ స్కాం బయటపడింది. ప్రజల నుంచి రూ. 78 కోట్లు వసూలు చేసి మహబూబ్ సుభానీ పరారయ్యాడు. ఎమ్మెల్యే కావ్య కృష్ణా రెడ్డి చొరవతో ఈ కుంభకోణం బహిర్గతమైంది. ఇందుకు సంబంధించి మహబూబ్ సుభానీపై పోలీసులకు పెద్ద సంఖ్యలో బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు. ముసునూరులో సుభానీ ఏడాదిన్నర నుంచి అనంతర్థ అసోషియేట్స్ పేరుతో కార్యాలయం కొనసాగిస్తున్నాడు. కొందరు పోలీసులు అతనితో చేతులు కలిపి ప్రజల నుంచి భారీగా నగదు వసూలు చేశాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి. మహబూబ్ సుభానీతో కలిసి పోలీసులే ఏజెంట్లుగా వ్యవహరించారు. మొదట్లో ఇద్దరు తహసీల్దార్లు, సీఐ, డీఎస్పీ ర్యాంక్ పోలీసు అధికారులు పెట్టుబడులు పెట్టి రూ. కోట్లలో రాబట్టుకున్నారు. మహబూబ్ సుభానీ పరారైన విషయం తెలుసుకుని బాధితులు అనంతర్థ అసోషియేట్స్ కార్యాలయం వద్దకు భారీగా వస్తున్నారు.

# ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థల క్యూ

### లోకేశ్‌ను కలిసిన ఫార్చ్యూన్ కంపెనీ సిఫీ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెట్టుబడులు పెట్టేందుకు అంగీకారం

అమరావతి : ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు క్యూకడుతున్నాయి. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఇప్పటికే పలు కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి సీఎం చంద్రబాబుతో ఒప్పందాలు చేసుకున్నాయి. అలాగే జగన్ ప్రభుత్వ హయాంలో ఏపీ నుంచి లూలు సంస్థ వెళ్లిపోయింది. ఆ సంస్థ సైతం మళ్లీ ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి అంగీకారం తెలిపింది. ఇవేగాకుండా టాటా సంస్థతోపాటు పలు ప్రముఖ ఐటీ కంపెనీలు కూడా ఏపీలో తమ సంస్థలను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చాయి. అయితే తాజాగా ఏపీ మంత్రి నారా లోకేష్‌ను ఫార్చ్యూన్ 500 కంపెనీ సిఫీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజు వేగేశ్న బుధవారం కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి లోకేష్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి సిఫీ ఛైర్మెన్ రాజు వేగేశ్న సుముఖత వ్యక్తం చేశారు. విశాఖలో మెగా డేటా సెంటర్, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుపై నారా లోకేష్ చర్చించారు. ఏపీలో పెట్టుబడులకు ప్రస్తుత అవకాశాలను మంత్రి లోకేష్ వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలపై వివరణ ఇచ్చారు. నూతనంగా తీసుకువచ్చిన ఐటీ పాలసీల గురించి లోకేష్ ప్రస్తావించారు. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాకపోవడంతో ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకలేదు. దీంతో యువత చాలా నష్టపోయింది. గత జగన్ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో లూలూ సంస్థ కూడా ఏపీ నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయింది. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో.. ఉపాధి కోసం యువత దేశంలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గ్రహించారు. అందుకే.. ఈ ఏడాది మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి, పరిశ్రమల ఏర్పాటుకు దేశవిదేశీ సంస్థలు క్యూ కడుతున్నాయి.

## జగన్ హయాంలో ఇళ్ల స్థలాల కేటాయింపులపై విచారణ

### 15లోగా అధికారులకు నివేదిక అందించేలా సర్వే

అమరావతి : గత ప్రభుత్వ హయాంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న కూటమి ప్రభుత్వం.. విచారణ తప్పదని హెచ్చరిస్తోన్న విషయం విదితమే.. అయితే, వైసీపీ హయాంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పేదలకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు, హౌసింగ్ నిర్మాణాలకు అనుమతులు పొందిన లబ్దిదారుల్లో అర్హులు, అనర్హులు విషయంలో లెక్కలు తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇళ్ల స్థలాలు, పట్టాలు పొందిన లబ్దిదారులపై పునర్విచారణ జరపాలని నిర్ణయం తీసుకుంది.. దీనికోసం ఈ నెల 10వ తేదీ నుంచి రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్దిదారుల జాబితాలో అనర్హులుంటే వారిని గుర్తించాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి.. ఇక, ఈ సమాచారాన్ని నమోదు చేసేందుకు రెవెన్యూశాఖ ప్రత్యేక మొబైల్ యాప్ ను సిద్ధం చేసింది. ఈ పక్రియ పూర్తయిన వెంటనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప÷–లోడ్ చేయాల్సి ఉంటుంది. పునర్విచారణ పక్రియను ఆయా మండలాల్లో స్థానిక తహశీల్దార్ నేతృత్వంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్, సర్వేయరు, వీఆర్వో సభ్యులుగా ఉంటారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి.. ఈ నెల 15వ తేదీలోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలంటూ 26 జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు సీసీఎల్ఏ జయలక్ష్మి.. దీంతో, వైసీపీ.. తమ పార్టీ వారికి అక్రమంగా కట్టబెట్టిన వ్యవహారం బయటపడుతుందిన కూటమి నేతలు చెబుతున్నారు..

# కోటి దాటిన టిడిపి సభ్యత్వం

అమరావతి : కోటి మందికిపైగా తెదేపా సభ్యత్వం తీసుకున్నారని ఆ పార్టీ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు అండమాన్ నికోబార్‌లోనూ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతోందన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో కోటి సభ్యత్వాలు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రమంత్రులతో చర్చిస్తూ రాష్ట్రాభివృద్ధికి లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. 'చిత్తూరు సహా పలు జిల్లాల్లో మిథున్‌రెడ్డి కుటుంబం అక్రమాలు చేసిందని ఫిర్యాదులు వస్తున్నాయి. మంగళగిరి పార్టీ కార్యాలయానికి వందల మంది వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. మీ తప్పులను వేలెత్తి చూపిన పత్రికలపై ఆరోపణలు చేస్తున్నారు'అని ఎంపీ అప్పలనాయుడు ధ్వజమెత్తారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బలంగా ఉన్నచోటే పోటీ చేస్తాం

### మిగిలిన చోట్ల కాంగ్రెస్‌తో పనిచేస్తాం : కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బలంగా ఉన్న చోట పోటీ చేస్తామని.. మిగతా చోట్ల కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీతో కలుపుకుపోతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కలిసి వస్తే ముందుకు వెళ్తామన్నారు. ఇక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నామని.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీల అభ్యర్థుల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే దానిపై చర్చిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన చేయడాన్ని తాను స్వాగతిస్తున్నామని తెలిపిన కూనంనేని.. రాష్ట్ర ప్రభుత్వం మొండి పోకడకు వెళ్లకుండా ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులను ఎన్ కౌంటర్ పేరుతో అత్యంత దారుణంగా చంపేస్తున్నారని.. దీనిపై న్యాయ విచారణ జరిపించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే.. కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టులను కలుపుకోవడంలో వైఫల్యం చెందిందని కూనంనేని చెప్పుకొచ్చారు. సమన్వయం చేసుకోవడంలో ఫెయిలైందని సాంబశివరావు అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్టు పార్టీల కలయికతోనే విజయం సాధించిందన్న విషయాన్ని హస్తం పార్టీ మర్చిపోతుందంటూ సున్నితంగానే చురకలంటించారు. దేశవ్యాప్తంగా అనేక పరిణామాలు చూస్తున్నారు కానీ.. కలుపుకోవడం తెలియడం లేదన్నారు. కులగణన సర్వే రిపోర్టును రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంగా ప్రకటించిందని.. అందుకు సంతోషం వ్యక్తం చేశారు కూనంనేని. అయితే.. అందులో బీసీలు తగ్గారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని.. గ్రామ సభల్లో ఈ అంశంపై చర్చ పెట్టాలన్నారు. ఎస్సీ కులగణనలో చిన్న చిన్న లోపాలున్నాయని తెలిపిన కూనంనేని.. వాటిని రీ వెరిఫై చేయాలన్నారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె దిశగా ఆలోచనలు చేస్తున్నారని.. వాళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బలం ఉన్నచోట పోటీ చేస్తామన్న కూనంనేని.. కుదిరిన చోట కాంగ్రెస్ పార్టీతో కలుపుకుపోతామని స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నామని తెలిపుతున్నామని తెలిపారు. టీచర్ ఎమ్మెల్సీలకు ఇంకా చర్చలు సాగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేసినవి చెప్పుకోవడం చేత కావడం



లేదని కూనంనేని చెప్పుకొచ్చారు. రూ.22 వేల కోట్ల రుణమాఫీ చేసినా కూడా చెప్పుకోవడం లేదన్నారు. అయితే.. 2 లక్షల మేర రుణమాఫీ విషయంలో ప్రభుత్వం కొంత వైఫల్యం చెందిందని కూనంనేని అభిప్రాయపడ్డారు. కొన్ని అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మంచి చేస్తుందని తెలిపారు. అన్నదాతల అకౌంట్లలో రైతు భరోసా కూడా వేస్తున్నారని చెప్పుకొచ్చారు. మోడల్ విలేజీల్లో ఇల్లు కూడా కట్టిస్తున్నారని.. కానీ చేసినవి చెప్పుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్ అయింది. ప్రభుత్వంలో ఎవ్వరు ఫోన్ కాల్స్ అటెండ్ చెయ్యడం లేదని.. ప్రభుత్వం దీన్ని గమనించాలంటటూ కూనంనేని సాంబశివ రావు షాకింగ్ కామెంట్స్ చేశారు. మరోవైపు.. మావోయిస్టులను అంతం చేసేందుకు మార్చి నెలలో ముహూర్తం పెట్టారన్న విషయాన్ని గుర్తు చేసిన కూనంనేని.. ముహూర్తాలు ఎవరు పెడతారు.. ఎందుకు పెడుతారంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజ్యాంగాన్ని కాలరాసే విధంగా మావోయిస్టులను మట్టుపెట్టడానికి ముహూర్తాలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. సంఘవిద్రోహులేమో అసెంబ్లీలో, పార్లమెంట్లో ఉంటారు.. ప్రజలకోసం పనిచేసే మావోయిస్టులను చంపేస్తారా అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా హత్యలు చేస్తున్నట్టేనని.. అతనిపై విచారణ చేయాలని కూనంనేని సాంబశివ రావు పేర్కొన్నారు.

# స్వల్పంగా దిగొచ్చిన బంగారం ధరలు

న్యూఢిల్లీ : గత కొద్ది రోజులుగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు బుధవారం ఊరట కలిగించాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల తులం బంగారం ధర రూ.710 లు తగ్గి 86వేల 670 ల వద్ద ట్రేడ్ అవుతోంది. అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.700 లు తగ్గి 79వేల 400 లకు చేరింది. ఫిబ్రవరి ప్రారంభం నుంచి బంగారం ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రారంభంలో 84 వేల 490 లున్న బంగారం ధర.. 12రోజుల్లో రూ. 2వేలకు పైగా పెరిగింది. ఇదే కంటిన్యూ అయితే మే నాటికి బంగారం ధరలు లక్షకు చేరుకునే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో మార్పులను బట్టి బంగారం ధరలు హెచ్చు తగ్గులకు లోను కావచ్చు. బంగారం ధరలు ప్రపంచ మార్కెట్లో బంగారం ధరలపై ఆధారపడి ఉంటాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి రేట్లు, కేంద్రం విధించే దిగుమతి సుంకాలు, ద్రవ్యోల్బణం, ప్రపంచ ధరలలో మార్పు, కేంద్ర బ్యాంకు బంగారు నిల్వ, వడ్డీ రేట్లలో హెచ్చుతగ్గులు, ఆభరణాల మార్కెట్లు వంటి అనేక అంతర్జాతీయ అంశాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి.

## మోడీ విమానాన్ని పేల్చేస్తామంటూ బెదిరింపులు

### ఆరా తీస్తే ఓ పిచ్చోడి పనిగా గుర్తింపు

ముంబై : విదేశీ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయాణిస్తున్న విమానానికి ఉగ్ర బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపింది. మోదీ విమానాన్ని లక్ష్యంగా చేసుకొని ఉగ్రదాడి జరగొచ్చని తమకు సమాచారం వచ్చినట్లు ముంబయి పోలీసులు వెల్లడించారు. 'ఫిబ్రవరి 11న ముంబయి పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఓ ఫోన్ కాల్ వచ్చింది. విదేశీ పర్యటనలో ఉన్న మోదీ విమానంపై ఉగ్రవాదులు దాడి జరగొచ్చు అని అవతలి వ్యక్తి బెదిరించారు. సమాచారంలో ఉన్న తీవ్రత దృష్ట్యా మేం వెంటనే ఇతర దర్యాప్తు సంస్థలను అప్రమత్తం చేశాం. కాల్ చేసిన వ్యక్తి ఎవరనే దానిపై దర్యాప్తు చేపట్టాం' అని ముంబయి పోలీసులు వెల్లడించారు. దర్యాప్తు అనంతరం ఫోన్ కాల్ చేసిన వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని ప్రాథమికంగా తెలుస్తోందని పోలీసులు వెల్లడించారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని మోదీ సోమవారం నాలుగు రోజుల విదేశీ పర్యటనకు బయల్దేరారు. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో ఉన్న ఆయన కృత్రిమ మేధ కార్యాచరణ సదస్సులో పాల్గొన్నారు. పారిస్ పర్యటనను ముగించుకొని నేడు అమెరికా బయల్దేరనున్నారు. రెండు రోజుల పాటు అగ్రరాజ్యంలో పర్యటించనున్నారు. ఈసందర్భంగా అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ కానున్నారు.

## బడ్జెట్‌పై మంత్రులు, అధికారులతో బాబు సమీక్ష

### ఈ ఏడాది నుంచే సూపర్ సిక్స్ అమలుకు కసరత్తు

అమరావతి : వార్షిక బడ్జెట్‌పై ఇఎం చంద్రబాబు కసరత్తు మొదలు పెట్టారు. ఆయా శృఖలకు కేటాయింపులు, ఆదాయం, వ్యయాలపై మదింపు చేపట్టారు. ఈనెల 28న ఉభయ సభల్లో 2025–26 వార్షిక బ్జడెట్ ప్రవేశ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండటంతో వార్షిక బడ్జెట్‌పై సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో సమీక్షించారు. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఇతర ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఏడాది నుంచి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని ఇప్పటికే ప్రకటించినందున బడ్జెట్‌లో అందుకు తగ్గ కేటాయింపులపై కీలకంగా చర్చించినట్టు తెలుస్తోంది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల అమలుకు ఈ ఏడాది నుంచే శ్రీకారం చుట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అటు పథకాలు, ఇటు అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ బడ్జెట్ కేటాయింపులు చేయడం సర్కార్‌కు సవాల్‌గా మారింది. సవాళ్లను అధిగమించాల్సిన అంశాలపై అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేసినట్టు తెలుస్తోంది.

## విజయవాడ సితార గ్రౌండ్స్ ఎగ్జిబిషన్‌లో అగ్నిప్రమాదం

### దగ్ధమైన పలు వ్యాపార స్టాళ్లు

విజయవాడ : విజయవాడ నగరంలోని సితార గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన జలకన్య ఎగ్జిబిషన్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఎగ్జిబిషన్ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఎగ్జిబిషన్‌లో వంట సామాగ్రిలో గ్యాస్ బండలు ఉండడంతో.. అవి సైతం పేలాయి. ఈ ప్రమాదంతో ఈ ఎగ్జిబిషన్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు భయంతో పరుగులు తీశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బందితోపాటు పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం మంటలను అదుపులోకి తీసుకు వచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. అగ్నిప్రమాదం ఘటనపై విజయవాడ వెస్ట్ డివిజన్ ఏసీపీ ఎన్ఎస్వీకే దుర్గారావుకు ఫోన్ చేసి హోం మంత్రి అనిత ఆరా తీశారు. ఈ ప్రమాదంలో ప్రాణ, ఆస్తి నష్టం ఏమైనా జరిగిందా? అంటూ వివరాలు అడిగి ఆమె తెలుసుకున్నారు. గ్యాస్ సిలిండర్ పేలుడు కారణంగానే మంటలు వ్యాపించాయని.. అయితే వాటిని అదుపులోకి తీసుకు వచ్చామని హోం మంత్రి అనితకు ఆయన వివరించారు.




# ఛావా ప్రీరిలీజ్ వేడుకల్లో రష్మిక

## అల్లు అర్జున్‌తో నా ఎనర్జీ సరిపోతుందని వ్యాఖ్య

ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతోంది రష్మిక. తెలుగుతో పాటు బాలీవుడ్‌లోనూ సినిమాలను చేస్తూ తీరిక లేకుండా గడుపుతోంది. విక్కీ కౌశల్ కీలక పాత్రలో లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో రూపొందిన హిస్టారికల్ ఎపిక్ యాక్షన్ ఫిల్మ్ 'ఛావా' రష్మిక కథానాయిక. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా రష్మిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇటీవల కాలంలో ఆమెతో కలిసి నటించిన హీరోల గురించి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'గొప్ప కథల్లో భాగమవడం నాకెంతో ఇష్టం. ఆ సినిమాను ప్రేక్షకులు చూసి, దాని గురించి మాట్లాడుతుంటే, మరింత సంతోషంగా ఉంటుంది. అలాంటి కథల్లోనే నటించాలనుకుంటా. నేను తెరపై కనిపించినంతసేపు ప్రేక్షకుల దృష్టి నాపై ఉండేలా చేయగలను. అదే సమయంలో ఆ సన్నివేశంలో ఎవరు నటిస్తున్నారన్న విషయాన్ని పట్టించుకోను' అని చెప్పుకొచ్చింది. తన సహ నటుల గురించి మాట్లాడుతూ వారిపై ప్రశంసలు కురిపించింది. విక్కీ కౌశల్, అల్లు అర్జున్, రణ్‌బీర్ కపూర్‌లతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా అనిపించిందని తెలిపింది. 'ఇటీవల నేను చేసిన సినిమాల్లోని కో-స్టార్స్ అందరూ ఎంతో మంచి వ్యక్తులు. స్నేహభావంతో, ఎదుటివారికి ఇబ్బంది కలగకుండా వ్యవహరిస్తారు. ముఖ్యంగా అల్లు అర్జున్ సర్‌తో నా ఎనర్జీ పర్‌ఫెక్ట్‌గా మ్యాచ్ అవుతుంది. ఆయనతో నటించడం ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఇక రణ్‌బీర్‌కు నాకూ నాన్సెన్స్ నచ్చదు. కేవలం పాత్రల గురించి తప్ప ఇతర విషయాలేవీ మాట్లాడుకోం. అంతా ప్రొఫెషనల్‌గా ఉంటాం. చివరిగా విక్కీ కౌశల్ అద్భుతమైన వ్యక్తి. ఇలాంటి వారు చాలా అరుదుగా ఉంటారు. వాళ్లతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది' అంటూ తెలిపింది రష్మిక. మరోవైపు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో 'ది గర్ల్‌ఫ్రెండ్', సల్మాన్‌ఖాన్-మురుగదాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'సికిందర్', అలాగే ధనుష్-శేఖర్ కమ్ముల ఫిల్మ్ 'కుబేర' చిత్రాల్లో రష్మిక నటిస్తోంది.




# నన్ను రాజకీయాల్లోకి లాగకండి

## లైలా హీరో విష్వక్ సేన్ పోస్ట్

'లైలా' ప్రీరిలీజ్ వేడుకలో నటుడు పృథ్వీ చేసిన రాజకీయ వ్యాఖ్యలు నెట్టింట చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. దీనిపై విష్వక్ సేన్, చిత్ర నిర్మాత సాహు గారపాటి ఇప్పటికే క్షమాపణలు చెప్పారు. అయినా 'లైలా'కు వ్యతిరేకంగా ఎక్స్ వేదికగా పోస్టులు మాత్రం ఆగడం లేదు. తాజాగా దీనిపై విష్వక్‌సేన్ మరోసారి స్పందించారు. తనను, తన సినిమాను రాజకీయాల్లోకి లాగొద్దంటూ పోస్ట్ పెట్టారు. ఈ సినిమా పాట పోస్టర్‌లను విష్వక్ సేన్ షేర్ చేశారు. 'నా సినిమాకు సంబంధించిన ప్రతి పోస్టర్.. నా సినిమాకు సంబంధించింది మాత్రమే. సినిమాల పోస్టర్స్, పోస్టులను షేర్ చేసే ప్రతిసారీ రెండుసార్లు ఆలోచించలేను. ఈ ఫొటోలో ఉంది సోనూ మోడల్.. ఫిబ్రవరి 14న మీ ముందుకు వస్తున్నాడు' అని అన్నారు. ఇక ఎక్స్‌లో ట్రెండ్ అవుతోన్న బాయ్‌కాట్ లైలా హ్యాష్‌ట్యాగ్ గురించి మాట్లాడుతూ.. ' నేను ప్రతిసారీ తగ్గను. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో జరిగిన దానికి నిన్న మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పాను. అతిగా ఆలోచించొద్దు. ప్రశాంతంగా ఉండండి. మళ్లీ చెబుతున్నాను.. నేను నటుడిని మాత్రమే. నన్ను, నా సినిమాను రాజకీయాల్లోకి లాగొద్దు' అని విష్వక్‌సేన్ చెప్పారు. విష్వక్‌సేన్ హీరోగా దర్శకుడు రామ్‌నారాయణ్ తెరకెక్కించిన చిత్రమే 'లైలా' ఆకాంక్ష శర్మ హీరోయిన్. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈసందర్భంగా ఇటీవల నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో.. తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణ విశేషాలు చెబుతూ 150 మేకల్లో చివరకు 11 మిగిలాయని నటుడు పృథ్వీరాజ్ చెప్పడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ సినిమాని బాయ్‌కాట్ చేయాలంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ మొదలైంది. ఈ హ్యాష్‌ట్యాగ్‌తో ఇప్పటివరకూ లక్షా 50వేలకు పైగా పోస్టులు షేర్ అయ్యాయి.

# రామ్‌గోపాల్ వర్మ శారీ టీజర్ విడుదల

టాలీవుడ్ విలక్షణ దర్శకుడు రామ్ గోపాల్ లేటెస్ట్ మూవీ 'శారీ'. గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో,ఆర్జీవి-ఆర్వి ప్రొడక్షన్స్ పై ప్రముఖ వ్యాపారవేత్త రవి శంకర్ వర్మ నిర్మిస్తున్నారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరో హీరోయిన్లుగా నటించిన ఈ మూవీని పలు నిజజీవిత సంఘటనల ఆధారాలతో సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది.కాగా ఈ చిత్రం పాన్ ఇండియా మూవీగా తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఫిబ్రవరి 28న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో భాగంగా తాజాగా ఈ రోజు 'శారీ' సినిమాకు సంబంధించిన ట్రైలర్ విడుదల చేశారు. ట్రైలర్ ఊహించని విధంగా చాలా థ్రిల్లింగ్ గా ఉంది. అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి బాగా చూపించారు.కొంత భయంగా కూడా ఉంది. ఇక దర్శక, నిర్మాత రామ్ గోపాల్ వర్మ 'సోషల్ మీడియాలో ఎవరెవరు ముక్కు మొహం తెలియని వాళ్ళతో పరిచయం పెంచుకుని, వాళ్ళ బ్యాక్ గ్రౌండ్ గాని, ఫోర్ గ్రౌండ్ గాని, ఏమి తెలియకుండా నమ్మేయడంతో, ఎదురయ్యే ప్రమాదాలు, భయంకర సంఘటనలు, మనం చాలా చాలా విన్నాం! చూసాం! ఇలాంటి నిజ జీవిత ఘటన ఆధారంగా తీసిన సినిమా ఈ 'శారీ' మూవీ' చెప్పారు. ఇక నిర్మాత రవిశంకర్ వర్మ మాట్లాడుతూ 'మా 'శారీ' చిత్రంలోని టీజర్, 'ఐ వాంట్ లవ్' అండ్ 'ఎగిరే గువ్వలాగా?' అనే రెండు లిరికల్ సాంగ్స్ విడుదల చేసాము. వాటికి సోషల్ మీడియాలో విశేష స్పందన లభించింది. ఈ రోజు ట్రైలర్ మాంగో మీడియా ద్వార తెలుగు, హిందీ, తమిళ, మరియు మళయాళ భాషల్లో విడుదల చేసాము.సినిమా ఈ నెల 28న అన్ని భాషల్లో థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నాం తప్పక చూడండి' అంటూ తెలిపారు.




# దబిడిదిబిడి పాట కొరియోగ్రఫీపై విమర్శలు

## ఇలా వస్తాయని ఊహించలేదంటున్న ఊర్వశి రౌతేలా

'డాకు మహారాజ్'లో అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ తో కలిసి నటించారు బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలా. ఇందులో బాలయ్యతో కలిసి ఆమె 'దబిడి దిబిడి' పాటకు డ్యాన్స్ చేశారు. ఈ పాట విడుదలైన సమయంలో కొరియోగ్రఫీపై వచ్చిన కాంట్రవర్సీ గురించి తాజాగా ఊర్వశీ రౌతేలా స్పందించారు. ప్రేక్షకుల నుంచి ఈవిధమైన స్పందన తాను అస్సలు ఊహించలేదని అన్నారు. ఆ పాట, అందులోని స్టెప్పులను ప్రేక్షకులు ఆదరిస్తారనుకున్నానని ఆమె చెప్పారు. కానీ, ఈవిధంగా మాట్లాడతారని తాను అస్సలు అనుకోలేదని తెలిపారు. 'రిహార్సల్స్ అంతా ప్రశాంతంగా జరిగింది. అన్ని పాటలకు ఏవిధంగా కొరియోగ్రఫీ ఉంటుందో అదేవిధంగా ఈ పాటకూ చేశాం. శేఖర్ మాస్టర్ ఈ పాటకు డ్యాన్స్ కొరియోగ్రఫీ చేశారు. ఇప్పటికే నాలుగుసార్లు ఆయనతో కలిసి వర్క్ చేశాను. ఆయన స్టెప్పులు చెప్పినప్పుడు నాకు ఏమాత్రం విభిన్నంగా లేదా అభ్యంతరకరంగా అనిపించలేదు. సాధారణమైన స్టెప్పుల మాదిరిగానే భావించా. కానీ, పాట విడుదలయ్యాక సోషల్‌మీడియాలో వచ్చిన విమర్శలు చూసి షాకయ్యా. కొరియోగ్రఫీని ప్రేక్షకులు తప్పుపట్టడానికి కారణం ఏమిటో అంచనా వేయడానికి కూడా సమయం లేకపోయింది. అంతా సడెన్‌గా జరిగిపోయింది. రిహార్సల్స్ చేస్తున్నప్పుడు ఇలాంటి విమర్శలు వస్తాయని మేము అస్సలు ఊహించలేదు. రిహార్సల్స్ క్లిప్స్ విడుదల చేసినప్పుడు ఎలాంటి విమర్శలు రాలేదు' అని ఊర్వశీ రౌతేలా తెలిపారు. ఏదేమైనా సోషల్‌మీడియా వేదికగా కొంతమంది కావాలని చేసే వ్యాఖ్యలను తాను పట్టించుకోనని అన్నారు. వివరణాత్మక విమర్శలను తాను స్వాగతిస్తానని చెప్పారు. బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'డాకు మహారాజ్'. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఇది విడుదలైంది. ప్రజ్ఞా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, బాబీ దేవోల్ కీలక పాత్రల్లో నటించారు. ఊర్వశీ రౌతేలా అతిథి పాత్ర పోషించారు. తమన్ స్వరాలు అందించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఇది నిర్మితమైంది. సుమారు రూ.100 కోట్లకు పైగా ఇది వసూలు చేసినట్లు అంచనా.




Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com